
మంగళవారం 2-7-2024



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 101

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

RANKED AMONG

TOP 25

SELF FINANCED INSTITUTES IN THE COUNTRY IN

ARIIA 2020

ATAL RANKING OF INSTITUTIONS ON INNOVATION ACHIEVEMENTS

BY MINISTRY OF HRD, GOVT. OF INDIA

EVERYONE COUNTS

BEST PACKAGE
AMAZON WOW 29 LAKHS

INDUSTRY CERTIFICATIONS
MICROSOFT, GOOGLE, AMAZON...

INDUSTRY OFFERED INTERNSHIPS

CENTERS OF EXCELLENCE
VIRTUSA, COGNIZANT, EPAM

INDUSTRY ACADEMIC PARTNERSHIPS FOR CURRICULUM INTEGRATION
WIPRO, SALESFORCE, INFOSYS

NANO MASTERS PROGRAM IN ASSOCIATION WITH
GERMAN UNIVERSITIES

No.1

Private Engineering College in Andhra Pradesh

by Times Rankings 2022

పిల్లలపై అత్యంత ప్రేమగల తల్లిదండ్రులు

వివిఐటిని

ఎలా కాదనగలరు ?



VVIT

VASIREDDY VENKATADRI INSTITUTE OF TECHNOLOGY

NAAC

NBA

NOBODY DOES IT BETTER

SIEMENS Centre of Excellence

Google Developers Codelabs

NAMBUR, GUNTUR, A.P, INDIA - 522 508. ✆: 99510 23336, 91003 05336, 77029 43336. WWW.VVIT.NET, **EAMCET CODE: VVIT**

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 17 | సంచిక: 101

మంగళవారం | 2-7-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



భారత మహిళల విజయం

ఏకైక టెస్టులో దక్షిణాఫ్రికాపై 10 వికెట్ల తేడాతో గెలుపు - 12లో



సరికొత్త శిఖరాలపై సూచీలు

ఐటీ, బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ - 13లో



మూడేళ్లలో న్యాయం

కొత్త నేర చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలోపు కోర్టుల్లో న్యాయం అందేలా చేస్తామని కేంద్ర హోం మంత్రి షా అన్నారు.

వివరాలు 6లో ▸



నీట్ రీటెస్ట్ పరీక్ష ఫలితాల వెల్లడి

నీట్‌-యూజీ పరీక్షల్లో గ్రేస్ మార్కులు సాధించిన అభ్యర్థులకు మళ్లీ నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఎన్‌టీఏ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



మేధా పాట్కర్‌కు 5 నెలల జైలు

సామాజిక వేత్త, ఉద్యమకారిణి మేధా పాట్కర్‌కు ఢిల్లీ కోర్టు ఐదు నెలల సాధారణ కారాగార శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



ఎమ్మెల్సీ కవితకు నిరాశ

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ దరఖాస్తులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది.

వివరాలు 14లో ▸

పింఛన్లపై పెత్తనం

మళ్లీ జన్మభూమి కమిటీలదే రాజ్యం

- ఐదేళ్లు వివక్ష లేకుండా అందించిన పెన్షన్లకు రాజకీయ రంగులు
- పేరుకు మాత్రమే సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ
- కూటమి పార్టీ నేతల కనుసన్నల్లోనే అంతా.. ఆధిపత్యం చాటుకునేందుకు టీడీపీ - జనసేన ఆరాటం
- ఏదైనా తమ ఆధ్వర్యంలోనే జరగాలంటూ టీడీపీ పట్టు
- తోక పార్టీ నాయకులు పంపిణీ చేయడానికి వీల్లేదని ఆదేశం
- ప్రశ్నించిన జనసేన మహిళా కార్యకర్తపై విజయనగరంలో దాడి
- కొన్నిచోట్ల పైచేయి కోసం టీడీపీలోనే 2 వర్గాల మధ్య ఘర్షణలు
- కార్లలో, చెట్ల కింద, రచ్చబండ, ప్రైవేట్ స్థలాలకు రప్పించడంతో లబ్ధిదారులు పడిగాపులు
- పెన్షన్ మొత్తంలో పలుచోట్ల రూ.500 చొప్పున వసూలు
- నంద్యాలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న సచివాలయ సెక్రటరీ అనుమానాస్పద మృతి



అనకాపల్లి జిల్లా నక్కపల్లి సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: ఐదేళ్లు ఎలాంటి వివక్షకు తావులేకుండా ఠంచన్‌గా, పారదర్శకంగా అందించిన పింఛన్లపై జన్మభూమి కమిటీల రాజ్యం మళ్లీ మొదలైంది. టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సోమవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తిగా రాజకీయ నేతల కనుసన్నల్లో సాగింది. ఇంటివద్ద అందించాల్సిన పెన్షన్లను కొన్నిచోట్ల చెట్ల కింద, రచ్చబండ వద్ద, ప్రైవేట్ స్థలాల్లో ఇస్తామని తిప్పడంతో

మిగతా 2వ పేజీలో ▶

వలంటీర్లతో పనిలేకుండా పింఛన్ల పంపిణీ

- వ్యవస్థలతో పని చేయిస్తే ఎలా ఉంటుందో చూపించాం
- వలంటీర్లు రూ.100 తీసుకునేవారు
- పింఛన్ల పంపిణీలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

3లో





సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, ప్రధాని మోదీ

సభలో 'హిందూ' కాక

హిందువులమంటూ హింసాద్వేషాల వ్యాప్తి

లోక్‌సభలో రాహుల్ వ్యాఖ్యల దుమారం

హిందూ సమాజంపైనే తీవ్ర వ్యాఖ్యలివి: ప్రధాని నరేంద్ర మోదీ

వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే: కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హిందువులంటే మోదీ, బీజేపీ, ఆరెస్సెస్సేనా: రాహుల్ గాంధీ

మోదీ ఆత్మతో పరమాత్మ నేరుగా సంప్రదిస్తాడట..

తనను దేవుడే పంపాడని ఆయనే స్వయంగా చెప్పుకున్నారని ఎద్దేవా

నీట్ సంపన్నుల పరీక్షగా మారిందంటూ ధ్వజం..

చర్చకు నిరాకరించిన స్పీకర్, సభ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలు సోమవారం ఊహించినట్టుగానే నీట్ దుమారానికి వేదికగా మారాయి. అది కేవలం సంపన్నుల పరీక్షగా మారిపోయిందని, ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తుకు సమాధి కడుతోందని విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ఆయన గంటా 40 నిమిషాల పాటు మాట్లాడారు. అయితే విపక్ష నేత హోదాలో రాహుల్ చేసిన తొలి ప్రసంగమే సభలో తీవ్ర దుమారం రేపింది. లక్షలాది మంది విద్యార్థుల భవిత ప్రమాదంలో పడ్డా మోదీ సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేదంటూ ఆయన దుయ్యబట్టారు. ఆ క్రమంలో చేసిన 'హిందూ'వ్యాఖ్యలు తీవ్ర కలకలానికి దారి తీశాయి. ''తాము హిందువులమని చెప్పుకునే వాళ్లు నిరంతరం హింసా ద్వేషాలను, అవాస్తవాలను వ్యాప్తి చేయడంలో మునిగి తేలుతున్నారు''అంటూ రాహుల్ తీవ్ర విమర్శలు చేయడంతో సభలో కాక రేగింది. అధికార బీజేపీ సభ్యులంతా వాటిని తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా కలగజేసుకుని రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఆక్షేపించారు. ''విపక్ష నేత మొత్తం హిందూ సమాజాన్నే హింసాత్మకమైనదిగా

మిగతా 6వ పేజీలో ▶



లీకేజీలు, ప్రమాదాలు, ఉగ్ర దాడులు..

ఇదే ప్రధాని మోదీ 'పిక్చర్'!

- రాజ్యసభలో దుయ్యబట్టిన మల్లికార్జున ఖర్గే
- ఆరెస్సెస్‌పై తీవ్ర వ్యాఖ్యలు
- రికార్డుల నుంచి తొలగింపు.. అది గొప్ప సంస్థ: చైర్మన్

6లో



టెట్‌-2024 నోటిఫికేషన్ విడుదల

10లో

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఉద్యోగాల అర్హత పరీక్షకు ఉద్దేశించిన ఏపీ టెట్ (జులై)–2024 నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. నోటిఫికేషన్ వివరాలు, సమాచార బులిటెన్ మంగళవారం నుంచి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.inలో అందుబాటులో ఉంటుందని కమిషనర్ సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ నుంచి ఫీజు చెల్లింపులు, 4వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

వీర జవాన్లకు అశ్రునివాళి

సోమవారం విజయవాడ విమానాశ్రయానికి పార్థివదేహాలు తరలింపు



సుభాన్‌ఖాన్‌కు సెల్యూట్ చేసి నివాళులర్పిస్తున్న ఆర్మీ సిబ్బంది



నాగరాజు అంతిమ యాత్రలో భారీగా పాల్గొన్న గ్రామస్తులు, స్థానికులు

విమానాశ్రయంలో ఘన నివాళులర్పించిన గవర్నర్ ఏడీసీ, ఇతర అధికారులు.. అనంతరం స్వగ్రామాలకు తరలింపు

నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు

భారీగా తరలివచ్చి జోహార్లు పలికిన గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు

సైనిక లాంఛనాలతో సుభాన్‌ఖాన్, నాగరాజుకు అంత్యక్రియలు

నేడు రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు

5లో



అమరులైన జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విజ్ఞప్తి

లద్దాఖ్ ప్రమాదంలో జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి

5లో

ఇదండీ సంగతి



మూడు వారాల్లోనే 7 వేల కోట్లు అంటే అప్పులు చేయడంలో 'అభివృద్ధి' చెందాం!!

రాష్ట్రవ్యాప్తంగా 3 రోజులు వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ద్రోణి ప్రభావంతో వచ్చే మూడురోజులు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఏపీ, యానాం మీదుగా నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని తెలిపింది. వీటి ప్రభావంతో పలు చోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాంధ్రలో తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



- మంగళవారం శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.
- బుధవారం అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.
- గురువారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.
- జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా సగటు సాధారణ వర్షపాతం 99.4 మిల్లీ మీటర్లు నమోదుకావాల్సి ఉండగా 162.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 19 జిల్లాల్లో అత్యధిక, 5 జిల్లాల్లో అధిక, 2 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ బాబ్జీ



పలువురు వీసీల రాజీనామా

- వర్సిటీల్లో కూటమి నేతల రాజకీయ విష్రక్రీడ
- పదవులకు రాజీనామా చేసి వెళ్లిపోవాలని హుకుం
- అధికారుల ద్వారా ఒత్తిడి చేసిన ప్రభుత్వ పెద్దలు
- ఇప్పటికే వీసీలుగా తప్పుకున్న కొందరు
- తాజాగా వైదొలగిన మరికొందరు

14లో

నెల్లిమర్ల జూట్‌మిల్ మళ్లీ మూత

జూట్ కొరత సాకుతో లాకౌట్ ప్రకటించిన యాజమాన్యం

రోడ్డున పడిన 2 వేల కార్మిక కుటుంబాలు

అర్ధంతర లాకౌట్‌లతో కార్మికుల ఇబ్బందులు

నెల్లిమర్ల: విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల జూట్‌మిల్ మరోసారి మూతపడింది. జూట్ కొరతను కారణంగా చూపి సోమవారం కర్మాగారాన్ని లాకౌట్ చేశారు. ఇటీవల కాలంలో తరచూ మిల్లును లాకౌట్ చేస్తుండటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. మిల్లులో పనిలేక, వేరేపనికి వెళ్లలేక కార్మిక కుటుంబాలు యాతన పడుతున్నారు. జూట్‌మిల్‌లో సుమారు 200 మంది రెగ్యులర్, మరో 1,800 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ముడి సరుకు కొరత పేరిట యాజమాన్యం మిల్‌ను అక్రమంగా మూసివేయడంపై కార్మిక కుటుంబాల ఆవేదన చెందుతున్నాయి. కొన్నేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు చెల్లించడంలో



యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల కార్మికులకు ఎలాంటి సదుపాయాలు అందటం లేదు. 2016 నుంచి గ్రాట్యుటీ బకాయిలు కూడా

మిగతా 14వ పేజీలో ▶


అనకాపల్లి జిల్లా నిడిగుంటలో పింఛను కోసం రామాలయం వద్ద అవ్వాతాతల పడిగాపులు


బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరు సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం 32వ వార్డులో చెట్టు కిందే పింఛన్ల పంపిణీ


తిరుపతిలోని సప్తగిరినగర్‌లో ఓ ఇంటి వద్ద పింఛన్ల కోసం గుంపులు గుంపులుగా లబ్ధిదారులు


ప్రకాశం జిల్లా ఒంగోలు శ్రీనగర్‌కాలనీలోని దేవాలయంలో కూర్చుని పింఛన్ల పంపిణీ..


వైఎస్సార్ జిల్లా కొత్తపల్లెలోని పాఠశాలలో పింఛన్లను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది


రాజమహేంద్రవరం 16వ డివిజన్‌లో సచివాలయ ఉద్యోగి కారు వద్దే పింఛన్ల పంపిణీ


నంద్యాల జిల్లా మిట్టకందాల గ్రామంలో చెట్టు కింద పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది


నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో చెట్టు కింద కూర్చుని పింఛన్ల పంపిణీ


కృష్ణాజిల్లా యనమలకుదురు సచివాలయం వద్ద పింఛన్లు ఇస్తున్న సిబ్బంది


పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని 6వ వార్డులో పింఛను కోసం వేచి ఉన్న లబ్ధిదారులు


ఇచ్ఛాపురంలో పింఛన్ కోసం అవ్వాతాతల పడిగాపులు

పింఛన్లపై పెత్తనం

▶ మొదటి పేజీ తరువాయి

పడిగాపులు కాసి అవస్థలు ఎదుర్కొన్నారు. పేరుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించినా పంపిణీ మొత్తం ప్రతి చోటా అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే జరిగింది. పింఛన్ల పంపిణీలో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల స్థానిక టీడీపీ నాయకులు చేతివాటం చూపినట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల సహా పలు చోట్ల కమీషన్ల కింద రూ.500 మినహాయించుకుని పింఛన్ ఇస్తున్నట్లు వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. 2014–19 మధ్య కూడా టీడీపీకి చెందిన జన్మభూమి కమిటీ సభ్యులు లంచాల వసూళ్లకు తెగబడి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అదే వాతావరణం కనిపించినట్లు వాపోతున్నారు. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో 94మంది లబ్ధిదారులకు మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదుతో ఈ నెల పింఛన్లు నిలిచిపోయాయి. ఇన్నాళ్లూ ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే ఇంటివద్దే నిశ్చింతగా కోవిడ్ కష్టకాలంలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా అందిన పింఛన్లు ఈసారి కొన్నిచోట్ల ఉదయం 8 గంటలు దాటుతున్నా చేతికి అందకపోవడంతో పలుచోట్ల లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్ల మంజూరు మొదలు పంపిణీ దాకా రాజకీయాలకు అతీతంగా, ఎవరి సిఫారసులు అవసరం లేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లను అందచేసిన విషయం తెలిసిందే. దీనికి పూర్తి భిన్నంగా తాజాగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. గ్రామాల్లోనూ, వార్డుల్లోనూ సచివాలయాల ఉద్యోగుల వెంట స్థానిక టీడీపీ, జనసేన నాయకులు మోహరించారు. ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందచేస్తూ పోటాపోటీగా నేతలు ఫొటోలు దిగారు. విజయనగరం తదితర చోట్ల తమ ఆధిపత్యం నిరూపించుకునేందుకు జనసేన–టీడీపీ నేతలు పరస్పరం దాడులకు దిగిన ఉదంతాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూటమి నేతలు కొన్ని చోట్ల తమ ప్రత్యర్థి

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు ఇవ్వొద్దు

అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలం వెంగన్నపల్లె, పుప్పాల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు పింఛన్లు ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. సచివాలయ సిబ్బందితో కలసి పింఛన్ల పంపిణీ చేపట్టిన పంచాయతీ కార్యదర్శి వసుంధరను అడ్డగించారు. పుప్పాల గ్రామంలో 35, వెంగన్నపల్లెలో 50 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు పింఛన్లు ఇవ్వకూడదంటూ టీడీపీ సర్పంచులు దేవన్న, నాగమునిరెడ్డి తమ వర్గీయులతో కలసి అడ్డుకున్నారు. దీంతో రెండు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ జరగలేదు.


పుప్పాల గ్రామంలో రాత్రి 8 గంటలకు ఉద్యోగులను అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

పార్టీకి ఓటు వేశారనే అక్కసుతో పలువురు పింఛన్లను తొలగించినట్లు వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో పెదంచలలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినందుకు తమ పింఛన్లు నిలిపివేశారంటూ కొందరు లబ్ధిదారులు సచివాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు.

తొలి రోజు 95 శాతం..

మొత్తం 64.75 లక్షల మంది లబ్ధిదారులకుగానూ తొలి రోజు సోమవారం రాత్రి ఏడు గంటల సమయానికి 61 లక్షల మంది (దాదాపు 95 శాతం)కి పైగా పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వలంటీర్లతో సంబంధం లేకుండా పూర్తిగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పంపిణీ కొనసాగించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల వలంటీర్లు వారి వెంట వెళ్లి పంపిణీలో పాల్గొన్నారు.

వృద్ధులు ఉసూరు..

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో కొన్ని వార్డుల్లో లబ్ధిదారులను నిర్దేశిత ప్రాంతానికి రావాలని ఆదేశించడంతో వృద్ధులు, దివ్యాంగులు నానా పాట్లు పడి అక్కడకు చేరుకున్నారు. కొందరి వేలిముద్రలు పడకపోవడంతో ఐరిస్‌తో ప్రయత్నించారు. చివరకు సరిపోలడం లేదని, పింఛన్ ఇవ్వలేమని చెప్పడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. పలువురు వృద్ధులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

మొదటి నెలలోనే చుక్కలు...

అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పింఛను లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తున్నారు. మా వార్డులో పంపిణీకి ఇంటికి రాలేదు. ఎక్కడ ఇస్తున్నారో తెలియదు. సచివాలయానికి వెళితే తాళం వేసి ఉంది. ముందు ముందు ఎలా ఉంటుందో చూడాలి.

సచివాలయాలకు పరుగు...

ఉదయం 8 గంటలు దాటుతున్నా సచివాలయ సిబ్బంది జాడ లేకపోవడం, పింఛన్ తీసుకోకుంటే వెనక్కి వెళ్లిపోతుందనే ఆందోళనతో విజయనగరంతోపాటు పలు ప్రాంతాల్లో లబ్ధిదారులు సచివాలయాలకు పరుగులు తీశారు. సర్వర్ సమస్యలతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. విజయనగరంలోని తోటపాలెం సచివాలయంలో ఈ పరిస్థితి కనిపించింది.

ఫించన్లపై ఫిర్యాదులు..

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెదంచల గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులంటూ కొందరికి పింఛన్లు ఇవ్వకపోవడం వాగ్వాదానికి దారి తీసింది. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు ఇవ్వలేక పోతున్నామని చెప్పడంతో గ్రామంలో పింఛను అందని వారంతా ఒకచోటకు చేరి ఆందోళనకు దిగారు. సచివాలయానికి తాళం వేసి రైతు భరోసా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సుమారు 22 మంది తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వికలాంగ గుర్తింపు సర్టిఫికెట్ పొంది పింఛను పొందుతున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాయంత్రం మూడు గంటలకు పింఛన్లు అందజేశామని సచివాలయం వెల్ఫేర్ అధికారి రవికుమార్ చెప్పారు.

ప్రకాశంలో పడిగాపులు..

ఇంటి వద్ద పంపిణీ చేయాల్సిన పింఛన్లను ప్రకాశం జిల్లాలో ఆలయాలు, స్కూళ్లు, ప్రైవేటు స్థలాల వద్దకు రప్పించడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇబ్బంది పడ్డారు. గంటల తరబడి పడిగాపులు కాశారు. చివరకు సర్వర్ పనిచేయడంలేదని చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు. ఎక్కువ చోట్ల గ్రామాల్లో రచ్చబండ వద్ద కూర్చొని పింఛన్లు పంపిణీ చేశారు.

చెట్టు కింద పింఛన్లు..

నెల్లూరులోని జాకీర్ హుస్సేన్ నగర్‌లో ఓ సచివాలయ ఉద్యోగి పింఛన్ల పంపిణీని చెట్టు కింద నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులను అక్కడికే పిలిపించుకుని పంపిణీ చేయడం విమర్శలకు తావిచ్చింది. జగనన్న ప్రభుత్వంలో ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చారని, ఇప్పుడు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లు, పంచాయతీల్లో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి వచ్చింది.

'పుట్టా' ఫిర్యాదుతో 94 మందికి ఆగిన పింఛన్లు

వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో మడూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామాల్లో గత నెల వరకు పింఛన్లు పొందిన 94 మంది లబ్ధిదారులకు ఈ దఫా డబ్బులు అందలేదు. మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదులే దీనికి కారణం. మడూరులో 40, అన్నవరంలో 28, టీఓపల్లెలో 26 మందికి పింఛన్లపై పునర్విచారణ చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో 94 మందికి పింఛన్లను ఆపాలని ఎంపీడీవో రహంతుల్లయ్య పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే తమ పింఛన్లను ఆపారని, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమనే ఇలా చేశారని, విచారణ జరిపి అర్హత ఉంటేనే తమకు పింఛను ఇవ్వాలని బాధితులు పేర్కొన్నారు.

కారు వద్దే పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరంలో ఓ సచివాలయ ఉద్యోగి తన కారు వద్దకే లబ్ధిదారులను రప్పించుకుని పింఛన్లు పంపిణీ చేశారు. 16వ డివిజన్ పరిధిలోని 41వ వార్డు సచివాలయం ఎమినిటీ సెక్రటరీ వీవీడీ ప్రసాద్‌కు వాంబే కాలనీలో పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించారు. బ్లాక్–1 వద్ద దివ్యాంగులు, వృద్ధులు, వితంతవులు తన కారు వద్దకు వచ్చి పింఛన్లు తీసుకోవాలని చెప్పడంతో చేసేది లేక లబ్ధిదారులు అక్కడ బారులు తీరారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి దీన్ని వీడియో తీశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు గంటల తరువాత ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

టీడీపీలో ఆధిపత్య పోరు

పింఛన్ల పంపిణీ టీడీపీలో వర్గ పోరుకు వేదికగా మారింది. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్టలో సుగవాసి సుబ్రమణ్యం వర్గం పంపిణీ చేపట్టగా అదే ప్రాంతంలో పార్లమెంటరీ జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహనరాజు వర్గీయలు కూడా దీన్ని ప్రారంభించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామంలో పింఛన్ల పంపిణీ సందర్భంగా టీడీపీ నాయకులు ఘర్షణకు దిగారు. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. కాగా, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రామారావు కాలనీకి చెందిన మెప్మా ఆర్పీ జాఫరున్నీసా టీడీపీ నాయకురాలిలా మెడలో పచ్చ కండువా వేసుకుని పింఛన్లు పంపిణీ చేయడంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు.

జనసేన మహిళా కార్యకర్తపై టీడీపీ నేతల దాడి

పింఛన్ల పంపిణీ సందర్భంగా విజయనగరం జిల్లాలో కూటమి నేతల్లో ఆధిపత్య పోరు బహిర్గతమైంది. టీడీపీ, జనసేన నాయకులు ఆధిపత్యం రుజువు చేసుకునేందుకు యత్నించడంతో విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని కొన్నివార్డుల్లో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. పింఛన్లను ఇంటింటికీ వెళ్లి అందించాల్సి ఉండగా కూటమి నాయకులు ఒకచోట కూర్చొని పంపిణీ చేపట్టారు. వైఎస్సార్ నగర్‌లోని కొన్ని వీధుల్లో జనసేన, మరికొన్ని చోట్ల టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. ఇక్కడ జనసేన నాయకులు పంపిణీ చేస్తున్న పింఛన్లను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఏదైనా తమ ఆధ్వర్యంలోనే జరగాలని, తోక పార్టీ నాయకులు పంపిణీ చేయడానికి వీల్లేదని చెప్పారు. వారిని ప్రశ్నించిన జనసేన మహిళా కార్యకర్తపై టీడీపీ నాయకులు దాడిచేశారు. గొడవ ఆగకపోవడంతో పింఛన్ల పంపిణీ నిలిపేశారు.


తనపై దాడి చేశారంటున్న జనసేన కార్యకర్త

నంద్యాలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న 29వ వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ సుధారాణి (32) సోమవారం రాత్రి తన ఇంట్లో బాత్‌రూమ్‌లో అనుమానాస్పద రీతిలో మరణించారు. వారం క్రితం స్థానిక సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాతోపాటు సచివాలయ ఉద్యోగులను బెదిరించినట్లు సమాచారం. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన సుధారాణి సోమవారం టీడీపీ నేతలతో కలసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్న అనంతరం అనుమానాస్పద రీతిలో మరణించారు.


సుధారాణి(ఫైల్)

కష్టాలు మొదలయ్యాయి



ఇన్నాళ్లూ జగన్ ప్రభుత్వ హయాంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే ప్రతి నెలా 1వ తేదీ ఉదయం పింఛను అందుకున్నాం. ఈసారి మాకు పింఛను అందలేదు. మరో రెండు రోజుల తరువాత గాని మాకు అందే పరిస్థితి లేదు. మాకు కష్టాలు మొదలయ్యాయి.
– బురిడి నిన్నిబుడి, బొండగుడ గ్రామం, బస్కీ పంచాయతీ, అరకులోయ మండలం, అల్లూరి జిల్లా

సాయంత్రం వరకు ఇవ్వలేదు..




గతంలో వలంటీర్లు వేకువజామునే మా ఇంటి వద్దకు వచ్చి తలుపుతట్టి పింఛను డబ్బులు ఇచ్చేవారు. ఈసారి సాయంత్రం 6 గంటల వరకు పింఛను నగదు ఇవ్వలేదు. సచివాలయ ఉద్యోగులను అడిగితే మీకు ఇప్పుడే ఇవ్వమన్నారని చెప్పారు. ఎందుకయ్యా? అని అడిగితే.. ఏమో టీడీపీ వాళ్లు చెప్పారని అంటున్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి కక్షసాధింపులు ఉండేవి కావు. అర్హులందరికీ పింఛన్లు ఇచ్చారు.
– రాజేంద్రరెడ్డి, మల్లారెడ్డికండ్రిగ గ్రామం, నగరి నియోజకవర్గం.

ఒంటరి మహిళ ఇక్కట్లు..



భర్తకు పాగొట్టుకుని వితంతు పింఛను పొందుతున్నా. గత ఐదేళ్లుగా టంఛన్‌గా ఇచ్చారు. ఈసారి రాలేదు. డబ్బుల కోసం పంచాయతీ అధికారి వద్దకు వెళితే నీ పింఛను ఆపమన్నారని చెప్పారు. అర్హత పత్రాలు పరిశీలించిన తర్వాత అధికారుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పింఛను డబ్బులే నాకు జీవనాధారం. – కందుకూరి లక్ష్మి, వితంతువు, బాధితురాలు, మడూరు గ్రామం

ఏడిపించి.. ఇచ్చారు..



కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 24వ వార్డు పురుషోత్తపురం గ్రామంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన తిరునగరి కురత్తాల్వర్ స్వామీజీకి పింఛన్ ఇవ్వడానికి టీడీపీ నాయకులు ఆయన్ని వేదనకు గురిచేశారు. ఉదయమే పింఛన్ల పంపిణీ మొదలు పెట్టినా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడంటూ ఆయన ఒక్కరికే పింఛన్ ఇవ్వకుండా ఆపేశారు. దీంతో ఆయన కన్నీరుమున్నీరయ్యారు. అనారోగ్యం కారణంగా రెండుకాళ్లు వాచిపోయాయని, అలాంటిది తనకు పింఛను ఆపేయడమేంటని ప్రశ్నించారు. ఈ విషయం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు దృష్టికి చేరడంతో సచివాలయం వెల్‌ఫేర్ కార్యదర్శి మాధవరావును పిలిపించి, ఉన్నతాధికారులతో మాట్లాడి సోమవారం రాత్రి ఏడు గంటలకు ఫించను అందజేశారు.

సచివాలయాల సిబ్బంది చేతివాటం

- పలుచోట్ల పింఛన్ల డబ్బు మాయం
- కొన్నిచోట్ల రూ.500, రూ.1,000 మినహాయించుకున్న సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం/మాచర్ల/రాప్తాడు/కుక్కునూరు/చీపురుపల్లి/పాలకొల్లు అర్బన్: పింఛన్ల పంపిణీలో తొలి రోజే సచివాలయాల సిబ్బంది చేతివాటం చూపారు. వివరాల్లోకి వెళ్తే.. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు 7వ వార్డు సచివాలయంలో మురళీ మోహన్ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. సోమవారం పింఛను పంపిణీ చేసేందుకు అధికారులు అతడికి రూ.4 లక్షలు ఇచ్చారు. ఈ క్రమంలో అతడికి రోడ్డు ప్రమాదం జరిగి కింద పడిపోగా 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తమదైన శైలిలో మురళీమోహన్‌ను విచారించగా ఆ డబ్బును అతడే వాడుకున్నట్లు తేలింది. దీంతో అతడిని సస్పెండ్ చేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలంలోని లంకలకోడేరు సచివాలయ కార్యదర్శి–2 బి.రాము పింఛన్ల డబ్బు రూ.2,50,500 తీసుకుని పరారయ్యాడు. అతడి ఫోన్ స్విచాఫ్ చేసి ఉండటంతో పంచాయతీ కార్యదర్శి రాజేష్ సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కర్లాం సచివాలయంలో వ్యవసాయ సహాయకునిగా పని చేస్తున్న రాఘవకు పింఛన్ల పంపిణీ చేయమని అధికారులు రూ.3.96 లక్షలు అందజేశారు. అయితే రాఘవ ఆ డబ్బుతో మాయమయ్యాడు. అలాగే ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం దామరచర్లలో పింఛన్లు పంపిణీ చేసే బాధ్యతలను ఉప్పేరు పంచాయతీలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సంకు ప్రసాద్‌కు అధికారులు అప్పగించారు. అతడు పింఛన్లు పంపిణీకి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ తర్వాత ఉద్యోగి స్వగ్రామమైన చింతలపూడి మండలం సీతానగరానికి వెళ్లిన అధికారులకు అతడు గాయాలతో ఇంటి వద్దే కనిపించడంతో ఊపిరి పీల్చుకున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల తొమ్మిదో వార్డుకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ ముడావత్ వాల్యానాయక్ ఒక్కో లబ్ధిదారుకు రూ.7 వేలు చొప్పున అందించాల్సి ఉండగా.. ఒక్కొక్క లబ్ధిదారు నుంచి రూ.500 చొప్పున వసూలు చేశాడు. దీనిపై మున్సిపల్ కమిషనర్ వెంకటదాసుకు ఫిర్యాదులు రావడంతో ఆయన వాల్యా నాయక్‌ను సస్పెండ్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గాండ్లపర్తిలో పింఛన్ల లబ్ధిదారులకు రూ.7 వేలు చొప్పున పంపిణీ చేయాల్సి ఉండగా.. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు దాదాపు 20 మందికి రూ.6 వేలే ఇచ్చాడు.


రోడ్డు ప్రమాదం జరిగిందని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మురళీమోహన్

నేనంటే లెక్కలేదా..?

- పెదగుమ్ములూరులో హోం మంత్రి అనిత చిందులు
- తహసీల్దార్, ఇతర అధికారులు ఎందుకు రాలేదంటూ ఎంపీడీవోపై ఆగ్రహం

ఎస్.రాయవరం: గ్రామస్థాయిలో పింఛన్ల పంపిణీకి తాను వస్తుంటే మండలస్థాయి అధికారులు ఎందుకు హాజరుకాలేదని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆమె సోమవారం అనకాపల్లి జిల్లా పెదగుమ్ములూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేదికపై ఉన్న అధికారులను చూసి మండలస్థాయి అధికారులు ఎవరు హాజరయ్యారని అడిగారు. ముందుకొచ్చిన ఎంపీడీవో సత్యనారాయణతో.. మండలంలో అధికారులు ఎక్కడ ఉన్నారు? హోం మంత్రి వస్తే తహసీల్దార్, ఇతర శాఖల అధికారులు రావాల్సిన అవసరం లేదా.. అంటూ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పింఛన్ల పంపిణీకి అధికారులు రావలసిన అవసరం లేదా.. అని ప్రశ్నించారు. అధికారుల తీరు మారలేదని, ఒకరిద్దరిపై చర్యలు తీసుకుంటే తప్ప పరిస్థితి చక్కబడేలా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గ్రామంలోకి వస్తే అనేక సమస్యల్ని ప్రజలు తనకు చెప్పారని, ఆ ఫిర్యాదులను తాను ఆఫీస్‌కు పంపించుకోవాలా అని ఆమె ప్రశ్నించారు. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ విజయలక్ష్మి హుటాహుటిన మండల కార్యాలయం నుంచి వేదిక వద్దకు వచ్చారు.


ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి అనిత

క్లుప్తంగా...

జనసేనకు రెండు విప్ పదవులివ్వండి

నాయకర్, అరవ శ్రీధర్‌ను నియమించాలని బాబుకు పవన్ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గంలో మూడు మంత్రి పదవులతోనే సరిపెట్టుకున్న జనసేన పార్టీ.. తాజాగా రెండు ప్రభుత్వ విప్ పదవులు కోరింది. తమ పార్టీకి చెందిన నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లను విప్‌లుగా నియమించాలని కోరుతూ సోమవారం సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ లేఖ రాశారు. ఈ విషయాన్ని పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

విశాఖ నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం

- రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సూపర్‌లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే రామకృష్ణబాబు

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): విశాఖ మహానగరం నుంచి అతి త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించనున్నామని రాష్ట్ర రవాణా శాఖ, క్రీడలు, యువజన సర్వీసు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. మద్దిలపాలెం సిటీ బస్‌కాంప్లెక్స్‌లో సోమవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.1.20 కోట్లతో కొనుగోలు చేసిన సూపర్ లగ్జరీ బస్సులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సర్వీసును పటిష్టంగా అమలు చేస్తామన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 1600 బస్సులను కేటాయించనున్నామన్నారు. కార్మికుల శ్రమ, కృషితో ఆర్టీసీ సంస్థ ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలరాజు, అధికారులు పాల్గొన్నారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఖరారు

- టీడీపీ నుంచి సి.రామచంద్రయ్య
- జనసేన నుంచి పిడుగు హరిప్రసాద్
- నేడు నామినేషన్లు



సి.రామచంద్రయ్య



పిడుగు హరిప్రసాద్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్డీయే కూటమి అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. రెండు స్థానాల్లో టీడీపీ, జనసేన ఒక్కొక్కటి పంచుకోవాలని నిర్ణయించారు. టీడీపీ తరఫున సి. రామచంద్రయ్య, జనసేన తరఫున పిడుగు హరిప్రసాద్ కూటమి అభ్యర్థులుగా మంగళవారం నామినేషన్లు దాఖలు చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. కూటమి సంఖ్యా బలం 164 కావడంతో వీరిద్దరి ఎన్నిక లాంఛనమే. ఎమ్మెల్సీలు అయిన రామచంద్రయ్య, మహ్మద్ ఇక్బాల్ పార్టీ ఫిరాయించడంతో వారిపై అనర్హత వేటు పడింది. దీంతో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో సి. రామచంద్రయ్యకు టీడీపీ మళ్లీ అవకాశం కల్పించగా జనసేన హరిప్రసాద్‌ను ఎంపిక చేసింది.

నిర్మాణ రంగ సమస్యలను పరిష్కరించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిర్మాణ రంగ సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఏపీ సభ్యులు కోరారు. సోమవారం సీఎం చంద్రబాబుతోపాటు మానవవనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను విడివిడిగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త ఇసుక పాలసీ వచ్చేలోగా ఇసుక లభ్యత విషయంలో బిల్డర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ప్రెసిడెంట్ రమణరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి రాజశేఖర్, రమేష్, రాంబాబు, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా అడగండి

సీఎం చంద్రబాబుకు పీసీసీ చీఫ్ షర్మిల సూచన



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం సీఎం చంద్రబాబు అడగాలని సీఎం చంద్రబాబును ఏపీసీసీ చీఫ్ షర్మిల 'ఎక్స్' వేదికగా కోరారు. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ అడుగుతున్నట్టుగానే చంద్రబాబు కూడా మన రాష్ట్రానికి కూడా హోదా అడగాలన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా.. బిహార్ కంటే వెనుకబడి ఉన్నామని, అభివృద్ధిలో ఏపీ 20 ఏళ్లు వెనుకబడిందని పేర్కొన్నారు.

ఆగని టీడీపీ శ్రేణుల విధ్వంసం

మంతెన, కేశవరం, కేదారిలంకల్లో శిలాఫలకాల ధ్వంసం

- లోవపోన్నవోలు సచివాలయ భవనంపై టీడీపీ, జనసేన జెండాలు
- కొణిజెర్లలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



కొణిజెర్లలో ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం



మంతెనలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన శిలాఫలకం



కేశవరంలో ఆర్బీకే శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం శ్రేణుల విధ్వంసకర చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి, సోమవారం పలు గ్రామాల్లో ప్రగతిపనుల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. గ్రామ సచివాలయ భవనంపై టీడీపీ, జనసేన జెండాలు ఎగురవేశారు. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు.

- కృష్ణాజిల్లా కంకిపాడు మండలం మంతెన గ్రామంలోని ప్రధాన సెంటరు సమీపంలో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గతంలో మండలంలోని గొల్లగూడెం పంచాయతీపై యువగళం జెండా ఎగురవేశారు. ఈడుపుగల్లు, కంకిపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ఉప్పలూరులో సచివాలయ భవనంపై ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన బోర్డును పగులగొట్టారు.
- నెల్లూరు జిల్లా జలదంకి మండలం కేశవరంలో నిర్మాణంలోని ప్రభుత్వ భవనాలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో ఉన్న శిలాఫలకాలను పగులగొట్టారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రాల్లో గోడలపై ఉన్న నవరత్నాల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదారిలంక పంచాయతీ కార్యాలయంపైన ఉన్న సచివాలయం గోడకు అమర్చిన నవరత్నాల శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన వివరాలు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతోసహా ఈ శిలాఫలకంపై ఉన్నాయి. గ్రామ శివారున గ్రామ పంచాయతీ తరఫున సర్పంచ్ ఫొటోతో ఉన్న స్వాగత బోర్డులను ఊడబెరికారు. ఈ ఘటనల్ని సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, నాయకులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఘటనాస్థలాన్ని మండపేట రూరల్ సీఐ శ్రీధర్, అంగర ఎస్‌ఐ అందే పరదేశి పరిశీలించి వివరాలు సేకరించారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ సచివాలయం ప్రభుత్వ ఆస్తి అని, దీన్ని ధ్వంసం చేయడం అప్రజాస్వామికమని చెప్పారు. ఈ ఘటనలకు పాల్పడిన వారిని పట్టుకోవాలని డిమాండ్ చేశారు.
- అనకాపల్లి జిల్లా మాడుగుల రూరల్ మండలంలో గిరిజన పంచాయతీ అయిన లోవపోన్నవోలు గ్రామ సచివాలయం భవనం మీద కూటమి నాయకులు తెలుగుదేశం, జనసేన జెండాలు ఎగురవేశారు. ఈ విషయమై ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావును అడగగా.. ప్రభుత్వ కార్యాలయాల మీద జాతీయజెండా మినహా పార్టీ జెండాలు పెట్టకూడదని చెప్పారు. వీటిని వెంటనే తొలగిస్తామని తెలిపారు.
- ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కొణిజెర్లలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఆ ప్రదేశాన్ని సోమవారం తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ భావితరాలకు ఆదర్శంగా గ్రామాల్లో నెలకొల్పిన నాయకుల విగ్రహాలను ధ్వంసం చేయడం అరాచక చర్య అని చెప్పారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయాలకు, కులాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేశారని, అలాంటి నాయకుడిని ప్రతి ఒక్కరు గౌరవించాల్సి ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లా కరుణాకరరావు, కావూరి వినయ్‌కుమార్, కలకొండ రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు కటుకూరి రాధమ్మ, సొసైటీ మాజీ అధ్యక్షులు నంబూరి వెంకటకృష్ణారావు, నంబూరి కృష్ణారావు, నాయకులు వెంకటరెడ్డి, బాబూరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇంటి నిర్మాణాలు ధ్వంసం

చాట్రాయి మండలం పోలవరంలో పేట్రేగిన టీడీపీ నేతలు



పోలవరంలో ధ్వంసం చేసిన ఇంటి పిల్లర్లు

చాట్రాయి: ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో టీడీపీ నాయకులు పేట్రేగిపోయారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాల్లో లబ్ధిదారులు చేపట్టిన ఇంటి నిర్మాణాలను ధ్వంసం చేశారు. ఆదివారం రాత్రి జేసీబీతో రెండు ఇళ్ల పిల్లర్లు, ఫౌండేషన్ నిర్మాణాలను పెకిలించివేశారు. ఈ ఘటన స్థానికంగా ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. పోలవరం గ్రామంలోని మంకొల్లు రోడ్డులో నాలుగో లే అవుట్‌లో 28 మంది పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటిస్థలాలు మంజూరు చేసింది. వాటికి రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు ఇచ్చింది. గ్రామానికి చెందిన లబ్ధిదారులు దానం బాబూరావు, కొంగర దేవదత్తం తమకు ఇచ్చిన స్థలాల్లో రూ.2 లక్షల వంతున వెచ్చించి ఇంటి నిర్మాణాల కోసం పునాదులు నిర్మించి, పిల్లర్లు వేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. ఇటీవల అదే గ్రామంలో జగనన్న లే అవుట్‌లో వేల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రావెల్ రోడ్లను ధ్వంసం చేశారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సొంత నియోజకవర్గంలో ఇలాంటి విధ్వంసాలు చేపట్టడం దారుణమని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి పిల్లర్లు, ఫౌండేషన్ నిర్మాణాలను పెకలించి వేయడంపై బాధితులు ఫిర్యాదు చేశారని, విచారించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లోను ఫిర్యాదు చేసినట్టు లబ్ధిదారులు చెప్పారు.

మళ్లీ పాత బాబును చూస్తారు

చెప్పినట్లు నడుచుకోకపోతే 1995 నాటి సీఎం కనిపిస్తాడు జాగ్రత్త

- రాత్రికి రాత్రే ప్రజల ఆశలు తీరిపోవు
- ఇది సీబీఎన్ 4.0
- అధికారులు కూడా కొత్త పాలనకు అలవాటు పడాలి
- పెనమాక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 65.31 లక్షల మంది లబ్ధిదారుల కోసం ఈ నెలలో రూ.4,408 కోట్లు ఖర్చు



గుంటూరు జిల్లా పెనుమాకలో పాముల నాయక్ దంపతులకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో అధికారులంతా పాతరోజులు మర్చిపోయి కొత్త రోజుల్లోకి రావాలని.. చెప్పినట్లు నడుచుకోకపోతే మళ్లీ 1995 నాటి సీఎంను చూస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఇది సీబీఎన్ 4.0 అని వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం పెనుమాక ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన లబ్ధిదారులకు స్వయంగా పింఛను అందించారు. లబ్ధిదారుడు బాణావత్ పాములు నాయక్ కుటుంబానికి మొదటగా పెన్షన్ మొత్తాన్ని అందజేశారు. నాయక్ కుమార్తె ఇస్లావతి బాయికి వితంతు పెన్షన్, పాములు నాయక్‌కు వృద్ధాప్య పెన్షన్, భార్య సీతాబాయికి రాజధాని పరిధిలో భూమిలేని వారికి ఇచ్చే వ్యవసాయ కూలీ పెన్షన్‌ను అందించారు. అనంతరం నాయక్ కుటుంబ సభ్యులతో ఆయన ముచ్చటించారు. తనకు ఇల్లులేదని సీఎంతో నాయక్ చెప్పగా ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపి.. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం.. నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఏమన్నారంటే..

ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలు

ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలు. ఐదేళ్లు వారు అణచివేతకు గురయ్యారు. ఇప్పుడు నాకు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారు. ప్రజలకు మాపై చాలా ఆశలున్నాయి. కానీ, అవన్నీ రాత్రికి రాత్రే జరిగిపోవు. రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో అర్థంకావడంలేదు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలంటే భయపడుతున్నారు. గత ఐదేళ్లలో ఇలా సంతోషంగా కూర్చొని మాట్లాడుకుంది ఒక్కరోజు కూడా లేదు. పోలీసులు ఎప్పుడు గోడ దూకి వస్తారో తెలీని పరిస్థితి. భయంకర వాతావరణంలో ప్రజలు, నాయకులు బతికారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ పెన్షన్ ఇవ్వాలని మేం పోరాడినా వినలేదు. అందుకే ఇప్పుడు 1.20 లక్షల మంది సచివాలయ సిబ్బందితో పెన్షన్లు అందిస్తున్నాం.

పోలవరంలో వాటికి మళ్లీ రూ.990 కోట్లు ఖర్చు

ఇక పోలవరం ప్రాజెక్టులో భాగమైన డయాఫ్రం వాల్‌ను నాడు జర్మన్ కంపెనీ టెక్నాలజీతో రెండు సీజన్లలోనే నిర్మించాం. కానీ, గత ప్రభుత్వం రెండేళ్ల పాటు పట్టించుకోకపోవడంతో వరదలవల్ల డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. మళ్లీ ఇప్పుడు నిర్మించాలంటే రూ.990 కోట్లు ఖర్చవుతుంది. గోదావరిలో పోలవరాన్ని ముంచి మళ్లీ ఇప్పుడు అడ్డగోలు వాదనలకు దిగుతున్నారు. ఇక రాజధాని నిమిత్తం అమరావతి రైతులు భూములిచ్చారు. దానికి ప్రతిఫలంగా కేవలం కౌలు మాత్రమే ఇచ్చాం. అయినా అక్రమాలు జరిగాయని కేసులు పెట్టారు. రోడ్లు వేసేటప్పుడు ఎవరికైనా ఇబ్బందులుంటే మాతో చెప్పండి. కోర్టులకెళ్తే పనులు ఆలస్యమవుతాయి. అలాగే, నేను వెళ్లేదారుల్లో పరదాలు కట్టినట్లు కనబడితే సస్పెండ్ చేస్తా.

నెలనెలా పెన్షన్లకు అదనంగా రూ.819 కోట్లు

రాష్ట్రంలో 28 వర్గాలకు చెందిన 65.31 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. ఇందుకు గతంలో నెలకు రూ.1,938 కోట్లు ఖర్చుచేస్తే ఇప్పుడు దానికి అదనంగా రూ.819 కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఇకపై ఏడాదికి రూ.33,100 కోట్లు పెన్షన్లకు ఖర్చుచేయబోతున్నాం. రాబోయే ఐదేళ్లలో రూ.1,65,500 కోట్లు వెచ్చిస్తాం. ఈ నెలలో రూ.4,408 కోట్లు ఖర్చు చేశాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒకేరోజు ఐదు హామీలపై సంతకాలు చేశాను. ఇక రాజధాని తరలిపోతుందని గతంలో ఇక్కడివారు బాధపడితే.. రాజధాని వస్తుందేమోనని విశాఖ వాసులు భయపడ్డారు.

వలంటీర్లతో పనిలేకుండా పింఛన్ల పంపిణీ

- వ్యవస్థలతో పని చేయిస్తే ఎలా ఉంటుందో చూపించాం
- వలంటీర్లు రూ.100 తీసుకునేవారు
- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పవన్ కళ్యాణ్



పింఛన్లు పంపిణీ చేస్తున్న పవన్ కళ్యాణ్

పిఠాపురం: వలంటీర్లు లేకపోతే అసలు పింఛన్ల పంపిణీ అసాధ్యమన్నారని, కానీ వారి అవసరం లేకుండా పింఛన్లు పంపిణీ చేసి చూపించామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఒకటో తేదీన వలంటీర్లు లేకుండానే సచివాలయాలు, వివిధ శాఖల సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. గతంలో పింఛన్ల పంపిణీలో కొందరు వలంటీర్లు లబ్ధిదారుల వద్ద రూ.100కు తక్కువ కాకుండా తీసుకునేవారని తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో ప్రభుత్వ సిబ్బందితోనే పింఛన్లు పంపిణీ చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుందని అన్నారు. లబ్ధిదారుల వద్ద డబ్బు అడిగేందుకు అవకాశం కూడా ఉండదని, ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి బాధ్యత తీసుకుంటారని చెప్పారు. వలంటీర్లు లేకుండానే వ్యవస్థలతో పని చేయిస్తే ఎలా ఉంటుందో దీని ద్వారా చేసి చూపించామన్నారు. వంద శాతం గ్రామాలకు పూర్తి స్థాయి రక్షిత మంచినీరు అందించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయడం, ప్రతి ఇంటికీ లోటు లేకుండా స్వచ్ఛమైన నీరు అందించి, ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలనేదే తన లక్ష్యమని చెప్పారు. రక్షిత మంచి నీరు, ఉపాధి, సాగునీటి కాలువల పూడికతీత వంటివి చేసి, ప్రజలకు దగ్గర కావాలనేది తన ఆకాంక్ష అన్నారు. రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలనేది తన ప్రయత్నమన్నారు. రాష్ట్రంలో ఏ పరిశ్రమ నుంచి ఎంత కాలుష్యం విడుదలవుతోందనే ఆడిట్ లెక్కలు తీయిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల నిర్వాహకులే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌కు పరాభవం

భీమవరం: పింఛన్ల పంపిణీ కరపత్రంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రాన్ని ముద్రించకపోవడం ఆయన్ని పరాభవించడమేనని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. పవన్ కళ్యాణ్ సహకారంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పింఛన్ల కరపత్రంపై కేవలం తన చిత్రాన్ని మాత్రమే ముద్రించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. కరపత్రంపై పవన్ ఫొటో ముద్రించకుండా దారుణంగా అవమానించారని వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం తాను మాత్రమే ప్రచారం పొందాలన్న యావ చంద్రబాబుకు ఇంకా పోలేదని జనసేన కార్యకర్తలు, నాయకులు విమర్శిస్తున్నారు. అంతేకాదు.. ఎన్టీఆర్ పేరుతో పంపిణీ చేస్తున్న పింఛన్ల కరపత్రంపై ఎన్టీఆర్ చిత్రాన్ని కూడా వేయకపోవడం గమనార్హం. దీనిపై ఎన్టీఆర్ అభిమానులు కూడా మండిపడుతున్నారు.

కలిసి మాట్లాడుకుందాం

- తెలంగాణ సీఎంకు చంద్రబాబు లేఖ
- ఈనెల 6న హైదరాబాద్‌లో భేటీకి ప్రతిపాదన

సాక్షి, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై కలిసి చర్చించుకుందామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా రెండు రాష్ట్రాల అభివృద్ధికి, సంక్షేమానికి పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరముందని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, రెండు రాష్ట్రాల లక్ష్యాలను సాధించడానికి సమన్వయంతో పనిచేయాల్సి వుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయ్యాయని చంద్రబాబు ఈ సందర్భంగా ఆ లేఖలో గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో.. పునర్వ్యవస్థీకరణ చట్టం వల్ల ఎదురవుతున్న సమస్యలపై ఇప్పటికే అనేక చర్చలు జరిగాయని, ఇవన్నీ సంక్షేమం, పురోగతిపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి సామరస్యంగా ముందుకెళ్లడం అత్యవసరమని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్‌లో కలుద్దామని రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిపాదించారు. ముఖాముఖి సమావేశం నిర్వహించుకుని క్లిష్టమైన సమస్యలపై సమగ్రంగా చర్చలు జరుపుదామన్నారు. ఏపీ, తెలంగాణకు పరస్పర ప్రయోజనం కలిగే పరిష్కారాలను కనుగొని అందుకనుగుణంగా సమన్వయంతో పనిచేయడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని వివరించారు.

డీఎస్సీతో మాకు అన్యాయం చేయకండి

- మా కుటుంబాలు రోడ్డున పడతాయి
- గిరిజన సంక్షేమ గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల ఆందోళన
- సీఎం నివాసం వద్ద బైఠాయించిన టీచర్లు



ముఖ్యమంత్రి నివాసం ముందు బైఠాయించి ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల నిరసన

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఎస్సీ ప్రకటనను నిరసిస్తూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం ఉండవల్లి కరకట్ట వెంట ఉన్న సీఎం చంద్రబాబు ఇంటివద్ద బైఠాయించారు. గత 15 ఏళ్లుగా గురుకుల పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నామని, తాజా నోటిఫికేషన్‌లో తమ పోస్టులు కూడా ఉండటంవల్ల తాము ఉద్యోగాలు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ వల్ల తమకు తీరని అన్యాయం జరుగుతున్నందున, తాజా నోటిఫికేషన్ నుంచి ఈ 1,143 పోస్టులను మినహాయించి, తమను టీచర్లుగా కొనసాగించాలని కోరారు. 2016లో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హాస్టల్ కన్వర్ట్ రెసిడెన్షియల్ స్కూల్ ఎగ్జామ్‌లో మెరిట్ సాధించి, జాయింట్ కలెక్టర్స్ వద్ద ఇచ్చిన డెమోలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులమయ్యామని తెలిపారు. ఉపాధ్యాయులకు ఉండవలసిన విద్యార్హతలు అన్నీ తమకు ఉన్నాయని తెలిపారు. మళ్లీ డీఎస్సీ రాయడానికి తమకు వయసు కూడా దాటిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 7 సంవత్సరాలుగా అందరికీ జీతాలు పెంచినా, తమకు మాత్రం ఒక్క పైసా కూడా పెంచలేదని తెలిపారు. తమను ఉపాధ్యాయులుగా కొనసాగించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా బీసీ, ఎస్సీ గురుకులాల పార్ట్‌టైం ఉపాధ్యాయులు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వారి డిమాండ్లను తెలిపారు.

బరితెగిస్తున్న టీడీపీ

- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అమాయకులపై దాడులు, దాష్టీకాలు
- సూపర్‌సిక్స్ అమలు చేస్తారా .. లేదా?
- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజం



కమలాపురం: సీఎం చంద్రబాబుగా పదవీ బాధ్యతలు చేపట్టిన క్షణంనుంచే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వారి ఇళ్లపై దాడులు, దౌర్జన్యాలకు బరితెగించారని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వైఎస్సార్ జిల్లా కమలాపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలాచోట్ల ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏనాడు ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. కోస్తా అంతా అప్పుడే పేకాట క్లబ్బులు వెలిశాయని చెప్పారు. అధికారులను సైతం టీడీపీ నాయకులు బూతులు తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులకు పార్టీ, తాము అండగా ఉంటామన్నారు. ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తారో లేదో తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. తాను వస్తే సంపద సృష్టిస్తానని చెప్పిన బాబు వచ్చి రాగానే అప్పులు చేశాడని, ఇక సంపద సృష్టి గాలికేనా? అని ప్రశ్నించారు. గతంలో పాఠశాల తెరిచే నాటికే జగనన్న విద్యా కానుక ఇచ్చేవారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, శరత్‌బాబు, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.



“ఒక్క క్షణమైనా శాంతి, నెమ్మదితనం లేకుండా కీర్తి, ధనం కోసం జీవితమంతా బాధాకరంగా ప్రయత్నించడం మూర్ఖత్వం.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 2 జూలై 2024

భారీ విజయం... భావి ప్రయాణం...

శనివారం రాత్రి పొద్దుపోయాక... అద్భుతమే జరిగింది. గతంలో అనేకసార్లు ఊరించి ఉసూరుమనిపించినట్టే ఈసారీ ఫలితం అటూ ఇటూగా ఉంటుందేమోనని భయపడుతున్న క్రీడాభిమానుల సందేహాలు తుదిఘట్టంలో పటాపంచలయ్యాయి. పదిహేడేళ్ళ సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. భారత క్రికెట్ జట్టు విజయపతాకం ఎగరేసింది. పొట్టి క్రికెట్ విధానంలో తొలి ప్రపంచ కప్‌ను 2007లో గెలిచిన భారత జట్టు... మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత తొమ్మిదో ప్రపంచ కప్‌ను అందుకుంది. మరెక్కడా లేనంత భారీగా, హంగులూ ఆర్భాటాలతో ఆకర్షణీయంగా, అత్యంత సంపన్నంగా టీ20 లీగ్‌ను జరిపే భారత్ మరోసారి ఆ ఫార్మట్‌లో జగజ్జేతగా నిలిచింది. జూన్ 29న వెస్టిండీస్‌లోని బార్బడోస్‌లో ఆఖరు దాకా ఉత్కంఠగా సాగిన ఐసీసీ టీ20 వరల్డ్ కప్– 2024 ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో భారత జట్టు సాధించిన విజయం చిరకాలం గుర్తుండిపోతుంది. అమెరికా, వెస్టిండీస్‌లు సంయుక్తంగా ఆతిథ్యమివ్వగా, న్యూయార్క్‌లో కొత్తగా వెలసిన స్టేడియమ్ మొదలు వివిధ కరేబియన్ దీవుల్లో సాగిన ఈ వరల్డ్ కప్ కొత్త ఉత్తేజం తెచ్చింది. చివరకు కప్ గెలుపుతో కోచ్‌గా ద్రావిడ్‌కూ, టీ20ల నుంచి రోహిత్ శర్మ, కోహ్లీ, రవీంద్ర జడేజాలకూ తీయటి వీడ్కోలు దక్కింది.

గతంలో ఎన్నో విజయాలు సాధించినా... ఫార్మట్ ఏదైనప్పటికీ ప్రపంచ కప్ విజేతగా నిలవడమనేది ఎప్పుడూ ప్రత్యేకమే. 1983లో తొలిసారిగా కపిల్‌దేవ్ సారథ్యంలోని భారత జట్టు వన్డేలలో వరల్డ్ కప్ సాధించినప్పటి నుంచి సామాన్య ప్రజానీకంలో సైతం క్రికెట్ పట్ల, ప్రపంచ కప్ పట్ల పెరిగిన ఆకర్షణ అంతా ఇంతా కాదు. ఆ తర్వాత 20 ఓవర్ల పొట్టి క్రికెట్ వచ్చాక, 2007లో మహేంద్ర సింగ్ ధోనీ సేన తొలి టీ20 వరల్డ్ కప్ మనం దక్కించుకోవడంతో ఇక ఆకాశమే హద్దయింది. 2011లో మరోసారి వన్డేల్లో వరల్డ్ కప్ కైవసం చేసుకున్నాం. లెక్కలు తీస్తే... మనం టీ20 వరల్డ్ కప్ గెలిచి 17 ఏళ్ళయితే, అసలు ఏదో ఒక ఫార్మట్‌లో ప్రపంచ కప్ గెలిచి 13 ఏళ్ళవుతోంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిర్వహించే ఏదో ఒక టోర్నీలో విజేతగా నిలిచి, స్వదేశానికి ట్రోఫీ పట్టుకొచ్చి కూడా కనీసం 11 ఏళ్ళవుతోంది. 2013లో ఇంగ్లండ్‌లో ‘ఛాంపియన్స్ ట్రోఫీ’ తర్వాత ఐసీసీ పోటీల్లో మనకు మళ్ళీ ట్రోఫీలు దక్కలేదు. ఇన్నాళ్ళకు ఆ కొరత తీరింది.

కొన్నేళ్ళుగా విజయావకాశాలు పుష్కలంగా ఉన్న ఫేవరెట్‌గా భారత క్రికెట్ జట్టు రకరకాల టోర్నీలలో బరిలోకి దిగుతోంది. కానీ, ప్రతిసారీ ఏదో ఒక దశలో విఫలమవుతోంది. కోచ్ ద్రావిడ్, కెప్టెన్ రోహిత్‌ల జోడీ సంగతికే వస్తే, ‘వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్’లో జట్టును ఫైనల్ దాకా తీసుకెళ్ళినా ఫలితం దక్కలేదు. చివరకు ఏడు నెలల క్రితం గత నవంబర్‌లో జరిగిన 2023 వన్డే వరల్డ్ కప్‌లోనూ మంచి ఫామ్‌లో ఉన్న భారత జట్టు ఆఖరి ఘట్టంలో అహ్మదాబాద్‌లో తడబడింది. ఆ రెండుసార్లూ ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ఈ తాజా టీ20 వరల్డ్ కప్‌లో సైతం మొదటి నుంచి ఓటమి ఎరుగకుండా దూసుకువచ్చిన మన జట్టు శనివారం నాటి ఫైనల్‌లో ఒక దశలో ఓటమి అంచుల దాకా వెళ్ళిపోయింది. ప్రత్యర్థి సౌతాఫ్రికా జట్టు 30 బంతుల్లో 30 పరుగులే చేయాలి. పైగా 6 వికెట్లున్నాయి. ఆ పరిస్థితుల్లో బుమ్రా కట్టుదిట్టమైన బౌలింగ్, ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా తెలివైన ఆటతీరు, బౌండరీ దాటుతున్న బంతిని అద్భుతంగా ఒడిసి పట్టుకొని ప్రత్యర్థి బ్యాట్స్‌మన్‌ను అవుట్ చేసిన సూర్యకుమార్ యాదవ్ ఫీల్డింగ్ మ్యాచ్ దిశను మార్చేశాయి.

ఎట్టకేలకు సమష్టి స్ఫూర్తితో ఓటమి కోరల నుంచి కూడా విజయాన్ని అందుకొనే కళలో భారత్ ఆరితేరింది. జట్టు అవసరాలకు తగ్గట్టు భిన్నమైన ఆట శైలిని ఆటగాళ్ళు అవలంబించడం నేర్చుకున్నారు. పోయిన పాత ఫామ్‌ను మళ్ళీ అత్యవసరమైన ఫైనల్‌లో అందుకొని, అవతల వికెట్లు పడిపోతున్నా తడబడకుండా పిచ్ వద్ద పాతుకుపోయి, కోహ్లీ 76 పరుగులు చేసిన తీరు అందుకు మచ్చుతునక. రోహిత్ శర్మ సారథ్యం, అక్సర్ పటేల్ లాంటి ఆల్‌రౌండర్ల ప్రదర్శన, కీలకమైన ఫైనల్‌లో ప్రమాదకరంగా మారిన క్లాసెన్, డేవిడ్ మిల్లర్ లాంటి బ్యాట్స్‌మన్లను ఔట్ చేసిన యువ సీమర్ అర్షదీప్ సింగ్ పరిణతి... ఇలా అన్నీ కలిస్తేనే ఈ ప్రపంచ విజేత పట్టం. దేశంలోనే అత్యంత ప్రీతిపాత్రమైన ఆట... అందులోనూ వరల్డ్‌కప్ విజయం... అర్ధరాత్రి దాటినా సరే దేశమంతటా జనం వీధుల్లోకి వచ్చి మరీ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకొన్నది అందుకే! మన దేశంలోనే కాదు... దేశదేశాల్లో పెరుగుతున్న భారత క్రికెట్ క్రీడాభిమానులకూ ఇది పండుగ వాతావరణం తెచ్చింది.

ఒక్కమాటలో, మన దేశం ఇప్పుడు క్రికెట్ సూపర్‌పవర్. ఒకప్పుడు 1970లు – 80లలో బలమైన బ్యాటింగ్, బౌలింగ్ సేనతో వీరవిహారం చేసిన వెస్టిండీస్ జట్టుతో ఇప్పుడు భారత్ ఆటగాళ్ళను విశ్లేషకులు పోలుస్తున్నారంటే ఆశ్చర్యం లేదు. మరి ఇక్కడ నుంచి మన క్రికెట్ ప్రయాణం ఎలా ముందుకు సాగనుందన్నది ఇక కీలకం. కోచ్ ద్రావిడ్ మొదలు కీలక ఆటగాళ్ళ దాకా పలువురి రిటైర్మెంట్‌తో ఒక శకం ముగిసింది. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్ళపై గతంలో పెట్టుబడి పెడితేనే ఇప్పుడీ ఫలితాలు వచ్చాయని మర్చిపోరాదు. భవిష్యత్తే లక్ష్యంగా జట్టుకు కొత్త రక్తాన్ని ఎక్కించాలి. కొత్తగా కోచ్ బాధ్యతలు చేపట్టనున్న గౌతమ్ గంభీర్ ఖాళీ అవుతున్న కీలక స్థానాల భర్తీపై దృష్టి పెట్టాలి. మ్యాచ్‌లు ఆడకున్నా ఈ వరల్డ్‌కప్ జట్టులో భాగమైన యశస్వీ జైస్వాల్ సహా పలువురు ప్రతిభావంతుల్ని ఏరి, ఇకపై మరింత సానబెట్టాలి. కొద్ది నెలల్లోనే 2025లో పాకిస్తాన్‌లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ నాటికి సర్వసన్నద్ధం కావాలి. ఆ పునర్నిర్మాణానికి తాజా విజయం ఓ బలమైన పునాది.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు : జ్యేష్ఠ మాసం ; **తిథి:** బ.ఏకాదశి ఉ.8.57 వరకు, తదుపరి ద్వాదశి ; **నక్షత్రం:** భరణి ఉ.6.18 వరకు, తదుపరి కృత్తిక తె.4.58 వరకు (తెల్లవారితే బుధవారం); **వర్జ్యం:** సా.5.49 నుండి 7.20 వరకు ; **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 9.01 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.40 వరకు ; **అమృత ఘడియలు:** రా.3.02 నుండి 4.33 వరకు ;

సూర్యోదయం : 5.33
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వ్యక్తిగత స్వేచ్ఛే... సుప్రీమ్!

విశ్లేషణ

భారత సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పులు వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని తేల్చి చెప్పాయి. పీఎమ్ఎల్‌ఏ, ఉపా వంటి చట్టాల అమలులో వ్యక్తమవుతున్న ఆందోళనల వెలుగులో ప్రాథమిక హక్కుల రక్షణ, సరైన చట్ట ప్రక్రియ ఆవశ్యకతను ఇవి నొక్కిచెప్పాయి. అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియపర్చడం కీలకమైన రాజ్యాంగ భద్రత అని న్యాయస్థానం స్పష్టం చేసింది. ‘న్యూస్ క్లిక్’ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టును రద్దు చేస్తూనే, విధానపరమైన న్యాయ ప్రాముఖ్యాన్నీ, ఉపా కింద అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియజేసే హక్కునూ ఎత్తిపట్టింది. ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నప్పుడు రాజ్యాంగ హక్కులకు మినహాయింపు ఉండదని న్యాయస్థానం తేల్చి చెప్పింది.



ఉత్కర్ష్ ఆనంద్

భారత సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పులు... మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎమ్ఎల్ఏ), చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ– ఉపా) వంటి కఠినమైన చట్టాల అమలు సందర్భంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని గట్టిగా నొక్కి వక్కాణించాయి. ఆర్థిక నేరాలను, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి రూపొందించిన ఈ చట్టాలు ఎలా వ్యవహరిస్తున్నాయి అనే విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు గణనీయమైన మార్పు తీసుకొచ్చాయి. చట్టాన్ని అమలు చేయడం, వ్యక్తిగత స్వేచ్ఛల మధ్య ప్రమాణాలను సమతుల్యం చేయడంలో సుప్రీంకోర్టు నిబద్ధతను తెలియజేసేలా, మే నెలలో వారంలోపు వ్యవధిలో ఈ తీర్పులు వెలువడ్డాయి. న్యాయబద్ధత, నిర్బంధంలోకి తీసుకునే అధికారాలను ఉపయోగించడంపై వ్యక్తమవుతున్న తీవ్రమైన ఆందోళనల వెలుగులో ప్రాథమిక హక్కుల రక్షణ, సరైన చట్ట ప్రక్రియ ఆవశ్యకతను ఇవి నొక్కిచెప్పాయి.

పీఎమ్ఎల్ఏ కింద దాఖలు చేసిన చార్జిషీట్‌పై ప్రత్యేక న్యాయస్థానం విచారణ చేపట్టిన తర్వాత మే 16న వెలువరించిన కీలకమైన తీర్పులో, వ్యక్తులను అరెస్టు చేసే విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి ఉన్న అధికారాన్ని అత్యున్నత న్యాయస్థానం కుదించింది. న్యాయస్థానం విచారణ చేపట్టిన తర్వాత, ఫిర్యాదులో పేర్కొన్న నిందితులను ఈడీ అరెస్టు చేయలేదని న్యాయమూర్తులు ఏఎస్ ఓకా, ఉజ్జల్ భుయాన్ ప్రకటించారు. విచారణ సమయంలో అరెస్టు చేయని నిందితులకు వారెంటుకు బదులుగా ప్రత్యేక కోర్టులు సమన్లు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం ఏకపక్ష నిర్బంధాలను నిరోధిస్తుంది. కోర్టుకు హాజరయ్యే వారిని మనీ లాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం కఠినమైన బెయిల్ ప్రక్రియలోకి నెట్టకుండా హామీనిస్తుంది. నిందితుడి బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అవకాశం ఇవ్వాలని సెక్షన్ 45 నిర్దేశిస్తుంది. అంతేకాకుండా, నిందితుడు నిర్దోషి అనీ, బెయిల్‌పై ఉన్నప్పుడు ఎలాంటి నేరం చేసే అవకాశం లేదనీ విశ్వసించడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయని ట్రయల్ కోర్టుకు నమ్మకం కలిగించడం అవసరం. ఈ పరిస్థితులు సాధారణంగా మనీ లాండరింగ్ కేసులో నిందితుడు బెయిల్ పొందడాన్ని సవాలుగా మారుస్తాయి. సమన్లు పంపిన తర్వాత హాజరయ్యే నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరినట్లయితే, అది సంబంధిత ట్రయల్ కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. నేరాన్ని గుర్తించిన తర్వాత ఈడీ చేసే అరెస్ట్ అధికారాలను పరిమితం చేయడం ద్వారా, కోర్టు సమన్లను పాటించిన నిందితుడిని కస్టడీలోకి తీసుకుని, అయోమయం కలిగించే, కఠినమైన పీఎంఎల్ఏ బెయిల్ ప్రక్రియలో జరిగే దుర్వినియోగాలను పరిష్కరించడం ఈ తీర్పు లక్ష్యం.

అదేవిధంగా, ఈడీ అరెస్టులు చేసే ముందు నేరాలను అంచనా వేయవలసిన అవసరాన్ని మే 17న సుప్రీంకోర్టు చేసిన న్యాయపరమైన ఉత్తర్వు నొక్కి చెప్పింది. పీఎమ్ఎల్ఏ కింద నమోదయ్యే నేరాలు ‘పరాన్నజీవి’ స్వభావంతో కూడి ఉన్నాయనీ, ముందస్తు నేరాల ఉనికి అవసరమనీ ఆ తీర్పు నొక్కి చెప్పింది. ముందస్తు నేరం లేకుండా, పీఎంఎల్ఏ ఆరోపణలు స్వతంత్రంగా నిలబడలేవని న్యాయమూర్తులు సూర్యకాంత్, కేవీ విశ్వనాథన్ నొక్కి చెప్పారు. ముందస్తు నేరంలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది నిందితుల పేర్లు లేకపోయినా, ఒక కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలను విచారించే ముందుగా ఈడీ ఆ కేసులో అంతర్లీనంగా ఉండే ముందస్తు నేరాలను క్షుణ్ణంగా నిర్ధారించాలని పేర్కొంది. ఆర్థిక నేర పరిశోధనల్లో బలమైన చట్టపరమైన ఆధారం అవసరమని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది.



ఈ దృక్పథం ఆర్థిక నేర పరిశోధనలలో బలమైన చట్టపరమైన పునాది అవసరాన్ని బలపరిచింది. పవన దిబ్బూర్ కేసులో సుప్రీంకోర్టు 2023 నవంబర్‌లో ఇచ్చిన తీర్పు హేతుబద్ధతను ఇది ముందుకు తీసుకువెళ్లింది. 2023లో కోర్టు నిర్ణయం ప్రకారం, భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 120బి కింద శిక్షార్హమైన నేరపూరిత కుట్ర, మనీ లాండరింగ్ దర్యాప్తును ప్రారంభించినంత మాత్రమే అది నేరం కాకూడదు. ఆ కుట్ర పీఎమ్ఎల్ఏ కింద తప్పనిసరిగా షెడ్యూల్ చేసిన నేరంగా నమోదు చేసిన నేరానికి సంబంధించినదై ఉండాలి.

మే 15న సుప్రీంకోర్టు తీసుకున్న మరో ముఖ్యమైన నిర్ణయం ‘న్యూస్ క్లిక్’ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టును రద్దు చేస్తూనే, విధానపరమైన న్యాయ ప్రాముఖ్యతను, ఉపా కింద అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియజేసే హక్కును ఎత్తిపట్టింది. ఢిల్లీ పోలీసుల విధానపరమైన లోపాలను న్యాయమూర్తులు బీఆర్ గవయి, సందీప్ మెహతా విమర్శించారు. ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టుకు గల కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలని చెబుతున్న రాజ్యాంగ ఆదేశాన్ని నొక్కిచెప్పారు.

భారతదేశ స్థిరత్వం, సమగ్రతకు భంగం కలిగించే ఉద్దేశ్యంతో చైనా సంస్థల ద్వారా విదేశీ నిధులను స్వీకరించిన ఆరోపణలపై 2023 అక్టోబర్‌లో పుర్కాయస్థను అరెస్టు చేసిన తరువాత ఉపా కింద పోలీసు కస్టడీకి పంపిన తీరుపై సుప్రీంకోర్టు తీర్పు తీవ్రంగా విమర్శించింది. ఆయన అరెస్టు, రిమాండ్‌ను ‘రహస్యంగా’ నిర్వహించారని కోర్టు పేర్కొంది. ‘ఇది చట్టబద్ధమైన ప్రక్రియను తప్పించుకునే కఠోరమైన ప్రయత్నం తప్ప మరొకటి కాదు; నిందితుడిని అరెస్టు చేసిన కారణాలను తెలియజేయకుండా పోలీసు కస్టడీకి పరిమితం చేశారు. న్యాయవాదుల సేవలను పొందే అవకాశాన్ని నిందితుడికి హరించారు. బెయిల్ కోరడం అనేది నిందితుడి ఎంపిక’ అని కోర్టు పేర్కొంది. ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నప్పుడు రాజ్యాంగ హక్కులకు మినహాయింపు ఉండదని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనీ లాండరింగ్ చట్టం, ఉపా చట్టం రెండింటిలోనూ అరెస్టుకు గల కారణాలను నిందితులకు రాతపూర్వకంగా తెలియజేయాలని కోరడమైనదనీ, ఈ అవసరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1)లో పేర్లొనుకుని ఉందనీ కోర్టు పేర్కొంది. ఇది తమను ఎందుకు అదుపులోకి తీసుకున్నారనే అంశంపై ప్రజల హక్కును పరిరక్షిస్తుంది. పంకజ్ బన్సాల్ కేసులో 2023 అక్టోబరు 3 నాటి తీర్పులో ఉపా కేసులకు వర్తించదంటూ ఢిల్లీ పోలీసుల వాదనకు ప్రతిస్పందనగా న్యాయస్థానం ఈవిధంగా ప్రకటించింది. దీని ప్రకారం నిందితులను అరెస్టు చేసేటప్పుడు ఈడీ పత్రబద్ధమైన ఆధారాలను అందించాలి. అరెస్టు చేయడానికి గల కారణాలను తెలియపర్చడం అనేది కీలకమైన రాజ్యాంగ భద్రత అనీ, పారదర్శకతను, న్యాయాన్ని నిర్ధారించడానికి ఏకరీతిగా దీనిని వర్తింపజేయాలని న్యాయస్థానం నొక్కి చెప్పింది. చట్టాలను అమలు చేసే సంస్థలకు విస్తృతమైన అధికారాలను కల్పించే విధానాలలోని పారదర్శకత, న్యాయమైన ఆవశ్యకతను ఈ తీర్పు పునరుద్ఘాటించింది.

వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించడానికి, చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు తగిన ప్రక్రియకు, న్యాయానికి కట్టుబడి ఉండేలా చేయడంలో సుప్రీంకోర్టు నిబద్ధతను ఈ తీర్పులు సమష్టిగా సూచిస్తాయి. ఈ నిర్ణయాలు చట్ట నియమాన్ని పటిష్ఠం చేస్తాయి. ఈడీ వంటి ఏజెన్సీలు వ్యక్తిగత స్వేచ్ఛలను గౌరవిస్తూ చట్టపరమైన సరిహద్దుల్లో పని చేసేలా చూస్తాయి. ఈ విధానం ప్రజల హక్కులను పరిరక్షిస్తుంది. ఉగ్రవాదం, ఆర్థిక నేరాలను ఎదుర్కోవడంలో కీలకమైన విధులను అందించే చట్టాల అమలు సంస్థల విశ్వసనీయతను, జవాబుదారీతనాన్ని ఏకకాలంలో ఇది పెంచుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(‘ది హిందుస్థాన్ టైమ్స్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



నీటికి కరువా?

భారత నగరాల్లో ఎందుకు వాననీటి సంరక్షణ జరగడం లేదు? నీటి కరువు రావడానికి కారణమే లేదు. మన పూర్వీకులు దీన్ని బావులు, మెట్ల బావులు, కాలువలు, సొరంగాల రూపంలో చేశారు. ఇప్పుడు భూమిలోకి నీరు ఇంకిపోలేనంతగా కాంక్రీట్‌మయం అయింది. ఓ వైపు వానాకాలంలో వరదలు ముంచెత్తుతుంటే, మరోవైపు భూగర్భ జలాలకు కొరత ఉంటోంది. సమాజం, ప్రభుత్వంలోని అన్ని స్థాయిల్లో మూర్ఖత్వం అనేది అంటువ్యాధిలా వ్యాపించివుంది.

– రిచా చడ్డా, నటి



అదా నిరసన?

ఫ్రాన్స్ తొలి రౌండ్ ఎన్నికలకు ముందు ఫార్ – రైట్‌కు వ్యతిరేకంగా ఫెమినిస్టులు కొందరు ఐఫిల్ టవర్ దగ్గర ‘టాప్ లెస్’ నిరసన జరిపారని వార్త. ఒక విషయాన్ని నొక్కి చెప్పడానికి బట్టలు తీసేయడం అనేది, రాడికల్ ఫెమినిజం స్త్రీలను నవ్వులాటగా ఎలా మార్చుతున్నదో చెప్పడానికి సరైన ఉదాహరణ.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్



ఒబామా ఎటు?

ఒక అసాధారణమైన మంచి సోర్సు నుంచి: జో బైడెన్‌కు మద్దతిస్తున్నట్టుగా ఒబామా చేసిన ట్వీట్ హృదయపూర్వకమైనది కాదు. ప్రైవేటుగా బైడెన్ గెలవలేరని ఒబామా చెబుతున్నారు. ఒబామాలు, బైడెన్ల సంబంధాలు ఎప్పుడూ బాగాలేవు. ముఖ్యంగా జిల్ బైడెన్ (అమెరికా తొలి మహిళ) వల్ల అవి ఇటీవల మరింతగా క్షీణించాయి.

– టకర్ కార్ల్‌సన్, జర్నలిస్ట్



అన్నీ అవసరమా?

ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ప్రతిదాని గురించీ గట్టి అభిప్రాయాలు ఉంచుకోవడం మానుకోండి. తెలివైనవాళ్లు చాలా విషయాలను పట్టనట్టు ఉండి, కొన్నింటిమీదే దృష్టి పెడతారు.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్



తుది బహుమతి

మా నాన్న ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించిన తర్వాత, ఆయనకు నిజంగా కొన్ని కష్టాలు తప్పాయి. వేదన నుంచి, ప్రపంచ ఆందోళనల నుంచి కొందరికి మరణమే సాంత్వన. మరణం అనేది ప్రతి ఒక్కరికీ అందాల్సిన బహుమానం.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత



విమోచన

1517 నుంచి 1917 వరకు ఒట్టోమాన్లు ఇజ్రాయెల్ నేలను ఆక్రమించి వలస రాజ్యంగా మార్చుకున్నారు. వాళ్ల నుంచి దాన్ని బ్రిటిష్‌వాళ్లు తీసుకున్నారు. 1948లో యూదులు తమ పూర్వీకుల నేలను వలసవాదం నుంచి తప్పించి విమోచన కల్పించారు.

– ఉజయ్ బులూత్, టర్కీ జర్నలిస్ట్



వినాల్సిందే!

మంచి వార్త ఏమిటంటే, ఎట్టకేలకు పదేళ్ల తర్వాత ప్రతిపక్షాల గొంతును విస్మరించలేని పార్లమెంట్ మనకు ఏర్పడింది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

కొత్త నేరచట్టాలపై ఉద్యమించాలి!

పార్లమెంట్‌ను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగం, లోక్‌సభలో స్పీకర్ వ్యవహార శైలి, జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త నేర చట్టాలు వంటి వాటిని గమనిస్తే 50 ఏళ్ల నాటి ఎమర్జెన్సీ చీకటి రోజులు మళ్లీ రాబోతున్నాయనిపిస్తోంది. ముఖ్యంగా కొత్త క్రిమినల్ చట్టాలు ప్రజాస్వామికవాదులనూ, పౌరహక్కుల కార్యకర్తలనూ ఉక్కుపాదంతో అణచేలా ఉన్నాయి.

గుజరాత్ నమూనా అంటూ ఊదరగొట్టిన మోదీ– అమిత్ షాలు దశాబ్ద కాలంగా చేస్తున్న నరమేధపు రక్తపు మరకలను ఎమర్జెన్సీ బూచి చూపి తుడిచి వేయలేరు. బిల్కిస్ బానో కేసులో ముద్దాయిలను స్వాగత సత్కారాలతో విడుదల చేయటం, డేరా బాబా లాంటి వారికి పెరోల్ ఇవ్వటం, గోవింద్ పాన్సరే, స్టాన్ స్వామి లాంటి వారి ప్రాణాలను హరించి, ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వారిని ఆరు సంవత్సరాలు నేరం నిరూపణ కాకుండానే నిర్బంధించటం, వరవరరావు, సుధా భరద్వాజ్‌లను అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో ఎట్టకేలకు విడుదల చేయటం... వంటివన్నీ మోదీ పాలన ఎంత అమానవీయంగా, అన్యాయంగా సాగుతున్నదో తెలిపే కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రాథమిక హక్కులను కాలరాసేలా ఉపా, దేశ ద్రోహం, మనీ లాండరింగ్ చట్టాలను రాజ్యాంగ విరుద్ధంగా సవరించారు. డా॥ నరేంద్ర దాభోల్కర్, కామ్రేడ్ గోవింద్, ప్రొఫెసర్ ఎమ్ఎమ్ కల్బుర్గి, గౌరీ లంకేశ్ ప్రాణాలను బలిగొన్నారు. ఇటువంటి తరుణంలో అమలులోకి తెచ్చిన కొత్త నేర చట్టాలు పోలీసులకు అపరిమిత అధికారాలను దఖలు పరుస్తున్నాయి. కేసులు నమోదు చేయడంలో వారికి హద్దూ అదుపూ లేకుండా చేస్తున్న ఈ చట్టాలు మానవహక్కుల కార్యకర్తలూ, రాజకీయ కార్యకర్తల మనుగడనే కాదు, సామాన్యుల బతుకులనూ ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కాబట్టి ఈ చట్టాలను వెంటనే ఉపసంహరించుకునేలా ప్రజలు ఉద్యమించాలి.

– దినవహి హరినాథ్, సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అవసరం కాదు... అనివార్యం!

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో విద్య, వైద్యం వంటి అనేక రంగాల్లో వైఎస్ జగన్ తీసుకువచ్చిన మార్పు విప్లవాత్మకమైనది. మొన్నటి ఎన్నికలలో జగన్ పార్టీ ఓటమికి కారణాలు బలమైనవేమీ కావు. ప్రత్యర్థులు జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలైన నవరత్నాలపై తప్పుడు ప్రచారాలతో ప్రజలను నమ్మించారు. బడుగు–బలహీన వర్గాల సంక్షేమాన్నీ, అభివృద్ధినీ ఓర్వలేని కూటమి నేతలు పనిగట్టుకొని విషప్రచారం చేశారు. కుటుంబ వ్యవహారాలను రాజకీయ అంశాలుగా చిత్రించారు. సంక్షేమ పథకాలపై పెడుతున్న దృష్టి అభివృద్ధిపై లేదని ప్రచారం చేశారు. విదేశాల్లో స్థిరపడి అమరావతిలో భూములు కొన్న కార్పొరేట్స్‌తో డబ్బులు వెదజల్లించి అడ్డదారిలో, అసంబద్ధపు ప్రేలాపనలతో కూటమి అధికారంలోకి వచ్చింది.



అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాల్లో సంక్షేమాన్ని విస్మరిస్తే వెనకబడిన జాతులు సామాజికంగా, ఆర్థికంగా మరింత నష్టపోతాయి. సంక్షేమం, అభివృద్ధి వేరు వేరు కాదని రాజకీయ పార్టీలూ, నాయకులూ గుర్తించాలి. ప్రజలకు విద్య, వైద్యం ఇవ్వడం ప్రభుత్వాల ప్రాథమిక విధి. పేదల జీవితాలను సామజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పరచకుండా దేశం ముందుకు పోదు. అభివృద్ధి చెందిన వారితో ఈ పేద ప్రజలు పోటీ పడాలంటే వారికి విద్య అవసరం అని బలంగా నమ్మారు కాబట్టే జగన్ సంక్షేమానికి పెద్దపీట వేశారు.

జగన్ సామాజిక వర్గాల వారీగా ఇవ్వాల్సిన సీట్ల కంటే ఎక్కువ ఇచ్చి సామాజిక న్యాయం పాటించారు. కాగా చంద్రబాబు జనాభా దామాషా ప్రకారం సీట్లు ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వంలో తీసుకున్న మంత్రి పదవులను ఒక్క దళితుడికి కూడా కేటాయించ లేదు.

అధికారంలోకి వస్తే మా మేనిఫెస్టోను పక్కాగా అమలుపరుస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు ఒక పథకం కూడా అమలు కాకముందే అక్రమ కట్టడాల పేరుతో వైసీపీ పార్టీ ఆఫీసులు కూలగొడుతున్నారు. ఆ పార్టీ కార్యకర్తల ఇళ్లపైనా దాడులు చేస్తూ విధ్వంసక పాలన ప్రారంభించారు. ప్రజల పక్షాన నిలబడి వారి భవితకు బంగారు బాటలు వేస్తారని ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే... పగలు, ప్రతీకారాలు తీర్చుకోవడానికి ఈ విజయాన్ని బాబు ప్రభుత్వం వాడుకోవడం శోచనీయం. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ అభివృద్ధిచేసి తాము గత పాలకుల కంటే ఎంత గొప్పవాళ్లమో నిరూపించుకోవాల్సిన కూటమి నేతలు... అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

గత ఐదేళ్ళల్లో అనేక రంగాల్లో వచ్చిన మార్పులను చూస్తే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు ‘జగన్ అవసరం కాదు... అనివార్యం’ అనిపిస్తోంది. జగన్ ఈసారి కూడా అధికారంలోకి వచ్చి ఉంటే ఒక తరం పిల్లలు గొప్ప విద్యావంతులుగా విద్యాలయాల నుంచి బయటకు వచ్చేవారు. చంద్రబాబు అధికారం చేపట్టాక ఈ తరహా అభివృద్ధి ముందుకు వెళుతుందా అన్నది సందేహమే.

– సునీల్ నీరడి, ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ రీసర్చ్ స్కాలర్

అంతరార్థం

జ్యోతిర్మయం

ఎవరైనా ఏదైనా ఒక పని చేస్తే దాన్ని చూసిన మనం అతడు అలా చేయటం మంచిదనో లేదా చెడ్డదనో వెంటనే తీర్పుచెబుతూ ఉంటాం. అలా చేయటం తగదని శ్రీ రామకృష్ణ పరమహంస రామాయణ, మహాభారతాల నుంచి కొన్ని ఉదాహరణలు చూపారు. రామరావణ యుద్ధంలో రావణ కుంభకర్ణాది యుద్ధ వీరులంతా చనిపోయారు. రావణుని తల్లి కైకశి ప్రాణభయంతో పారిపోసాగింది. లక్ష్మణుడు అలా పారిపోతున్న ఆ వృద్ధ స్త్రీని గమనించి శ్రీరామ చంద్రునితో, ‘అన్నయ్యా! ఏమిటీ వింత? అనేక మంది పుత్రులను, బంధువులను కోల్పోయి పుత్ర శోకాన్ని అనుభవిస్తూ ఇప్పుడు స్వీయ ప్రాణ రక్షణార్థం ఈ వృద్ధురాలు ఇలా ఎందుకు పారిపోతోంది?’ అని అడిగాడు. అందుకు రాముడు ‘ఆమెనే అడిగి కారణం కనుక్కొందాం’ అన్నాడు. ‘శ్రీరాముడు అభయమిచ్చాడని తెలిపి ఆమెను గౌరవంగా నా కడకు తోడ్కొని రండి’ అని కొందరిని ఆమె కడకు పంపాడు. వారు అలాగే చేశారు. ‘నీవు ప్రాణ భీతితో అలా పారిపోతున్నావా? నిజం చెప్పు’ అన్నాడు శ్రీరామ చంద్రుడు ఆమెతో. అప్పుడామె, ‘ఓ రామా! నేను జీవించి ఉన్నందునే నీ ఈ లీలలను తిలకించ గల్గుతున్నాను. ఈ భూమ్మీద నీవు ఇంకా జరుపబోయే లీలలను కూడా చూడగోరి ఇంకా కొంత కాలం జీవించాలని అభిలషిస్తున్నాను’ అని చెప్పింది. దీంతో సత్యమేమిటో అందరికీ తెలిసి వచ్చింది.

మహాభారత ఉదాహరణ చూద్దాం. భీష్ముడు అంపశయ్యపై ఉన్నాడు. శ్రీకృష్ణుడు, పంచ పాండవులు ఆయన చుట్టూ నిలబడి ఉన్నారు. మహావీరుడైన భీష్మాచార్యుల వారి కళ్ళ నుండి అశ్రువులు స్రవించటం వారు గమనించారు. అర్జునుడు శ్రీకృష్ణునితో, ‘సఖా! ఎంత విచిత్రంగా ఉంది. కురు పితామహులైన భీష్ములు మరణ సమయంలో మాయలో పడి దుఃఖిస్తున్నా రేమిటి?’ అన్నాడు. కృష్ణుడే భీష్ముడిని దాన్నిగూర్చి అడిగాడు. అప్పుడు భీష్ముడు, ‘ఓ కృష్ణా! మరణ భయంతో నేను దుఃఖించటం లేదని నీకు బాగా తెలుసు, స్వయంగా భగవంతుడే పాండవులకు సారథిగా ఉన్నప్పటికీ వారి కష్టాలకు అంతులేకుండా ఉందే! ఇలాంటి ఆలోచన వచ్చినప్పుడు భగవంతుడి లీలలను కించిత్తూ తెలుసుకోలేకుండా ఉన్నానే అని తలచుకొని దుఃఖిస్తున్నాను’ అన్నాడు (శ్రీ రామకృష్ణ కథామృతం–01).

కాబట్టి దేన్ని చూసినా, విన్నా త్వరపడి విమర్శించ కూడదు. నిజం నిలకడ మీద తేలుతుంది.

– రాచమడుగు శ్రీనివాసులు

క్లుప్తంగా...

అమరులైన జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలి

- ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: లద్దాఖ్‌లో యుద్ధ ట్యాంకు కొట్టుకుపోయిన ప్రమాదంలో భారత జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు జవాన్లు మరణించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. దేశ రక్షణలో ఈ జవాన్ల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. కృష్ణా జిల్లా పెడన మండలం చేవెంద్రకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లెకు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్‌కు చెందిన హవల్దార్ సుభాన్ ఖాన్ కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ జవాన్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అమర జవాన్ల అంత్యక్రియల్లో పాల్గొనాలని, వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని వైఎస్ జగన్ ఆదేశించారు.

ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలు పునఃప్రారంభం



విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో కార్గో సర్వీస్‌లు సోమవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. గతంలో సెక్యూరిటీ క్లియరెన్స్ రాకపోవడం కారణంగా నిలిచిపోయిన కార్గో సర్వీస్‌ను ప్రస్తుతం ఒమేగా ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకుంది. తొలుత కార్గో టెర్మినల్‌లో ఈ సర్వీస్‌ను ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎల్. లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అత్యాధునిక సాంకేతిక పరికరాలతో కార్గో సర్వీస్‌లను పునఃప్రారంభించినట్లు తెలిపారు. ఇక్కడ కార్గో సర్వీస్‌లకు మంచి డిమాండ్ ఉందన్నారు. రాష్ట్రం నుంచి ఆక్వా ఉత్పత్తులైన చేపలు, రొయ్యలతో పాటు పూలు, పండ్లు, మిర్చి తదితర వాణిజ్య ఉత్పత్తులను దేశంలో ఎక్కడికైన రవాణా చేసే సదుపాయం ఉందన్నారు. సరుకు రవాణా చేసేందుకు వీలుగా హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబాయికి పెద్ద విమానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో కూడా సరుకు రవాణా సేవలను ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు వివరించారు. పెరుగుతున్న సరుకు రవాణా డిమాండ్‌కు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న కార్గో టెర్మినల్ విస్తరించడంతో పాటు అవసరమైతే కొత్త కార్గో టెర్మినల్ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ భద్రతాధికారి వెంకటరత్నం పాల్గొన్నారు.

చిన్నారిపై మానవమృగం లైంగిక దాడి

- పోలీసుల అదుపులో నిందితుడు


నిందితుడు తరుణ్

మధురవాడ (విశాఖ): అభం శుభం తెలియని చిన్నారిపై ఓ మానవ మృగం లైంగిక దాడికి పాల్పడిన ఘటన విశాఖ నగర పరిధిలోని మధురవాడ మల్లయ్యపాలెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెంలో ఉంటున్న మోహన్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు పోలిపిల్లి తరుణ్ (19) ఇంటర్ పూర్తి చేసి చిన్న చిన్న పనులు చేస్తూ ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇచ్చి మాయమాటలు చెప్పి తాము ఉంటున్న మేడ పైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 3 గంటల సమయంలో బాలిక తల్లిదండ్రులు బయటకు వెళ్లటానికి సిద్ధమవుతున్న క్రమంలో బాలిక కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెదికారు. చిన్నారి మేడ మీద నుంచి ఏడ్చుకుంటూ కిందకు వచ్చింది. ఏమైందని అడగడంతో కడుపు నొప్పి అంటూ చెప్పి, ఇంకా సైగలు చేస్తూ మరిన్ని వివరాలు తెలియజేసింది. అనుమానం వచ్చి నిందితున్ని ఆరా తీశారు. తరుణ్ సంబంధం లేని సమాధానాలు చెప్పడంతో పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అఘాయిత్యం చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

శ్రీశైలం దేవస్థానం వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆదివారం సాయంత్రం నుంచి సేవలు నిలిచిపోయాయి. దీంతో భక్తులు ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ (మల్లన్న స్పర్శ దర్శనం) టికెట్లు పొందలేకపోయారు. ఈ క్రమంలో మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన భక్తులకు మ్యాన్‌వల్ పద్ధతిలో దేవస్థానం అధికారులు టికెట్లు జారీ చేశారు.

వీర జవాన్లకు అశ్రు నివాళి

భారీగా తరలివచ్చి జోహార్లు పలికిన గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు

విమానాశ్రయం(గన్నవరం)/రేపల్లె రూరల్/పెడన: లద్దాఖ్‌లో భారత్ – చైనా సరిహద్దు సమీపంలోని షియోక్ నదిలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన రాష్ట్రానికి చెందిన ముగ్గురు జవాన్లకు ప్రజలు అశ్రు నివాళులర్పించారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాలువపల్లెకు చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ ముత్తముల రామకృష్ణారెడ్డి, కృష్ణా జిల్లా పెడన మండలం చేవేంద్రకు చెందిన జవాను సాదరబోయిన నాగరాజు, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్‌కు చెందిన హవల్దార్ సుభాన్‌ఖాన్ మృతి చెందారు. వారి పార్థివదేహాలు సోమవారం గన్నవరం విమానాశ్రయానికి సోమవారం చేరుకున్నాయి. వీర జవాన్ల భౌతికకాయాలను ప్రత్యేక బాక్సుల్లో భద్రపరిచి భారత వాయుసేనకు చెందిన విమానంలో సాయంత్రం ఇక్కడికి తీసుకువచ్చారు. అనంతరం ఎయిర్‌పోర్ట్‌లోని ఇంటర్నేషనల్ టెర్మినల్ ఆవరణలో జవాన్ల పార్థివదేహాలను ప్రజల సందర్శనార్థం ఉంచారు. వీర జవాన్లకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తరఫున ఆయన ఏడీసీ దీపక్‌శర్మ, పలువురు సైనికాధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం జవాన్ల భౌతికకాయాలను రోడ్డు మార్గం ద్వారా వారి స్వగ్రామాలకు తరలించారు. హవల్దార్ సుభాన్‌ఖాన్, జవాను నాగరాజు అంత్యక్రియలు సోమవారం వారి స్వగ్రామాల్లో సైనిక లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు. జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు మంగళవారం ఆయన స్వగ్రామంలో ఘనంగా జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


విమానాశ్రయంలో వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న గవర్నర్ ఏడీసీ దీపక్‌శర్మ

సుభాన్‌ఖాన్‌కు అశ్రునయనాలతో తుది వీడ్కోలు

సుభాన్‌ఖాన్ (42) భౌతికకాయం సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో అతని స్వగ్రామం ఇస్లాంపూర్‌కు చేరుకుంది. సుభాన్‌ఖాన్ భౌతికకాయంను కడసారి చూసి తుది వీడ్కోలు పలికేందుకు గ్రామస్తులతో పాటు సమీప గ్రామంలోని ప్రజలు అతని గృహం వద్దకు చేరుకున్నారు. దేశరక్షణలో భాగంగా ప్రాణాలర్పించిన సుభాన్‌ఖాన్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీటిపర్యంతమయ్యారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సుభాన్‌ఖాన్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్డీవో హెలా షారోన్, డీఎస్పీ మురళీకృష్ణ, పలు శాఖల అధికారులు సుభాన్‌ఖాన్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం సైనిక, పోలీసు లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు.


సుభాన్‌ఖాన్‌కు సైనిక లాంచనాలతో అంత్యక్రియలు

17 ఏళ్ల క్రితం ఆర్మీలో జవాన్‌గా జీవితం ప్రారంభం

సుభాన్‌ఖాన్ 17 సంవత్సరాల క్రితం ఆర్మీలో సైనికునిగా చేరి అంచెలంచెలుగా హవల్దార్ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం ఈఎంఈ మెకానికల్ విభాగంలో పని చేస్తూ ప్రమాదవశాత్తు కన్నుమూశారు. సుభాన్‌ఖాన్‌కు భార్య, ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.ఆయన మరో రెండు సంవత్సరాలలో ఉద్యోగ విరమణ చేయనున్నాడు. సుభాన్‌ఖాన్ తన కుటుంబాన్ని చూసుకునేందుకు ఈ నెల 7న కైతేపల్లి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలోనే ఆయన ఆకస్మిక మృతిని జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులు సైతం కంటతడి పెట్టిస్తోంది.

జవాన్ నాగరాజుకు ఘనంగా అంతిమ వీడ్కోలు

ఆర్మీ జవాను సాదరబోయిన నాగరాజు (32) పార్థివదేహం సాయంత్రం 5.30 గంటల సమయంలో స్వగ్రామమైన చేవెండ్లకు చేరుకుంది. ఈ విషయం తెలిసి స్వగ్రామంతోపాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు వడ్లమన్నాడుకు చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా చేవేంద్రకు తీసుకొచ్చారు. అక్కడ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ నయీం ఆస్మీ, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, డీఎస్పీ, సీఐలు, పలువురు అధికారులు, వివిధ పార్టీల నాయకులు నాగరాజు పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సైనిక లాంఛనాలతో అంతిమక్రియలు నిర్వహించారు. నాగరాజు మరణం దురదృష్టకరమని, దేశం ఓ వీరుడిని కోల్పోయిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నివాళులర్పించారు.


రామకృష్ణారెడ్డి భౌతికకాయం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

ప్రభుత్వ వైద్యురాలు ఆత్మహత్య

- మెడికల్ కళాశాల భవనంపై నుంచి దూకిన వైనం
- వైద్యుల దినోత్సవం రోజు విషాదం

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు జిల్లా చేజర్ల మండలం చిత్తలూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిణిగా పనిచేస్తున్న ఎస్.జ్యోతి (38) నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, వైద్యులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన జ్యోతికి నెల్లూరుకు చెందిన రవిబాబుతో 2014లో వివాహమైంది. దంపతులకు మూడేళ్ల కుమార్తె ఉంది. భర్త రవిబాబు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నెల్లూరులోని వడ్డిపాళెంలో సాయి రెసిడెన్సీలో నివాసం ఉంటున్నారు. జ్యోతి సోమవారం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఆమెకు ఫోను వచ్చింది. ఫోను మాట్లాడుకుంటూ ఆమె మొదటి అంతస్తు నుంచి నాలుగో అంతస్తుకు వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన వైద్య విద్యార్థులు కళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవికి తెలియజేశారు. ఆమె ఘటనా స్థలానికి చేరుకుని జ్యోతికి సీపీఆర్ చేశారు. అనంతరం ఆమెను క్యాజువాల్టీకి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్‌హుస్సేన్, ఎస్‌ఐ అరుణజ్యోతి మృతురాలి భర్తను విచారించగా.. తాము ఎంతో అన్యోన్యంగా ఉంటున్నామని, తమ మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేవని చెప్పారు. జ్యోతి ఆత్మహత్య విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు తెలియజేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. జ్యోతికి ఫోన్ చేసిందెవరనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. డాక్టర్స్ డే రోజే ఈ విషాదకర ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని సహచర వైద్యులు, సన్నిహితులు కన్నీటి పర్యంతమయ్యారు.


ఎస్.జ్యోతి (ఫైల్)

దాడులకు గురైన ఆర్యవైశ్యులను ఆదుకోండి

అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమానసంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగాంజనేయులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన దాడుల్లో చనిపోయిన, గాయపడిన ఆర్యవైశ్య కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 18 రోజుల్లోనే నలుగురు ఆర్యవైశ్యులు దాడులకు గురయ్యారని, వారిలో ఇద్దరు మరణించారని తెలిపారు. తొలిదాడి శ్రీశైలంలో జరిగిందని, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన ఆర్యవైశ్యుడి మీద దాడిచేసి గాయపరిచారని, తరువాత చీరాలలో క్రకెట్ పాయింట్ నిర్వాహకుడైన నిరుపేద ఆర్యవైశ్య యువకుడిని కత్తితో పొడిచి చంపారని చెప్పారు. తరువాత ఒంగోలులో తనపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని, విజయవాడలో కిరాణా వ్యాపారం చేసుకుని జీవించే ఒక ఆర్యవైశ్యుడిని కుమార్తె ప్రియుడే చంపాడని తెలిపారు. ఈ హత్యకు పాల్పడిన యువకుడు విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ దగ్గర తిరుగుతుంటాడని తెలిసిందన్నారు. తెలుగుయువత అధ్యక్షుడు బోడేపూడి శివప్రసాద్, టీడీపీ వాణిజ్య విభాగం నాయకులు నలుగురితో తనకు ఎలాంటి పరిచయంగానీ, లావాదేవీలుగానీ లేవన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే వారిని తనమీదకు పంపించి దాడి చేయించారని ఆరోపించారు. తన మీద దాడిచేసిన వారిలో ఆర్యవైశ్యులు కూడా ఉన్న విషయం తెలిసి సిగ్గుతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఆర్యవైశ్యులు ఎక్కడా ఎవరి మీద దాడులకు పాల్పడరని, ఒంగోలులో మాత్రం దాడిచేశారని పేర్కొన్నారు. తన మీద కోపంతో నగరంలోని మంగమూరు డొంకలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని అవమానపరుస్తున్నారని, రాష్ట్రం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడిని అవమానపరచడం తగదని చెప్పారు. ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాజీ మంత్రి వేణుకు మాతృవియోగం


సుభద్రమ్మ (ఫైల్)

సాక్షి, అమరావతి/రామచంద్రపురం: మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తల్లి సుభద్రమ్మ (94) సోమవారం ఉదయం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తారు. మాజీ విప్, నరసాపురం మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు, రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు సుభద్రమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వైఎస్ జగన్ సంతాపం

వేణుగోపాలకృష్ణ మాతృమూర్తి సుభద్రమ్మ మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సుభద్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు సంతాప సందేశంలో పేర్కొన్నారు. వేణుగోపాలకృష్ణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, పలువురు నేతలు సంతాపం ప్రకటించారు.

ఆక్వా రైతుల ఉద్యమ బాట

- ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు
- వాటిని పరిష్కరించకుంటే క్రాప్ హాలిడే ప్రకటిస్తామని హెచ్చరిక
- ఈ నెల 3న ఛలో పాలకొల్లుకు పిలుపు
- పాలకొల్లులో భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన

సాక్షి, అమరావతి: ఆక్వా రంగ సమస్యల పరిష్కారానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆక్వా రైతులు ఉద్యమ బాట పడుతున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే క్రాప్ హాలిడే ప్రకటించేందుకూ సిద్ధమవుతున్నారు. ఈ నెల 3న తలపెట్టిన 'ఛలో పాలకొల్లు' ద్వారా భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నారు. అకాడెమీ ఆఫ్ సస్టైనబుల్ ఇంటిగ్రేటెడ్ లివింగ్, జై భారత్ క్షీర రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి తీర ప్రాంత జిల్లాల రైతులు పాల్గొంటున్నారు. ఈ సమావేశంలో చర్చించే అంశాలు, తీర్మానాల వివరాలను అకాడెమీ ఆఫ్ సస్టైనబుల్ ఇంటిగ్రేటెడ్ లివింగ్ డైరెక్టర్ షేక్ అలీ హుసేన్, ఆక్వా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, బోనం చినబాబు సోమవారం మీడియాకు వివరించారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆక్వా సాగుకు క్రాప్ హాలిడే ప్రకటిస్తామని హెచ్చరించారు.



ఆక్వా రైతుల డిమాండ్లు ఇవీ..

- ఆక్వా రంగం బలోపేతానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఏటా కనీసం రూ.1000 కోట్లు కేటాయించాలి
- జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లకు అనుగుణంగా చేపలు, రొయ్యలకు కనీస మద్దతు ధర ప్రకటించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- దేశంలోనే ఎక్కడా లేని విధంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలి
- అప్సడా చట్టం ద్వారా హేచరీలను నియంత్రించాలి. నాణ్యత లేని వనామీ రొయ్యల మేత తయారు చేసే కంపెనీలను మూసివేయాలి.
- అప్సడా చట్టం ద్వారా ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్‌ను మరింత సరళతరం చేసేందుకు మండల స్థాయిలో రిజిస్ట్రేషన్ మేళాలు నిర్వహించాలి
- వ్యవసాయ, ఉద్యాన పంటల మాదిరిగానే మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా ఏపీ ఆక్వా ఉత్పత్తులు ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలో ఏటా పంటల ప్రణాళిక ముందస్తుగా తయారు చేసి కచ్చితంగా అమలు చేయాలి
- ఆక్వా సాగుకు ఉపయోగించే పెట్రో ఉత్పత్తులను జిల్లా పౌర సరఫరాల సంస్థ ద్వారా సబ్సిడీపై అందించాలి
- ఆక్వా సాగుకు ఉపయోగించే విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లలో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ ద్వారా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి
- ఆక్వా రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి సింగిల్ విండో విధానం ప్రవేశపెట్టాలి.
- దళారీల వల్ల మోసపోతున్న రైతుల కోసం తీర ప్రాంత జిల్లాల్లో ఆక్వా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి
- నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్స్‌కు అనుబంధంగా మండలానికో ల్యాబ్, మండలానికో యాంటీ బయాటిక్ ల్యాబ్ ఏర్పాటు చేయాలి
- గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఆక్వా యూనివర్శిటీని వేగంగా పూర్తి చేసేందుకు తక్షణమే రూ.350 కోట్లు కేటాయించాలి. యూనివర్సిటీ ద్వారా వనామీ రొయ్యల సాగులో మెళకువులపై రైతులకు శిక్షణ ఇవ్వాలి
- ఆక్వా పరికరాలకు 90 శాతం సబ్సిడీ, రిటైల్ అవుట్‌లెట్లకు 90 శాతం ఆర్థిక సాయం అందించాలి
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తీరప్రాంత జిల్లాల్లో ఆక్వా ఉత్పత్తుల నిల్వకు 90 శాతం సబ్సిడీతో శీతల గిడ్డంగులు నిర్మించాలి
- జోన్‌తో సంబంధం లేకుండా ఎకరాకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా చేయాలి. హేచరీలు, ఆక్వా నర్సరీలు, ప్రాసెసింగ్ యూనిట్లకు కూడా సబ్సిడీపై విద్యుత్ అందించాలి.
- తల్లి రొయ్యలు, లార్వా, పోస్ట్ లార్వా ఫీడ్లతో పాటు మేత తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల దిగుమతిపై సుంకం ఎత్తివేయాలి

కరిష్మా మృతిపై నిజాలు నిగ్గుతేల్చండి

- సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డీజీపీకి మహిళా కమిషన్ లేఖ
- పాయకరావుపేటలో మహిళలను వివస్త్రలను చేసిన ఘటనపై సీరియస్
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశం



సాక్షి, అమరావతి: విజయవాడలో మదర్సా విద్యార్థిని కరిష్మా(17) అనుమానాస్పద మృతిపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. బాలిక శరీరంపై గాయాలున్నాయని.. ఆమె మరణించిన తర్వాత ఆస్పత్రికి తీసుకురావడంపై కరిష్మా తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరిస్తున్నట్లు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసును సున్నితమైన అంశంగా భావించి సమగ్ర దర్యాప్తు చేయాలని రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. ఈ ఘటనకు సంబంధించిన ప్రాథమిక నివేదికను పంపించాలని విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్‌ను గజ్జల వెంకటలక్ష్మి కోరారు. పోలీస్ శాఖ సమర్థవంతంగా దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం కోటవూరుట్లలో ఇద్దరు మహిళలపై టీడీపీ నేతలు దాడి చేసి వివస్త్రలను చేసిన ఘటన మీద మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి తీవ్రంగా స్పందించారు. స్థల ఆక్రమణను అడ్డుకున్నారనే కారణంతో మహిళలపై దౌర్జన్యం చేసి వివస్త్రలను చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వీటిని సీరియస్‌గా తీసుకోవాలని.. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. పోలీస్ చర్యలపై కమిషన్‌కు నివేదిక పంపాలని అనకాపల్లి ఎస్పీని వెంకటలక్ష్మి ఆదేశించారు.

నలుగురు రేషన్ డీలర్ల తొలగింపు

నల్లజర్ల మండలంలో టీడీపీ నేతల ఒత్తిడితో అధికారుల చర్యలు



నల్లజర్ల: వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులుగా, పరోక్షంగా సంబంధాలు కలిగి ఉన్నారనే కక్షతో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో నలుగురు రేషన్ డీలర్లను విధుల నుంచి తొలగించారు. గంటావారిగూడెంలో 36వ నంబర్ రేషన్ డిపో డీలర్ ఏసుబాబు తాత్కాలిక ప్రాతిపదికన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా కూడా పని చేస్తున్నారు. దీంతో ఏసుబాబు స్థానంలో ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అన్నవరం కొంతకాలంగా డిపో నిర్వహిస్తున్నారు. టీడీపీ గెలుపొందిన అనంతరం ఉద్యోగం ఉన్నందున డీలర్‌షిప్ వదులుకోవాలంటూ ఏసుబాబుపై ఒత్తిళ్లు తెచ్చి రాజీనామా చేయించారు. అదేసమయంలో టీడీపీలోకి వస్తే యథావిధిగా రేషన్ షాపు నడుపుకోవచ్చని ఆ పార్టీ నేతలు ఆఫర్ ఇవ్వగా, ఆయన అంగీకరించలేదు. అలాగే, పోతవరంలో 26వ నంబర్ రేషన్ డిపోను కానూరి హేమామాలిని ఈ ఏడాది మే నెలలో మహిళా సంఘం తరఫున తీసుకున్నారు. కేవలం రెండు నెలలే పని చేశారు. ఆమె పెదనాన్న పోతవరం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కావడంతో హేమామాలినీని డీలర్‌గా తప్పించారు. పడమర చోడవరంలో 18వ నంబర్ రేషన్ డిపో డీలర్ శ్రీలక్ష్మి కుమారుడు సాయి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి తిరుగుతుంటారు. ఈ నేపథ్యంలో శ్రీలక్ష్మి డీలర్‌షిప్ కూడా రద్దు చేశారు. తూర్పు చోడవరంలో 17వ నంబర్ డిపోను ధనేష దీపిక నిర్వహిస్తున్నారు. ఆమె తాత గంగారావు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తన ఇంటి వద్ద ఆశ్రయం ఇవ్వడంతో దీపిక డీలర్‌షిప్ రద్దు చేశారని చెబుతున్నారు. అయితే, గంటావారిగూడెం డీలర్ స్వచ్ఛందంగానే రాజీనామా చేశారని, మిగిలినవన్నీ తాత్కాలిక డీలర్‌షిప్‌లేనని సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. వారిపై ఆయా గ్రామాల్లో ఫిర్యాదులు వచ్చాయని, విచారణ జరిగిందని, జిల్లా పౌరసరఫరాల అధికారికి నివేదిక పంపామని, అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా పక్క డీలర్లను ఇన్‌చార్జిలుగా నియమించామని చెప్పారు.

సభలో హిందూ కాక

రాహుల్ వ్యాఖ్యలపై దుమారం • దుయ్యబట్టిన మోదీ


సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్

▶ మొదటి పేజీ తరువాయి

అభివర్ణించారు. ఇది చాలా తీవ్రమైన అంశం''అంటూ దుయ్యబట్టారు. వాటిని రాహుల్ తోసిపుచ్చారు. తన వ్యాఖ్యలు కేవలం బీజేపీని ఉద్దేశించినవి మాత్రమేనని స్పష్టం చేశారు. ''హిందూ సమాజమంటే కేవలం బీజేపీ, ఆరెస్సెస్, మోదీ మాత్రమే కాదు''అంటూ చురకలు వేశారు. నిర్భీతి, అహింస గురించి మాట్లాడుతూ శివుడు, గురు నానక్, జీసస్ ఫొటోలు సభలో ప్రదర్శించారు. సభలో మత చిహ్నాల ప్రదర్శనకు నిబంధనలు అంగీకరించబోవని స్పీకర్ ఓం బిర్లా వారిస్తున్నా పట్టించుకోలేదు. ''అన్ని మతాలూ, అందరు మహానుభావులూ చెప్పింది అహింస, నిర్భీతి గురించే. కానీ తాము హిందువులమని చెప్పుకునే వాళ్లు మాత్రం కేవలం హింస, ద్వేషం, అసత్యాల గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. ఏ లెక్కన చూసుకున్నా మీరసలు హిందువులే కాదు''అంటూ బీజేపీ నేతలను దుయ్యబట్టారు. ''మైనారిటీలు దేశానికి గర్వకారణం. అన్ని రంగాల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశభక్తులు. వారిపైనా బీజేపీ దారుణంగా దాడులకు దిగుతోంది. ముస్లిం

లు, సిక్కులు, క్రైస్తవులపై హింసాద్వేషాలను వ్యాప్తి చేస్తోంది''అని ఆక్షేపించారు. రాహుల్ ప్రసంగాన్ని ఆయన తల్లి సోనియాగాంధీ, సోదరి ప్రియాంకా గాంధీ వద్రా లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీ నుంచి వీక్షించారు.

హిందువులంతా హింసావాదులా?

రాహుల్ వ్యాఖ్యలపై నిరసనలతో బీజేపీ సభ్యులు హోరెత్తించారు. రాహుల్ తక్షణం సభకు క్షమాపణ చెప్పి తీరాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. ''దేశంలో కోట్లాది హిందువులున్నారు. వారంతా హింసకు పాల్పడేవాళ్లేనన్నది రాహుల్ ఉద్దేశమా? 1975లో ఎమర్జెన్సీ విధింపు, 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్ల వంటి అకృత్యాలన్నీ కాంగ్రెస్ పుణ్యమే. దేశమంతటా ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసిందే కాంగ్రెస్. అలాంటి పార్టీకి చెందిన రాహుల్‌కు అహింస గురించి మాట్లాడే అర్హతే లేదు''అంటూ మండిపడ్డారు. రాహుల్ చేసిన ప్రతి ఆరోపణకూ రుజువులు సమర్పించాల్సిందిగా ఆదేశించాలని స్పీకర్‌ను కోరారు. అయినా రాహుల్ వెనక్కు తగ్గలేదు. ''క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం, జైనం, సిక్కు వంటి మతాలన్నీ ధైర్యం, నిర్భీతి వంటి వాటి గురించే చెప్పాయి. కానీ బీజేపీ ప్రజాస్వామిక విలువలపై ఏనాడూ నమ్మకం లేదు. మోదీ ఆదేశాల మేరకు నాపై లెక్కలేనన్ని దాడులు జరిగాయి. 20కి పైగా కేసులు పెట్టారు. నా ఇంటిని లాగేసుకున్నారు. నాపై ఈడీని ప్రయోగించి 55 గంటల పాటు విచారణ జరిపారు. అయినా వెరవకుండా రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో ముందుండి నిలిచా. రాజ్యాంగంపై, భారత దేశ మూల భావనలపై బీజేపీ పాల్పడుతున్న వ్యవస్థీకృత దాడులకు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు అడ్డుకట్ట వేశారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీ వాళ్లు కూడా నాతో పాటు రాజ్యాంగానికి జై కొట్టాల్సి వస్తోంది''అంటూ ఎద్దేవా చేశారు.

'మైక్ కట్' విమర్శలు... ధన్‌ఖడ్, బిర్లా సీరియస్

విపక్షాలకు మైక్ కట్ చేస్తున్నామన్న విమర్శలపై రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్, స్పీకర్ ఓం బిర్లా తీవ్రంగా స్పందించారు. గత వారం సభలో రాహుల్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశానన్న విపక్షాల ఆరోపణలను బిర్లా తీవ్రంగా ఖండించారు. ''ఇది స్పీకర్ స్థానం గౌరవానికి సంబంధించిన అంశం. మైకుల నియంత్రణ స్పీకర్ చేతిలో ఉండదు. ఈ విషయం విపక్షాలకూ తెలుసు. అయినా ఉద్దేశపూర్వకంగా సభ బయట తప్పుడు ఆరోపణలు చేశారు''అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. అనంతరం రాజ్యసభలోనూ ఇదే అంశం చర్చకొచ్చింది. విపక్ష నేత ఖర్గే మాట్లాడుతుండగా అంతరాయం కలగడంతో మైక్ కట్ చేశారని విపక్ష సభ్యుడు ప్రమోద్ తివారీ అన్నారు. దానిపై ధన్‌ఖడ్ సీరియస్ అయ్యారు. ''మీ వ్యాఖ్యలతో సభను కించపరుస్తున్నారు. మిస్టర్ ఖర్గే! మైక్‌లను మెకానికల్‌గా నియంత్రిస్తారు తప్ప అది సభాపతి చేతిలో ఉండదు. అది మీకూ తెలుసు''అంటూ మండిపడ్డారు.

'నీట్'పై విపక్షాల వాకౌట్

సోమవారం లోక్‌సభ సమావేశం కాగానే నీట్–యూజీ పేపర్ లీకేజీ అంశాన్ని రాహుల్ ప్రస్తావించి తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ''నీట్ వంటి ప్రొఫెషనల్ పరీక్షను కేవలం సంపన్న విద్యార్థులకు అనువైనపక్కా కమర్షియల్ పరీక్షగా మార్చేశారు. గత ఏడేళ్లలో 70కి పైగా పేపర్లు లీకయ్యాయి. ఇంత ముఖ్యమైన అంశంపై ప్రభుత్వం చర్చకు కూడా అంగీకరించడం లేదు. ఇది చాలా తీవ్రమైన అంశం. కనుక సభలో ఒక రోజంతా ప్రత్యేకంగా చర్చ చేపడదాం''అని ప్రతిపాదించారు. అందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభ్యంతరం తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఇతర అంశాలపై చర్చ కోరడం లోక్‌సభ సభ్యునిగా నా దశాబ్దాల అనుభవంలో ఎప్పుడూ చూడలేదు''అన్నారు. అనంతరం నీట్‌పై చర్చకు స్పీకర్ తిరస్కరించారు. అందుకోసం ప్రత్యేక నోటీసివ్వాలని విపక్షాలకు సూచించారు. స్పీకర్ నిర్ణయాన్ని నిరసిస్తూ విపక్షాలన్నీ వాకౌట్ చేశాయి. అంతకుముందు మణిపూర్ కల్లోలం, రైతు ఆత్మహత్యలు, జమ్మూ కశ్మీర్లో హింసాకాండ, జీఎస్టీ, నోట్ల రద్దు తదితరాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ తీరును రాహుల్ దుయ్యబట్టారు. మణిపూర్‌ను మోదీ సర్కారు అంతర్యుద్ధం దిశగా నెట్టేస్తోందని ఆరోపించారు. విపక్షాన్ని శత్రువులుగా చూడొద్దన్నారు.

విపక్షాల నిరసన

విపక్ష నేతలను వేధించేందుకు వారిపైకి మోదీ సర్కారు దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని ఇండియా కూటమి సభ్యులు ఆరోపించారు. ఇందుకు నిరసనగా రాహుల్‌తో పాటు వారంతా పార్లమెంటు మకర ద్వారం వద్ద నిరసనకు దిగారు. 'విపక్షాల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం మానుకోండి', 'బీజేపీలో చేరండి, అవినీతికి లైసెన్సు పొందండి'అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితరులపై ఈడీని ఉసిగొల్పడం మానుకోవాలంటూ డిమాండ్ చేశారు.

రాహుల్‌ది బాధ్యతారాహిత్యం: బీజేపీ

లోక్‌సభలో రాహుల్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారంటూ బీజేపీ విమర్శించింది. విపక్ష నేత వంటి బాధ్యతాయుత స్థానంలో ఉంటూ నీట్, హిందూ సమాజం, అగ్నివీర్ పథకం... ఇలా అన్ని అంశాలపైనా హుందాతనం లేని వ్యాఖ్యలు చేశారని కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిరెణ్ రిజిజు ఆరోపించారు. రాహుల్ ఇప్పటిదాకా బాధ్యతల్లేని అధికారాన్ని మాత్రమే ఆస్వాదించారంటూ బీజేపీ సభ్యుడు అనురాగ్ ఠాకూర్ దుయ్యబట్టారు. సభకు నిత్యం డుమ్మా కొట్టడాన్ని అలవాటుగా మార్చుకున్నారన్న వ్యక్తి ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ ఎద్దేవా చేశారు.

మోదీపై రాహుల్ మాటల తూటాలు

- మనమంతా మామూలుగా పుట్టి మట్టిలో కలిసే జీవమాత్రులం. మోదీ అలా కాదు. ఆయన ఆత్మతో పరమాత్మ నేరుగా సంప్రదిస్తాడు. తనను దేవుడే పంపాడని మోదీయే స్వయంగా చెప్పుకున్నారు! దేవునితో తనకు నేరుగా కనెక్షన్ ఉందని ప్రకటించుకున్నారు. పెద్ద నోట్లు రద్దు చేయాలంటూ ఓ నాటి రాత్రి వేళ బహుశా మోదీకి దైవ సందేశం అందినట్టుంది. వెంటనే ఆ మేరకు ప్రకటన చేసేశారు!
- అంతా మర్చిపోయిన మహాత్మా గాంధీని ఓ సినిమా తిరిగి గుర్తు చేసిందని మోదీ సెలవిచ్చారు. దాదాపుగా మృతప్రాయుడైన గాంధీకి ఒక సినిమా పునర్జీవం పోసిందట! ఇంతటి అవగాహనా రాహిత్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి!
- సైనికులను అవసరానికి వాడి, ఆ తర్వాత పారేసే కార్మికులుగా మార్చేసిన అగ్నిపథ్ కూడా మోదీ మెదడులో పురుడుపోసుకున్న పథకమే. మేం అధికారంలోకి వస్తే అగ్నిపథ్ పథకాన్ని తక్షణం రద్దు చేస్తాం.

ప్రధాని నవ్వరెందుకో...!

ప్రధాని మోదీ గురించి రాహుల్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ''మోదీజీ! మీరెందుకు ఎప్పుడూ సీరియస్‌గా ఉంటారు? విపక్షాలతో ఎప్పుడూ సరదాగా మాట్లాడరు. సభలో మేం ఎదురైనప్పుడు మీలో చిరునవ్వు కూడా కన్పించదు''అన్నారు. మోదీ స్పందిస్తూ, ''విపక్ష నేతను సీరియస్‌గా తీసుకోవాలని మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం నాకు నేర్పాయి''అనడంతో ఎన్డీఏ సభ్యులంతా నవ్వుల్లో మునిగిపోయారు.

మోదీకి తలవంచి అభివాదమా?

రాహుల్ అభ్యంతరం, స్పీకర్ వివరణ

నిండు సభలో ప్రధాని మోదీకి స్పీకర్ ఓం బిర్లా తలవంచి అభివాదం చేయడం సరికాదన్న రాహుల్ వ్యాఖ్యలు వారి మధ్య సంవాదానికి దారి తీశాయి. ''మీరు స్పీకర్‌గా ఎన్నికయ్యాక నేను అభినందించినప్పుడు నిటారుగా నిలబడి నాతో కరచాలనం చేశారు. కానీ మోదీతో కరచాలనం చేసినప్పుడు ఆయనకు వంగి నమస్కరించారు''అంటూ రాహుల్ ఆక్షేపించారు. దీన్ని అధికార పక్ష సభ్యులంతా తీవ్రంగా తప్పుబట్టారు. రాహుల్ సభాపతి స్థానంపైనే తీవ్ర అభియోగాలు మోపుతున్నారంటూ అమిత్ షా ఆక్షేపించారు. స్పీకర్ స్పందిస్తూ, ''ప్రధాని సభా నాయకుడు. పైగా నా కంటే పెద్దవారు. పెద్దలను గౌరవిస్తా. అవసరమైతే పాదాభివందనం చేస్తా. సమవయస్కులతో సమాన స్థాయిలో ప్రవర్తిస్తా. అది నా సంస్కృతి''అని బదులిచ్చారు. అయినా రాహుల్ ఊరుకోలేదు. ''మీ తీరును గౌరవిస్తా. కానీ లోక్‌సభలో స్పీకరే అందరికంటే పెద్దవారు. సభలో అంతా మీకే అభివాదం చేయాలి''అన్నారు.

నేడు ధన్యవాద తీర్మానంపై బదులివ్వనున్న మోదీ!

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పార్లమెంటులో జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం బదులిస్తారని సమాచారం. తీర్మానంపై లోక్‌సభలో మంగళవారం సాయంత్రానికి చర్చ ముగిసే అవకాశముంది. తర్వాత మోదీ బదులిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.


రాహుల్ ప్రసంగాన్ని శ్రద్ధగా వింటున్న ప్రధాని మోదీ

మేధా పాట్కర్‌కు 5 నెలల జైలు

- రూ.10 లక్షల జరిమానా
- వీకే సక్సేనా వేసిన పరువునష్టం కేసులో ఢిల్లీ కోర్టు తీర్పు



న్యూఢిల్లీ: సామాజిక వేత్త, నర్మదా బచావో ఉద్యమకారిణి మేధా పాట్కర్‌కు ఢిల్లీ కోర్టు సోమవారం ఐదు నెలల సాధారణ కారాగార శిక్ష విధించింది. గుజరాత్‌లోని ఒక ఎన్జీవోకు సారథి, ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా 23 ఏళ్ల క్రితం పాట్కర్‌పై వేసిన కేసులో ఆమెను దోషిగా తేలుస్తూ గత నెల ఏడో తేదీన ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. అయితే శిక్ష ఖరారును రిజర్వ్‌చేసి సోమవారం తీర్పును వెలువరించారు. పరువునష్టం కింద సక్సేనాకు రూ.10 లక్షల జరిమానా చెల్లించాలని పాట్కర్‌ను కోర్టు ఆదేశించింది. తీర్పును పాట్కర్ పై కోర్టులో సవాల్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ నెలరోజులపాటు శిక్ష అమలును నిలిపివేస్తూ న్యాయమూర్తి రాఘవ్ శర్మ ఉత్తర్వులిచ్చారు. అయితే శిక్ష ప్రస్తుతానికి నిలుపుదల చేసిన నేపథ్యంలో తనకు బెయిల్ ఇవ్వాలని పాట్కర్ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఆనాడు సక్సేనాను పిరికిపంద అంటూ పాట్కర్ దూషించిన అంశం కోర్టులో రుజువుకావడంతో ఆమెను దోషిగా తేల్చారు. హవాలా లావాదేవీల్లో సక్సేనా హస్తముందంటూ పాట్కర్ చేసిన ఆరోపణల్లో నిజంలేదని, పాట్కర్ కారణంగా ఆయన పరువుకు నష్టం కలిగిందని కోర్టు అభిప్రాయపడిన విషయం విదితమే. 2000 సంవత్సరంలో అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేసే 'కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్' అనే స్వచ్ఛంద సంస్థకు వీకే సక్సేనా అధ్యక్షునిగా ఉండేవారు. తనకు, నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమానికి వ్యతిరేకంగా సక్సేనా ప్రకటనలు ఇచ్చారని ఆయనపై పాట్కర్ తొలిసారిగా ఫిర్యాదుచేశారు.

ఆస్ట్రేలియా స్టూడెంట్ వీసా ఫీజు రెట్టింపు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టూడెంట్ వీసా ఫీజును రెట్టింపునకు మించి పెంచింది. ప్రస్తుతం 710 డాలర్ల (రూ.59,255)గా ఉన్న ఫీజును 1,600 డాలర్ల (రూ.1.33 లక్షల)కు పెంచింది. పెంచిన ఫీజులు అమలవుతాయని జూలై ఒకటో తేదీ నుంచి తెలిపింది. దీని ప్రభావం ఆస్ట్రేలియాలో చదువుకోవాలనుకునే లక్షలాది మంది భారతీయ విద్యార్థులపై పడనుంది. ఆస్ట్రేలియాలో విదేశీ విద్యార్థుల్లో భారతీయులది రెండో స్థానం. 2023 ఆగస్టు నాటికి 1.2 లక్షల మంది భారతీయ విద్యార్థులున్నట్లు కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ తెలిపింది. ఇకపై విదేశీ విద్యార్థులు బ్రిటన్ వంటి దేశాలను ఎంచుకోవచ్చంటున్నారు. కునే బ్రిటన్‌లో స్టూడెంట్ వీసా ఫీజు 900 డాలర్లు(రూ.75 వేలు)గా ఉంది.

అధికార నిర్ణయాలకు మాత్రమే...

మాజీ అధ్యక్షులకు రక్షణ

ట్రంప్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

వాషింగ్టన్: మాజీ అధ్యక్షులకు న్యాయ విచారణ నుంచి కొంతమేరకు రక్షణ ఉంటుందని తొలిసారిగా అమెరికా సుప్రీంకోర్టు సోమవారం తీర్పునిచ్చింది. 'రాజ్యాంగబద్ధమైన అధికార పరిధిలో తీసుకునే నిర్ణయాలకు మాజీ అధ్యక్షులకు క్రిమినల్ విచారణ నుంచి సంపూర్ణ రక్షణ ఉంటుంది. ఇది అధికారిక నిర్ణయాలకు మాత్రమే వర్తిస్తుంది. అనధికారిక చర్యలకు ఎలాంటి రక్షణ పొందలేరు' అని చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ 6–3 మెజారిటీ తీర్పులో పేర్కొన్నారు. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో ఓటమిని అంగీకరించకుండా ఫలితాలను తారుమారు చేయడానికి కుట్రపన్నారనే అభియోగాలపై డొనాల్డ్ ట్రంప్ క్రిమినల్ కేసును ఎదుర్కొంటున్నారు. సుప్రీంకోర్టు సోమవారం ఈ కేసును తిరిగి ట్రయల్ కోర్టుకు అప్పగించింది. ఫలితంగా అధ్యక్ష ఎన్నిక జరిగే నవంబర్ 5 లోగా ట్రంప్ విచారణను ఎదుర్కొనే అవకాశాలు లేనట్టే. 'మాజీ అధ్యక్షులకు క్రిమినల్ విచారణ నుంచి మినహాయింపు అధ్యక్ష వ్యవస్థనే పునర్వ్యవస్థీకరిస్తుంది. చట్టానికి ఎవరూ అతీతులు కాదనే రాజ్యాంగ సూత్రాలను, భూమికను, ప్రభుత్వ వ్యవస్థను అవహేళన చేయడమే' అని జస్టిస్ సోనియా సాటోమేయర్ అన్నారు.

ప్యానెల్ స్పీకర్‌గా ఎంపీ కృష్ణప్రసాద్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్.. సభాపతి స్థానంలో లేని సమయంలో సభా కార్యకలాపాలకు అధ్యక్షత వహించడానికి ఎనిమిది మందిని సభాపతి ఓం బిర్లా నియమించారు. ఆరు పార్టీలకు చెందిన తొమ్మిది మంది సభ్యుల్ని నియమిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్డీఏ కూటమికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్‌కు ప్యానెల్‌లో స్థానం కల్పించారు. అయోధ్య ఉన్న ఫైజాబాద్ నుంచి గెలుపొందిన అవధేశ్ ప్రసాద్‌కు కూడా అవకాశమిచ్చారు.

సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) జూన్ 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించిన సివిల్స్ (ప్రిలిమినరీ) ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మార్కులు, కటాఫ్ మార్కుల వివరాలను అభ్యర్థులకు పంపామని ఓ అధికారి తెలిపారు. ఎంపికై న వారు మెయిన్స్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిన తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్ష, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష ప్రక్రియలు పూర్తయి తుది ఫలితాలను ప్రకటించాక ప్రిలిమ్స్ జవాబుల కీని యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని చెప్పారు.

లీకేజీలు, ప్రమాదాలు, దాడులు...

ఇదే మోదీ 'పిక్చర్'!

రాజ్యసభలో దుయ్యబట్టిన ఖర్గే • ఆరెస్సెస్‌పై తీవ్ర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ''పదేళ్ల తన పాలన కేవలం ట్రైలరేనని, అసలు సినిమా ముందుందని లోక్‌సభ ఎన్నికల ప్రచారం పొడవునా మోదీ పదేపదే చెప్పుకున్నారు. ఆయన సినిమా ఎలా ఉండనుందో ఈ నెల రోజుల పాలన చెప్పకనే చెప్పింది. పేపర్ లీకేజీలు, కశ్మీర్‌లో ఉగ్ర దాడులు, రైలు ప్రమాదాలు, దేశమంతటా టోల్ ట్యాక్సుల పెంపు, బ్రిడ్జిలు, విమానాశ్రయాల పై కప్పులు కూలడాలు, చివరికి మోదీ ఎంతో గొప్పగా చెప్పుకున్న అయోధ్య రామాలయంలో కూడా లీకేజీలు... ఇదే మోదీ చూపిస్తానని చెప్పిన సినిమా!'' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. గంటన్నర పాటు సాగిన ప్రసంగంలో మోదీ ప్రభుత్వాన్ని అంశాలవారీగా ఏకిపారేశారు. సామాన్యుల కష్టాలను పట్టించుకోకుండా మోదీ కేవలం 'మన్ కీ బాత్'కు పరిమితమయ్యారంటూ చురకలు వేశారు. గతంలో ఏ ప్రధాని చేయని విధంగా ఎన్నికల ప్రచారంలో విద్వేష వ్యాఖ్యలతో సమాజాన్ని విభజించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇటీవలి పేపర్ లీకేజీలతో 30 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ప్రమాదంలో పడిందని ఖర్గే అన్నారు. మణిపూర్ హింసాకాండ వంటి దేశం ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదంటూ ఆక్షేపించారు. విద్యా వ్యవస్థ గురించి మాట్లాడే క్రమంలో ఆరెస్సెస్‌పై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు చేశారు. ''ఆరెస్సెస్ విధానం దేశానికి చాలా ప్రమాదకరం. వర్సిటీలతో పాటు అన్ని విద్యా సంస్థల్లో వీసీలు, ప్రొఫెసర్ల నియామకాలపై దాని ప్రభావం ఉంటోంది'' అంటూ ఆక్షేపించారు. ఆ వ్యాఖ్యలను రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తీవ్రంగా ఖండించారు. ''ఆరెస్సెస్ సభ్యుడు కావడమే నేరమన్నట్టుగా మీ మాటలున్నాయి. ఆ సంస్థలో ఎందరో మేధావులున్నారు. అది జాతి నిర్మాణానికి అవిశ్రాంతంగా పాటుపడుతోంది. అలాంటి సంస్థను నిందిస్తున్నారు మీరు'' అన్నారు. మోదీపై, ఆరెస్సెస్‌పై ఖర్గే వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు.

కూర్చుని మాట్లాడతా: ఖర్గే అలాగే కానీయండి: ధన్‌ఖడ్

విపక్ష సభ్యుల తీవ్ర విమర్శలు, అధికార పక్ష ప్రతి విమర్శలతో వేడెక్కిపోయిన రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే వ్యాఖ్యలు, చైర్మన్ స్పందన నవ్వులు పూయించాయి. గంటన్నర పాటు ప్రసంగించిన ఖర్గే, తనకు మోకాళ్ల నొప్పులున్నందున కూర్చుని మాట్లాడేందుకు అనుమతి కోరారు. 'మీకెలా సౌకర్యంగా ఉంటే అలా చేయండి. ఇబ్బందేమీ లేదు' అంటూ ధన్‌ఖడ్ బదులిచ్చారు. కానీ కూర్చుని చేసే ప్రసంగం నిలబడి చేసినంత ప్రభావవంతంగా ఉండదని ఖర్గే అనడంతో సభ్యులంతా గొల్లుమన్నారు. ఆ విషయంలో మీకు వీలైనంత సాయం చేస్తా లెమ్మని ధన్‌ఖడ్ బదులివ్వడంతో సోనియాతో సహా అంతా మరోసారి నవ్వుకున్నారు. మరో సందర్భంలో ''నేను దక్షిణాదికి చెందిన వాడిని. కనుక ద్వివేది, త్రివేది, చతుర్వేది పదాలు నన్ను చాలా అయోమయపరుస్తాయి'' అని ఖర్గే అనడంతో 'కావాలంటే వాటిపై ఓ అరగంట పాటు ప్రత్యేక చర్చ చేపడదాం' అని ధన్‌ఖడ్ బదులిచ్చారు. దాంతో సభంతా మరోసారి నవ్వులతో దద్దరిల్లిపోయింది.

జూన్‌లో లోటు వర్షపాతం

- జూలైలో సాధారణానికి మించి వానలు
- ఐఎండీ చీఫ్ మహాపాత్ర వెల్లడి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జూన్‌లో సాధారణం కంటే తక్కువగానే వానలు కురిశాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. గత అయిదేళ్లతో పోలిస్తే ఈసారి అత్యధికంగా జూన్‌లో 11 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు సోమవారం వెల్లడించింది. జూన్‌లో సాధారణంగా 165.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా, ఈసారి 147.2 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసిందని వివరించింది. 2001 నుంచి ఇలా జరగడం ఇది ఏడోసారని విశ్లేషించింది. జూన్ 11 నుంచి 27 వరకు 16 రోజుల పాటు సాధారణం కంటే తక్కువగా వానలు కురియడంతో లోటు నమోదైందని ఐఎండీ తెలిపింది. జూన్‌లో దక్షిణ భారతంలో మాత్రమే మిగులు వర్షపాతం 14 శాతం మేర రికార్డయినట్లు పేర్కొంది. అయితే జూలైలో సాధారణం కంటే ఎక్కువగానే వానలు పడతాయని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు.

రషీద్ ప్రమాణ స్వీకారానికి ఎన్‌ఐఏ ఓకే



న్యూఢిల్లీ: జైల్లో ఉన్న కశ్మీరీ నాయకుడు, ఎంపీగా ఎన్నికైన షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజనీర్ రషీద్) ప్రమాణ స్వీకారం చేయడానికి మార్గం సుగమమైంది. జూలై 5న రషీద్ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయి. ప్రమాణ స్వీకారం నిమిత్తం రషీద్‌కు ఒకరోజు బెయిల్ ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోమవారం ప్రత్యేక కోర్టుకు తెలిపింది. మీడియాతో మాట్లాడకూడదని, ప్రమాణ స్వీకార ప్రక్రియను ఒక రోజులో పూర్తి చేయాలని ఎన్ఐఏ షరతులు విధించింది. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం చేశారనే కేసులో కఠినమైన చట్ట వ్యతిరేక కార్యాకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద 2019 ఆగస్టులో అరెస్టయిన రషీద్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ)పై నెగ్గారు.

ఫ్రాన్స్ ఎన్నికల తొలి రౌండ్‌లో విపక్ష కూటమి గెలుపు

పారిస్: ముందస్తు ఎన్నికలకు వెళ్లిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. దేశాధ్యక్ష ఎన్నికల తొలి రౌండ్‌లో మేక్రాన్‌కు చెందిన మితవాద సెంట్రిస్ట్ ఎన్‌సింబల్ కూటమి మూడో స్థానంలో సరిపెట్టుకుంది. తొలి దశలో పోలైన 68 శాతం ఓట్లలో అతివాద నేషనల్ ర్యాలీ కూటమి ఏకంగా 33.14 శాతం ఓట్లను ఒడిసిపట్టింది. న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమికి 27.99 శాతం వచ్చాయి. మేక్రాన్ పార్టీ 20.04 శాతంతో సరిపెట్టుకుంది. జూలై 7న రెండో రౌండ్ పోలింగ్ ఉంటుంది. గత నెలలో ఈయూ ఎన్నికల్లో కూడా నేషనల్ ర్యాలీ పార్టీయే విజయం సాధించింది.

శ్రీలంక హక్కుల నేత సంపంతన్ కన్నుమూత



కొలంబో: శ్రీలంకకు చెందిన సీనియర్ తమిళ నేత ఆర్.సంపంతన్ (91) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొలంబోలోని ఆస్పత్రిలో ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు తమిళ నేషనల్ అలయెన్స్ (టీఎన్ఏ) పార్టీ ప్రకటించింది. మితవాద భావాలు కలిగిన ఆయన శ్రీలంకలో తమిళులకు శాంతి, న్యాయం, గౌరవప్రదమైన స్థానం కోసం జీవితాంతం శ్రమించారు. సింహళులు మెజారిటీగా ఉన్న శ్రీలంకలో సంపంతన్ సారథ్యంలోని టీఎన్ఏ తొలిసారి 2004లో తమిళులకు చెందిన రెండో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. 1948లో బ్రిటన్ నుంచి శ్రీలంక స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి అక్కడి తమిళులు స్వతంత్ర ప్రతిపత్తి డిమాండ్‌ను వినిపిస్తూనే ఉన్నారు. 1970ల వరకు శాంతియుతంగానే సాగిన వీరి పోరాటం అనంతర కాలంలో హింసాత్మక రూపం దాల్చింది. 1977లో ట్రింకోమలి నుంచి సంపంతన్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. తమిళుల స్వతంత్ర ప్రతిపత్తి డిమాండ్‌కు రాజకీయపరమైన పరిష్కారానికి తీవ్రంగా ప్రయత్నించారు. 2015లో ప్రతిపక్ష నేతగా ఎన్నికై న తర్వాత ఆయన శ్రీలంక నూతన రాజ్యాంగం రూపకల్పనలో పాలుపంచుకున్నారు. ఆయన మృతికి ప్రధాని మోదీ తదితరులు సంతాపం ప్రకటించారు.

నాకు మొబైల్ లేదు: సిద్ధూ

బనశంకరి: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తాను మొబైల్ ఫోన్ వాడనని చెప్పారు. సోమవారం మీడియా ప్రశ్నకు బదులిస్తూ, ''ఒకప్పుడు ఆర్నెల్లు మొబైల్ వాడాను. రాత్రి వేళ ఫోన్లు రావడం, నిద్రకు భంగం కలగడంతో పక్కన పెట్టా. ఏ విషయమైనా పీఏలు, గన్‌మెన్ వచ్చి చెబుతారు. సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో నా కుమారుడు చెబుతాడు'' అన్నారు. నాయకత్వ మార్పుపై హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తానని సిద్దరామయ్య అన్నారు. డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్‌కు సీఎంగా అవకాశమివ్వాలని ఇటీవల ఒక్కళిగ మతగురువు ఒకరు సిద్దరామయ్య సమక్షంలోనే కోరడం తెలిసిందే.

మూడేళ్లలో న్యాయం

నూతన చట్టాలతో నేరాలు తగ్గుతాయి: అమిత్ షా

న్యూఢిల్లీ: సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన నూతన నేర చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలోపు కోర్టులో న్యాయం అందేలా చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. బ్రిటిష్ వలస పాలనాకాలం నుంచి కొనసాగుతున్న భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో కొత్తగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్ఏ) చట్టాలను అమల్లోకి తెచ్చిన సందర్భంగా సోమవారం ఢిల్లీలో అమిత్‌షా పత్రికా సమావేశంలో మాట్లాడారు. '' కొత్త చట్టాల అమలుతో నేరాలు తగ్గుముఖం పడతాయి. నూతనచట్టాల కింద 90 శాతం వరకు నేరాలు నిరూపించబడి దోషులకు శిక్షలుపడతాయి. జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులపై పోలీసుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఎస్ఎంఎస్ తదితర విధానంలో సమన్ల జారీ, హేయమైన నేరాలకు సంబంధించి ఘటనాస్థలిని వీడియో తీయడం, బాధితురాలి ఇంటి వద్ద వాంగ్మూలం తీసుకోవడం వంటి ఎన్నో నిబంధనలను కొత్త చట్టాలు తీసుకొచ్చాయి'' అని షా చెప్పారు.



10 నిమిషాలకే కొత్త చట్టం కింద కేసు

''కొత్త చట్టాలు సోమవారం అర్ధరాత్రి అమల్లోకి వచ్చిన 10 నిమిషాలకే మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ సిటీలో కొత్త చట్టం కింద బైక్ దొంగతనం కేసు నమోదైంది. వలసపాలనాకాలంలో బ్రిటిష్ వాళ్లు నేరాలపై శిక్షకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. మేం కొత్త చట్టాల ద్వారా న్యాయానికి ప్రాధాన్యతనిస్తున్నాం. ఈ–ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్, డిజిటల్ సాక్ష్యాల ద్వారా నేరాలపై ఫిర్యాదును మరింత సులభతరం చేశాం. సుదీర్ఘకాలం వేచి ఉండాల్సిన పనిలేకుండా త్వరగా న్యాయం జరిగేలా న్యాయవ్యవస్థకూ కాలపరిమితిని విధించాం. చిన్నారులు, మహిళలపై నేరాలను సున్నితమైనవిగా పరిగణించాం. కొత్త చట్టం ప్రకారం ఈ కేసుల్లో ఏడు రోజుల్లోపు దర్యాప్తు నివేదిక ఇవ్వాల్సిందే. నేర కేసుల్లో దర్యాప్తు ముగిసిన 45 రోజుల్లోపు కేసు తీర్పు చెప్పాల్సిందే. తొలిసారిగా ఒక కేసు విచారణ మొదలైన రోజు నుంచి 60 రోజుల్లోపు అభియోగాలు దాఖలుచేయాలి.

511 సెక్షన్లను 358కి కుదించాం

ఒకేలా ఉన్న వేర్వేరు సెక్షన్లను కలిపేశాం. దీంతో 511 సెక్షన్లకు బదులు 358 సెక్షన్లు మిగిలాయి. ఉదాహరణకు 6వ సెక్షన్ నుంచి 52వ సెక్షన్‌లోని నిబంధనలను ఒకే సెక్షన్‌లోకి మార్చారు. న్యాయం, పారదర్శకత, నిష్పాక్షికత లక్ష్యంగా ఈ మూడు చట్టాలను తెచ్చాం'' అని షా వివరించారు.

నీట్-యూజీ రీటెస్ట్ పరీక్ష ఫలితాలు వెల్లడి

అందరి సవరించిన ర్యాంకులు విడుదల



న్యూఢిల్లీ: సమయాభావం, సాంకేతిక సమస్యల కారణంగా జూన్‌లో నీట్–యూజీ పరీక్షలో గ్రేస్ మార్కులు సాధించిన అభ్యర్థులకు మళ్లీ చేపట్టిన పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సోమవారం ప్రకటించింది. దీంతో గ్రేస్ మార్కులు పొందిన వారితోసహా గతంలో పరీక్ష రాసిన వారందరి ర్యాంక్‌లు మారిపోయాయి. సవరించిన ర్యాంకులను సోమవారం విడుదలచేశారు. మే 5న ఆరు పరీక్షకేంద్రాల్లో రాసిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు కలిపిన అంశం తీవ్ర వివాదాస్పదమైన విషయం తెల్సిందే. గ్రేస్ మార్కులు పొందిన 1,563 అభ్యర్థుల కోసం జూన్ 23వ తేదీన మళ్లీ పరీక్షచేపట్టగా 48 శాతం మంది హాజరుకాలేదు. కేవలం 52 శాతం (813 మంది) అభ్యర్థులే హాజరయ్యారు. ఆనాడు గ్రేస్ మార్కులు ఇచ్చిన కారణంగా హరియాణాలోని ఒకే పరీక్షాకేంద్రంలో రాసిన ఆరుగురికి సరిగ్గా 720కిగాను 720 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంక్ సాధించారు. మరో 61 మంది కూడా ఫస్ట్‌ర్యాంక్ సాధించడంతో పరీక్ష నిర్వహణపై అనుమానాలు రేకెత్తడం తెల్సిందే. మరోవైపు నీట్–యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనాత్మకమైన విషయం విదితమే. మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగిన నీట్‌యూజీ పరీక్షను దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర వైద్యవిద్యా కోర్సుల ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నీట్‌యూజీని ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంటారు.



లోకో పైలెట్లు చాలా కీలకం

రైళ్ల నిర్వహణలో లోకో పైలెట్‌లు, ఫ్రంట్ లైన్ సిబ్బంది పాత్ర కీలకమని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు.

-8లో▸



ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదిక వద్ద సోమవారం రాత్రి ఏలూరుకు చెందిన చిన్న వెంకన్న బృందం కోలాట నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కానుకగా బంగారు గాజులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు చెన్నైకు చెందిన భక్తులు సోమవారం లక్ష రూపాయల విలువైన బంగారు గాజులను కానుకగా సమర్పించారు. చెన్నైకు చెందిన ఎస్.ఎస్ గీతాకృష్ణ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ డీఈఓ లీలాకుమార్‌ను కలిసి బంగారు గాజులను అంద జేశారు. లక్షల రూపాయలు వెచ్చించి 15 గ్రాముల బంగారంతో గాజులను తయారు చేయించినట్లు దాతలు తెలిపారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వ చనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెలలో తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ డ్రస్ మేకర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, అసిస్టెంట్ జ్యూట్ క్రాఫ్ట్ ప్రాడక్ట్ మేకర్, బ్యూటీకేర్ అసిస్టెంట్, కట్టింగ్ అండ్ టైలరింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ రిపేరింగ్, హోమ్ క్రాఫ్ట్ మెకానిజం, జామ్ జ్యూస్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్‌ల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా లేదా 0866-2470420 ఫోన్ నంబరులో సంప్రదించాలని పూర్ణిమ సూచించారు.

ఇగ్నో ఎంబీఏలో కొత్త కోర్సులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం జూలై - 2024 నుంచి ఎంబీఏలో పలు కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ సోమవాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏలో హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, అగ్రి బిజినెస్ మేనేజ్ మెంట్, లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్ మేనేజ్ మెంట్, కన్స్‌ట్రక్షన్ మేనేజ్ మెంట్ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నాలుగు కోర్సులు సెమిస్టర్ విధానంలో జరుగుతాయని తెలిపారు. ఒక్కో సెమిస్టర్ ఫీజు రూ.15,500 నుంచి రూ.19,500 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయని వివరించారు. ఎంఏలో భగవద్గీత అధ్యయనం కోర్సును కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇగ్నో ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా, లేదా 0866-2565253 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించొచ్చని సూచించారు. ఈ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని ఈ సందర్భంగా సూచించారు.

ఇరిగేషన్ స్థలాలు కబ్జా

- స్థలాలను ఆక్రమించి ప్రహరీల నిర్మాణం
- ఆపై అద్దెలకు ఇస్తున్న ఆక్రమణదారులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



నూతనంగా నిర్మించిన అనధికార కట్టడం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగర పరిధిలో కృష్ణా నదీ తీరాన ఉన్న ఇరిగేషన్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆక్రమణదారులు ఇరిగేషన్ శాఖ నిబంధనలను తుంగలో తొక్కి కట్టడాలు కడుతున్నారు. అదేమంటే ఆ స్థలం తమదే అంటున్నారు. డాక్యుమెంట్లు ఏవీ అంటే ఉన్నాయని బుకాయిస్తూ చూపడంలేదు. నిర్మాణ పనులను నిలిపివేసే ప్రసక్తే లేదంటున్నారు. స్థలం చుట్టూ ప్రహరీ కట్టేయడం, అందులో షెడ్లు నిర్మించడం ఆపై అద్దెలకు ఇచ్చేసి నెలనెలా వేల రూపాయలు వసూలు చేసుకుంటున్నారు. ఇదంతా ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత జరుగుతున్న కబ్జాపర్వం. విద్యాధరపురం హిందూ శ్మశానవాటికకు దక్షిణం వైపు గత కృష్ణాపుష్కరాల వరకు అనేక మంది పేద ముస్లిం మైనార్టీలు ఈ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసించారు. వారు షాపుల్లో సాంబ్రాణి పొగవేసి, దృష్టి నిమ్మకాయలు, కొబ్బరికాయలు కట్టి జీవనం సాగించేవారు. పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం వారి గుడిసెలను తొలగించి జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో వసతి చూపారు. అప్పటి నుంచి ఆ స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. వాటిపై కన్నేసిన ఒక కుటుంబానికి చెందిన వారు అదంతా తమదేనంటూ నెమ్మదిగా ఆక్రమించుకోవడం మొదలు పెట్టారు. వాస్తవానికి ఆ స్థలం బ్రిటీష్ పాలనలో ఆర్మీలో పని చేసి రిటైరయిన వారికి ఇచ్చిందని స్థానికులు చెబుతున్నారు. వారి నుంచి ఒక వ్యక్తి లీజుకు తీసుకుని ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని, కొంత స్థలాన్ని సాంబ్రాణి పొగవేసే ముస్లిం మైనార్టీలు ఉండేందుకు ఉచితంగా ఇచ్చారు. పుష్కరాల సమయంలో అక్కడ నివసించే పేద ముస్లిం మైనార్టీలు వైఎస్సార్ కాలనీకి వెళ్లిపోయారు.

వారసులమంటూ ఆక్రమణలు

గతంలో ఇరిగేషన్ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి మరణించిన తరువాత అతని వారసులమంటూ కొందరు వ్యక్తులు వచ్చి ముక్కలు ముక్కలుగా విడదీసి చుట్టూ ప్రహరీ నిర్మించడం, షెడ్లు నిర్మించి అద్దెలకు ఇవ్వడం మొదలైంది. ఇదంతా 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వ పాలనలోనే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారసులమని చెప్పుకున్న వారంతా స్తబ్దుగా ఉండిపోయారు. మొన్నటి వరకు స్తబ్దుగా ఉన్న వారు టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో రెచ్చిపోతున్నారు. మళ్లీ కబ్జా పర్వం షురూ చేశారు. ఇటీవల కొంత స్థలాన్ని ఆక్రమించుకుని చుట్టూ ప్రహరీ నిర్మించి గేట్లు ఏర్పాటు చేశారు. అద్దెకుకూడా ఇచ్చేసినట్లు తెలిసింది. త్వరలో ఆ స్థలంలో షెడ్ వేసి ఇవ్వడమే తరువాయి. తమ స్థలానికి పట్టాలు ఉన్నాయని ఆక్రమణదారులు చెబుతున్నా వారు అద్దెలకు ఇచ్చిన ఏ స్థలానికి మునిసిపల్ కార్పొరేషన్‌లో ఎసెస్‌మెంట్ నంబర్, పన్ను లేదు. అంతే కాకుండా అనధికార నిర్మాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారెవరికీ ట్రేడ్ లైసెన్స్‌లు లేకపోవడం గమనార్హం. దీనిపై ఇరిగేషన్ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కయ్యారేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల నుంచి పదేపదే ఫిర్యాదు చేసినా ఇదిగో..అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప ఆక్రమణలవైపు కన్నెత్తి చూడటంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నివేదిక రావాలి

స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చిన మీదట ఇరిగేషన్ స్థలాల వద్దకు అధికారులను పరిశీలన కోసం పంపించాం. డాక్యుమెంట్లు ఉన్నాయని నిర్మాణాలు చేపట్టిన వ్యక్తి చెబుతున్నాడు. వాటిని చూపించే వరకు పనులు నిలపాలని సూచించాం. అయినా నిర్మాణ పనులు కొనసాగిస్తూనే ఉండటంతో ఈఈ స్థాయి అధికారిని పంపించాం. ఆ అధికారి నుంచి నివేదిక ఇంకా రాలేదు. వచ్చిన తరువాత పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్ బాబు, ఎస్ఈ, ఇరిగేషన్ శాఖ

దేవదాయ శాఖ సర్వర్ షట్‌డౌన్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ ప్రధాన కంప్యూటర్ విభాగంలో సోమవారం సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సర్వర్‌లో సమస్య ఎదురవగా భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం నుంచి దుర్గగుడిలో కంప్యూటర్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అమ్మవారి దర్శనం టికెట్ల జారీ ప్రక్రియ పని చేయలేదు. దీంతో ఆలయ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అన్ని కౌంటర్లలో ముద్రించిన టికెట్లను విక్రయించారు. మరో వైపు ప్రసాదాల కౌంటర్లలోనూ ఇదే పరిస్థితి నెలకుంది. అమ్మవారి ఆర్జిత సేవల టికెట్ల కౌంటర్‌లో సేవలు నిలిచిపోగా, సిబ్బంది మ్యానువల్ టికెట్లను జారీ చేశారు. సోమవారం రాత్రి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. మంగళవారం ఉదయం నాటికి టెక్నికల్ సమస్య పరిష్కారమయ్యే అవకాశాలున్నాయని ఆలయ సిబ్బంది తెలిపారు.

జవాబుదారీతనంతో సమస్యల పరిష్కారం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 87 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను జవాబుదారీతనంతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీకుమారితో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ సృజన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల వినతులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా వాటికి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 87 అర్జీలు అందాయన్నారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖ పరిధిలో 29 అర్జీలు ఉన్నాయి. ఎంఏయూడీ 17, పోలీస్ 10, డీఆర్‌డీఏ-5, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 4, ఏపీఎస్ డబ్ల్యూఆర్ ఈఐఎస్-4, పౌర సరఫరాలు-2, గ్రామీణ నీటి సరఫరా-2, బీసీ సంక్షేమం-2, ఎడ్యుకేషన్, వ్యవసాయ మార్కెటింగ్, ఉపాధి, మైన్స్ అండ్ జియాలజీ, ఆరోగ్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్, పంచాయతీ రాజ్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, ఏపీఎస్ఆర్టీసీ, రహదారులు, భవనాలు, సహకార శాఖ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున చొప్పున అర్జీలు అందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డ్వామా పీడీ జె.సునీత, డీఎస్ఓ జి.మోహన్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

4న దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నీట్, నెట్ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని, అసమర్థ ఎన్‌టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల నాలుగో తేదీన దేశ వ్యాప్తంగా తలపెట్టిన బంద్‌ను అన్ని విద్యా సంస్థలు జయప్రదం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ తదితర విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ.. నీట్ నెట్ లీకేజీలో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని, దీనిపై మోదీ పార్లమెంట్‌లో చర్చించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో వివిధ పేపర్ల లీకేజీలు 65 జరిగాయని వివరించారు. లీకేజీ జరిగిందని బిహార్ రాష్ట్రంలో 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. ఈ లీకేజీలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని తెలిసినా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దుర్మార్గమని, తక్షణమే మంత్రిని బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వన్ నేషన్ వన్ ఎగ్జామ్ అనే ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్పకూలిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు సాయికుమార్, రాజశేఖర్, కిరణ్, నాగరాజు, సీహెచ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



సీమ పర్విన్‌కు పింఛన్ అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ తదితరులు

మచిలీపట్నం టౌన్: రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం సామాజిక పింఛన్లను పెంపు చేసినట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక 27వ డివిజన్ నూరుద్దీన్‌పేటలో సోమవారం మంచానికే పరిమితమైన దివ్యాంగురాలు సీమ పర్విన్‌కు ఎన్టీఆర్ పింఛన్ భరోసా ద్వారా రూ.15 వేలను కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, అధికారులతో కలిసి మంత్రి అందజేశారు. అనంతరం జెడ్పీ సెంటర్ వద్ద నాలుగో డివిజన్లో వృద్ధురాలు కాగిత రాధమ్మ, పలువురు లబ్ధిదారులకు మంత్రి, కలెక్టర్ సామాజిక పింఛన్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. దివ్యాంగురాలు సీమ పర్విన్‌కు గత ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువగా వస్తున్నదని పింఛను నిలిపివేశారన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఆమెకు తొలి పింఛను అందజేసినట్లు తెలిపారు. ఆమె పింఛన్‌ను రూ.15 వేలకు పెంచి అందించామన్నారు. సామాజిక పింఛన్‌ను నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచి, ఏప్రిల్, మే, జూన్ అరియర్స్ రూ.3 వేలు కలిపి రూ.7 వేల చొప్పున లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నుంచి జిల్లాలో 2.42 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పింఛన్ల పంపిణీపై పర్యవేక్షణకు కలెక్టరేట్‌తోపాటు జిల్లాలో అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్.బాపిరాజు, ఆర్డీఓ ఎం.వాణి, డీపీఓ, డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ నాగేశ్వరనాయక్, జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ ఆనంద్ కుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకె నారాయణప్రసాద్, స్థానిక నాయకులు ఎస్కే భాజాని, ఇలియాస్ పాషా, సయ్యద్ ఖాజా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

95.57 శాతం పింఛన్ల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా లబ్ధిదారులకు సోమవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఉదయం 8 నుంచి 11 గంటలు సర్వర్లు పనిచేయక ఇబ్బందులు ఎదురయ్యాయి. కృష్ణా జిల్లాలో 2,42,321 మంది లబ్ధిదారులు ఉన్నారు. తొలి రోజు 2,31,598 మందికి అంటే 95.57 శాతం మందికి పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ నాగేశ్వరనాయక్ తెలిపారు.

అమర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు




నాగరాజు అమర్ రహే.. మీ మరణం వృథా పోదు.. మీ త్యాగాన్ని ఈ నేల మరవదు.. అంటూ ప్రతి గొంతూ నినదించింది. పెడన మండలం చేవేంద్ర గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సాదరబోయిన నాగరాజు అంత్యక్రియలు సైనిక లాంఛనాలతో సోమవారం రాత్రి జరిగాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటితో అమర జవానుకు తుదివీడ్కోలు పలికారు. నాగరాజు అంతిమ యాత్రలో పాల్గొనేందుకు పెడన మండలంతో పాటు పలు గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. జోహార్ నాగరాజు అంటూ నినదించారు.

– పెడన

యువ గుండెకు పోటు

- 30 ఏళ్లకే గుండె సంబంధ వ్యాధులు
- విపరీతమైన వత్తిడి కారణమంటున్న వైద్యులు
- స్మోకింగ్, ఆల్కహాల్ అలవాట్ల కారణంగానూ గుండె జబ్బులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): యువత గుండె లయ తప్పుతోంది. మూడు పదుల వయస్సులోనే యువతీ యువకులు గుండెపోటుకు గురవుతున్నారు. గుండె సంబంధిత వ్యాధులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. కోవిడ్ తర్వాత యువతలో గుండె సమస్యలు ఎక్కువయ్యాయి. వారిలో కొందరు మృత్యువాత పడుతున్నారు. చిన్న వయస్సులో గుండెపోటు రావడానికి కారణం విపరీతమైన వత్తిళ్లు (స్ట్రెస్), పొగ తాగడం, మద్యం అలవాటు ప్రధాన కారణాలు. ఎయిర్ పొల్యూషన్, ఆహారపు అలవాట్లు కూడా గుండె జబ్బులకు కారణాలుగా నిలుస్తున్నాయి. యువతలో గుండెపోటును నివారించాలంటే చిన్నప్పటి నుంచి ఆరోగ్యకరమైన అలవాట్లు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

- గన్నవరానికి చెందిన 25 ఏళ్ల యువకుడు ఒక ప్రయివేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ విధుల్లోనే ఉంటాడు. ఇటీవల అతను తీవ్ర ఛాతీ నొప్పితో బాధపడగా ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతను గుండె పోటుకు గురయ్యాడని నిర్ధారించారు. సకాలంలో ఆస్పత్రికి వెళ్లడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.
- విజయవాడ గాంధీనగర్ చెందిన 30 ఏళ్ల యువకుడు ప్రయివేటు సంస్థలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అతనికి స్మోకింగ్, ఆల్కహాల్ అలవాటు ఉంది. ఇటీవల డ్యూటీకి బయలుదేరుతూ ఒక్కసారిగా ఛాతీలో నొప్పితో అల్లాడాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతని గుండె ఆగిపోయింది.

ఇలా వీళ్లిద్దరే కాదు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఇటీవల 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు వారు గుండెపోటుతో వస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఎక్కువగా 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు వారు గుండెపోటుకు గురవడం ఆందోళన కలిగించే అంశమని చెబుతున్నారు. వారిలో కొందరు ఆస్పత్రికి వచ్చేటప్పటికే మృత్యువాడ పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గుండెపోటుకు గురవుతున్న యువతను ఇటీవల తరచుగా చూస్తున్నాం. గుండె పోటుకు గురవుతున్న యువతలో 80 శాతం మందికి స్మోకింగ్, ఆల్కహాల్, స్ట్రెస్ కారణాలుగా ఉంటున్నాయి. రక్తనాళాల్లో బ్లాక్స్ ఏర్పడిన వారిని గుర్తించి స్టెంట్స్ వేస్తున్నాం. రక్తనాళాల్లో పూడికలకు స్టెంట్స్ వేయాలా లేక బైపాస్ సర్జరీ అవసరమా.. మందులు సరిపోతాయా.. అనేది నిర్ణయించేందుకు ఎఫ్ఎఫ్ఆర్ పరీక్ష చేస్తాం. ఇటీవల యువతకు ఎక్కువగా యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీలు చేస్తున్నాం.

– డాక్టర్ బి.విజయచైతన్య, కార్డియాలజిస్ట్, విజయవాడ

కారణాలు ఇవీ..

- చిన్న వయస్సులోనే గుండెపోటుకు గురవడానికి వైద్యులు అనేక కారణాలు చెపుతున్నారు.
- చదువులో, విధుల్లో తీవ్రమైన వత్తిడికి (స్ట్రెస్) గురవడం.
- స్మోకింగ్, ఆల్కహాల్ అలవాట్లు ప్రధాన కారణం.
- ఫాస్ట్‌ఫుడ్, రక్తంలో చెడు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉండటం కూడా కారణమే.
- రెండు పదుల వయస్సులోనే షుగర్ వచ్చినా గుర్తించక పోవడం.
- తల్లిదండ్రులు ఇద్దరికీ గుండె జబ్బు ఉన్న పిల్లలు చిన్న వయస్సులోనే గుండె జబ్బుల బారిన పడొచ్చు.
- వాతావరణ కాలుష్యం కూడా గుండె జబ్బులకు దారితీస్తోంది.
- కోవిడ్ బారిన పడిన వారి సన్నని రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడి ఇరవై ఏళ్ల వారికి కూడా గుండెపోటు వస్తోంది.

ఏమి చేయాలంటే..

- గుండె జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది.
- పనిలో వత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. యోగా, ధ్యానం వంటి వాటిపై దృష్టి సారించాలి.
- శారీరక శ్రమ కలిగేలా రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్, వ్యాయామం చేయాలి.
- తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉన్న వారు వయస్సు 30 ఏళ్లు దాటిన తర్వాత హార్ట్ చెకప్ తరచూ చేయించుకోవాలి.
- ఆరోగ్యకమైన ఆహారం తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుట్, నూనె ఎక్కువగా వినియోగించిన ఆహారం తీసుకోరాదు.

ఆగస్ట్ 31 వరకు 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోమవారం నుంచి ఆగస్టు 31 వరకు ఎన్టీఆర్ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఈ క్యాంపెయిన్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడ్తామన్నారు. డయేరియాను సమర్థంగా అడ్డుకునేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి కలెక్టర్ సృజన స్టాప్ డయేరియా పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అతిసార వ్యాధి అంటే ఏమిటి? ఎలా నివారించాలి? ఓఆర్ఎస్, జింక్ ఉపయోగాలు తదితరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అతిసార వ్యాధి నుంచి చిన్నారులకు రక్షించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం ద్వారా ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులపై దృష్టిసారించాలని, ముందుగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఏ విధంగా తయారు చేయాలి, ఉపయోగించాలి అన్న అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. డయేరియా కారణంగా మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తతతో పకడ్బందీ కార్యాచరణను అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో వైద్య – ఆరోగ్యం, ఐసీడీఎస్, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ బి.సి.కె.నాయక్, డీఐఓ అమృత, డీఎల్ఏటీఓ జె.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవుతున్న యువతకు తమ విద్యాసంస్థ తరఫున ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని విద్యాదర్శిని ఐఏఎస్ అకాడమీ సంస్థ చైర్మన్ జి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి విజయవాడలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ప్రవేశ పరీక్షకు హాజరై ఉత్తీర్ణత పొందాలని, ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన వారు మాత్రమే ఉచిత శిక్షణ తరగతుల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఆసక్తి ఉన్న యువతీయువకులు ఈ నెల 10 తేదీలోగా విజయవాడ బెంజిసర్కిల్‌లో ఉన్న విద్యాదర్శిని ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి.7.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని అభ్యర్థులకు అవకాశం ఉన్న సమయంలో ఏదో ఒక బ్యాచ్‌లో శిక్షణా తరగతులను హాజరుకావొచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు 93461 96829 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో డాక్టర్స్ డే

సాక్షి, అమరావతి: సమాజానికి అంకితభావంతో సేవలు అందిస్తున్న గొప్ప సేవలకులు వైద్యులని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో డాక్టర్ లక్ష్మీషా అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో వైద్యులకు సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో అడ్మిన్ దీపక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

కోనేరుసెంటర్: ఆరోగ్యమే మహాభాగ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం పోతేపల్లి గ్రామంలో సోమవారం జరిగిన డయేరియాపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఏటా వర్షాకాలంలో వచ్చే మార్పుల కారణంగా డయేరియా ప్రబలుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను ముందస్తుగా చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వం 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్‌లను నిర్వహిస్తోందన్నారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటి విషయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగానే వ్యవహరించాలన్నారు. అలాగే ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని చెప్పారు.

ఉచితంగా ఓఆర్ఎస్..

అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం మాతృ మరణాలు తగ్గించి, గర్భవతులకు, శిశువులకు బలమైన పోషకాహారాన్ని అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి డయేరియాపై అవగాహన కలిగించాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో కృష్ణా కలెక్టర్ బాలాజీ తదితరులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూలై ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లు చేపట్టాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలో కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. తాగునీటి వనరులు, ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలని, పైప్‌లైన్ లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చినట్లు అయితే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పింఛన్ల పంపిణీ..

అనంతరం గ్రామంలోని పెన్షన్‌దారులకు మంత్రి చేతులమీదుగా నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి, బందరు ఆర్‌డీవో ఎం. వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి టి. శివప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కుంచే నాని, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకుడు బండి రామకృష్ణ పాల్గొన్నారు.

లోకో పైలెట్లు చాలా కీలకం

రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్ల నిర్వహణలో లోకో పైలెట్‌లు, ఫ్రంట్ లైన్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. విజయవాడ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రెనింగ్ సెంటర్)లో సోమవారం శిక్షణలో ఉన్న లోకో పైలెట్‌ల సమీక్ష సమావేశంలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి జీఎం మాట్లాడుతూ విశ్రాంతి సమయాన్ని తప్పనిసరిగా విశ్రాంతి కోసం మాత్రమే వినియోగించుకుని ప్రశాంతమైన మనస్సుతో విధులకు హాజరు కావాలని లోకో పైలట్‌లకు సూచించారు. ప్రమాదాలను ముందస్తుగా నివారించడానికి, రైళ్ల కార్యకలాపాలు సాఫీగా జరిగేందుకు రైల్వేశాఖ నిర్దేశించిన నిబంధనల వెనుక ఉన్న ఉద్దేశాన్ని అర్థం చేసుకుని సిబ్బంది వాటిని తప్పనిసరిగా పాటించాలని వివరించారు.



మాట్లాడుతున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ పక్కన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష..

అనంతరం డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్‌లో జరుగుతున్న పలు ప్రాజెక్ట్ పనుల పురోగతిపై జీఎం అరుణ్‌కుమార్ జైన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిని జీఎంకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న విజయవాడ–గూడూరు మూడో లైన్ నిర్మాణ పనులు, నార్త్ సెక్షన్‌లోని ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్, విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలని, నిత్యం రద్దీగా ఉండే హౌరా–చెన్నై కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించే చర్యలు చేపట్టాల్సిందిగా జీఎం ఆదేశించారు.

వీఎంసీపై లోకాయుక్తలో ఫిర్యాదు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ విధానం(ఆప్కాస్)లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు ప్రభుత్వం అందాల్సిన చెల్లింపులు చేయలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ పిటిషన్ దాఖలు చేసింది. వీఎంసీ పరిధిలోని ఆయా విభాగాల్లో సుమారు 5 వేలమంది కార్మికులు విధులు నిర్వర్తిస్తుండగా వారిలో ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా చనిపోయిన వారు 10మందికి పైగా ఉన్నారని, కార్మికుల వేతనాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ తదితరాలను చెల్లింపులు చేస్తున్నా.. ఆపద సమయంలో కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన చెల్లింపులు చేయటం లేదని యూనియన్ కార్యదర్శి ఆసుల రంగనాయకులు సోమవారం లోకాయుక్తను ఆశ్రయించారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదిలో గుర్తు తెలియని ఓ మగ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కృష్ణలంక స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రైల్వే వంతెన కింద పద్మావతి ఘాట్ సమీపంలో కృష్ణానది నీటిలో ఒక వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు సోమవారం ఉదయం 11.30గంటలకు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నీటి నుంచి బయటకు తీసి మగవ్యక్తి మృతదేహంగా గుర్తించారు. మృతుని వద్ద ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదు. వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని, బ్లూ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గానీ, 9440627086, 9492028570 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఖరీఫ్ కార్యాచరణపై ప్రత్యేక దృష్టి

వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు ఖరీఫ్ కార్యాచరణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. నిర్దిష్ట ప్రణాళికతో సీజన్‌ను విజయవంతం చేసేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సృజన.. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుసంవర్ధక, మత్స్య శాఖలతో పాటు మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక అమలు, జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, భవిష్యత్తు అవసరాలు, విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు, సీసీఆర్సీ కార్డుల పంపిణీ, పంట రుణాలు తదితరాలపై సమావేశంలో చర్చించారు.

- జిల్లాలోని రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సక్రమమైన కార్యాచరణ ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ సాగును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ చెప్పారు. ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులకు సరైన విధంగా అవగాహన కల్పించాలని సూచించారు.
- జిల్లాలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలు, సాగు విస్తీర్ణం, దిగుబడులు, మార్కెటింగ్ అవకాశాలు తదితరాలపై చర్చించారు. రైతుబజార్ల కార్యకలాపాలపైనా సమీక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

- పశుసంవర్ధక శాఖపై సమీక్ష చేస్తూ పశువులకు రోగ నిరోధక టీకాలు, పశువుల దాణా, పశు బీమా, పశు సంచార ఆరోగ్య సేవా కేంద్రాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.
- పట్టు, మత్స్య శాఖలకు సంబంధించి జిల్లాలోని కార్యకలాపాలపై కూడా కలెక్టర్ జి.సృజన సమీక్షించారు. వివిధ శాఖల పనితీరులో పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.నాగమణెమ్మ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విద్యాసాగర్, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, సెరీకల్చర్ ఆఫీసర్ ఎస్.సత్యనారాయణ, మత్స్య శాఖ అధికారి పెద్దిరాజు, ఏపీఎంఐపీ పీడీ పి.ఎం.సుభానీ, ఏటీఎంఏ పీడీ యు.నరసింహారావు, మార్క్‌ఫెడ్ డీఎం కె.నాగమల్లిక, అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ పాల్గొన్నారు.

ఆ చట్టం కార్మికుల పాలిట ఉరితాడు

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్



ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న మోటార్ రంగ కార్మికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత చట్టం మోటార్ రంగ కార్మికులకు ఉరితాడుగా మారనుందని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె. దుర్గారావు ఆందోళన వ్యక్తం చేశారు. భారత న్యాయ సంహిత చట్టంలోని 106(1), 106(2)లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందే భారత న్యాయ సంహిత చట్టం తేవాలని ప్రయత్నించిందని, దేశవ్యాప్తంగా ఆటో, మోటార్ రంగ కార్మికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో తాత్కాలికంగా నిలిపివేసిందన్నారు. ఎన్నికల్లో గెలిచి తిరిగి అధికారంలోకి వచ్చిన బీజేపీ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం రవాణా రంగ కార్మికులకు ఉరితాడుగా మారుతుందన్నారు. ప్రమా దాలు సంభవిస్తే ఏళ్ల తరబడి జైలు శిక్ష, లక్షల రూపా యల జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే మోటార్ రంగ కార్మికుల కుటుంబాలు రోడ్డు పాలవుతాయన్నారు. కేంద్రం పునరాలోచన చేసి కార్మికులకు ఉరితాడుగా మారిన ఆయా సెక్షన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. రూబెన్ కుమార్, పశ్చిమ సిటీ సి.ఐ.టి.యు అధ్యక్ష కార్యదర్శులు జి. వెంకట్రావు, ఇ.వినారాయణ, సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. హనుమంతరావు, నగర ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ కుస్తీ పోటీలకు రోహిత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు తమ విద్యార్థి ఎస్. రోహిత్‌కుమార్ ఎంపికైనట్లు ఎన్టీఆర్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఇన్‌చార్జి దాసరి శ్రీనివాసు తెలిపారు. జూలై ఐదు నుంచి ఏడో తేదీ వరకూ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉధంసింగ్‌నగర్‌లో జరిగే సబ్ జూనియర్ జాతీయ రెజ్లింగ్(కుస్తీ) పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రోహిత్‌కుమార్ గ్రీకో రోమన్ విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రోహిత్ కుమార్ కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడన్నారు.



రోహిత్

జాతీయ పోటీలకు రోహిత్ కుమార్ ఎంపిక కావడం పట్ల హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు టి. శేషయ్య, ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, పాఠశాల కార్యదర్శి కేఎల్వీ మోహనరావు, ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరావు, పీఈటీ ఎంవీ సత్య ప్రసాద్ అభినందనలు తెలిపారు.

కానూరులో వ్యక్తిపై హత్యాయత్నం


పెనమలూరు: కానూరులో వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. అయితే ఐపీసీ స్థానంలో కొత్తగా వచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)చట్టం కింద మొదటి కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం పూరి ప్రాంతానికి చెందిన చికుజల్లి (24) పటమట వినాయక్‌నగర్‌లో ఉంటున్నాడు. అతను కానూరు నవతారోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. ఇతనితో పాటు రూమ్‌లో బికాస్‌కుమార్‌బెహ్రా, ధర్మజయ బెహ్రా, మణికంఠ, ధనుంజయకొండ ఉంటున్నారు. అందరూ ఒకే ప్రైవేటు కంపెనీలోనే పని చేస్తున్నారు. అయితే పని వద్ద గత కొంతకాలంగా చికుజల్లితో మణికంఠ తగాదాపడుతున్నాడు. కాగా 30వ తేదీ రాత్రి షిఫ్టులో అందరు డ్యూటీకి హాజరయ్యారు. అయితే అర్ధరాత్రి దాటిన తరువాత మణికంఠ కూరగాయలు కోసే కత్తితో ఒక్కసారిగా చికుజల్లిపై దాడి చేసి విచక్షణా రహితంగా పొడిచాడు. చికుజల్లి పారిపోయే యత్నం చేయగా ధనుంజయకొండ గట్టిగా పట్టుకున్నాడు. అక్కడే పని చేస్తున్న మిగతా కార్మికులు ఈ ఘటన చూసి చికుజల్లిని కాపాడారు. గాయపడిన చికుజల్లిని పటమటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

బీఎన్ఎస్ చట్టం కింద మొదటి కేసు..

కాగా కేంద్ర ప్రభుత్వం సోమవారం నుంచి అమలులోకి తీసుకు వచ్చిన మూడు చట్టాల్లో మొదటి కేసు పెనమలూరు పోలీసులు నమోదు చేశారు. గతంలో ఐపీసీ కింద హత్యాయత్నం కేసు నమోదు చేసేవారు. అయితే దాని స్థానంలో కొత్తగా వచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్టం కింద కేసు నమోదు చేశారు.

ముగిసిన చదరంగం రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 12వ తేదీ నుంచి జరిగే అంతర్జాతీయ చెస్ 1800 లోపు ఫిడే రేటింగ్ టోర్నీకి ఎంట్రీ ఫీజు రాయితీతో ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు టోర్నీ డైరెక్టర్ తాళ్ల నరేష్ తెలిపారు. కరెన్సీనగర్‌లోని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయి. స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో అంతర్జాతీయ టోర్నీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు ఓపెన్ విభాగంలో ప్రాతినిధ్యం వహించే అత్యంత క్రీడా నైపుణ్యం కలిగిన టాప్–10 క్రీడాకారులను జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఈ జట్టులో రవికుమార్, అభిరామ్, నాగ ఉదయ్, సత్యసాయి, వెంకటసుభారావు, నిరంజన్, శివదత్త, మనోజ్, సుశాంత్‌శర్మ, వేదాంత ఉన్నట్లు చెప్పారు. అండర్–7, 9, 11,13, 15 విభాగాల్లో బాలికలకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపిక పోటీల అనంతరం విజేతలకు ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్, సీనియర్ చెస్ క్రీడాకారుడు రామ్‌మోహన్‌రావు బహుమతులు అందజేశారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

వైద్యుల సేవల ఎనలేనివి

ఏపీ హంస ఆధ్వర్యంలో పలువురికి సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): జబ్బు చేసి తమ వద్దకు వచ్చిన వారికి స్వస్థత చేకూర్చడమే లక్ష్యంగా సేవలు అందించే వైద్యుల సేవలు ఎనలేనివని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) నగర శాఖ కార్యదర్శి నాళం మురళీకృష్ణ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ హంస ఆధ్వర్యంలో పలువురు వైద్యులను సత్కరించారు. అందులో భాగంగా సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు, డెర్మటాలజీ ప్రొఫెసర్ డాక్టర్ టి. వాణి, పాథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉండవల్లి దేవప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులకు వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వి. రామకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీదేవి, జయకుమార్, విమల, కృష్ణకిశోర్, వాసు, సహాయ కార్యదర్శులు ఎంఎస్ఆర్‌కే ప్రసాద్, దీక్షితులు, భాస్కరరావు, బి. శ్రీనివాసరావు, లక్ష్మాజీ, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఫిజీషియన్‌కు సత్కారం..

నగరంలో నాలుగున్నర దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్న సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఎంవీ మధుసూదనరావును పలువురు ఘనంగా సత్కరించారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన పనిచేస్తున్న సీతారామపురం దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సామాజికవేత్త పదముత్తం సురేష్‌కుమార్‌తో పాటు, ఆస్పత్రి సిబ్బంది ఆయనతో కేక్‌కట్ చేయించి సత్కరించారు.



డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సీనియర్ ఫిజీషియన్ ఎంవీ మధుసూదనరావు


డీఎంహెచ్ఓ కార్యాలయంలో..

పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పలువురిని సత్కరించారు. వారిలో డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసినితో పాటు, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ జె. ఉషారాణి, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇంధుమతి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ విద్యాసాగర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

మదర్సాలో కరిష్మా మృతిపై విచారణ జరిపాలి

ముస్లిం పర్సనల్ లాబోర్డు రాష్ట్ర అధ్యక్షుడు అల్తాఫ్‌రజా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అజిత్‌సింగ్‌నగర్ మదర్సాలో బాలిక కరిష్మా మృతిపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసేలా సమగ్ర విచారణ జరిపించాలని ముస్లిం పర్సనల్ లాబోర్డు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అల్తాఫ్ రజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండపల్లి షాబుఖారీ మసీదులో కరిష్మా తల్లిదండ్రులు, బంధువులు సోమవారం ఆయనను కలిశారు. వారిని ఓదార్చిన ఆయన మాట్లాడుతూ మృతి చెందిన కరిష్మా మృతదేహాన్ని వైద్యశాలకు తీసుకువెళ్లడంపై ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. కరిష్మాకు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు సుమారు 8నుంచి 10 గంటల క్రితం మరణించినట్లు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. బాలిక పుస్తకాలు, సీసీ టీవీ ఫుటేజీ మాయం చేయడంపై పోలీసులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేని మదర్సా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే న్యాయం కోసం రాష్ట్ర హోం మంత్రి, డీజీపీ, గవర్నర్‌లను సైతం కలుస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న అల్తాఫ్‌రజా, తదితరులు

రైలు నుంచి జారిపడిన వ్యక్తికి తీవ్రగాయాలు

గుడివాడరూరల్: రైలు కింద జారిపడి ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ రైల్వేస్టేషన్ పరిధిలోని మల్లాయపాలెం రైల్వేగేట్ వద్ద సుమారు 60సంవత్సరాల వయసున్న ఓ వ్యక్తి రైలు కింద జారిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. కాగా గాయపడిన వ్యక్తి పేరు రమణ అని తెలిపారన్నారు. గాయపడిన వ్యక్తిని 108ద్వారా రైల్వే సిబ్బంది గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



గాయాలపాలైన రమణ

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ టీచర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీలోని 1, 2 అంతర్గత రహదారులు, జడ్జి క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జిల్లా జైలులో నూతన చట్టాలపై అవగాహన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పార్లమెంట్ ఆమోదించిన నూతన చట్టాలపై సోమవారం జిల్లా కారాగారంలోని ఖైదీలకు అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో న్యాయవాదులు బి. సాంబశివరావు, ఎన్.కోటేశ్వరరావు, పద్మజ ఖైదీలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలపై నియమావళి, అమలు, ఖైదీలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సంస్కరణలు, సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కారాగార పర్యవేక్షణాధికారి హంస పాల్, జైలర్ ఎన్.గణేష్, జైలర్ వేణు, డిప్యూటీ జైలర్ బి.గోపయ్యనాయక్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్టార్‌లైనర్ నాన్‌ఏసీ స్లీపర్ బస్సులు




ఆటోనగర్(విజయవాడ తూర్పు): ఆటోనగర్ ఆర్టీసీ డిపో మంగళవారం నుంచి ఈసీఐఎల్, బీహెచ్‌ఈఎల్‌కు స్టార్‌లైనర్ నాన్ ఏసీ బస్సులను నడుపుతున్నట్టు డీఎం కె.ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈసీఐఎల్ వెళ్లడానికి ఆటోనగర్ టెర్మినల్ నుంచి సర్వీస్ నంబర్ 9932 బస్సు ప్రతిరోజూ రాత్రి 9.30 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈసీఐఎల్ నుంచి ఆటోనగర్‌కు సర్వీస్ నంబర్ 9932 ప్రతి రోజూ రాత్రి 11 గంటలకు బయలుదేరుతున్నట్టు తెలిపారు. ఆటోనగర్ టెర్మినల్ నుంచి బీహెచ్ఈఎల్ సర్వీస్ నంబర్ 9934 బస్సు రోజు మార్చి మరొక రోజు రాత్రి 10.15 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్న అయోధ్యనగర్‌లోని చిరువ్యాపారుల దుకాణాలను సోమవారం వీఎంసీ అధికారులు తొలగించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదల దుకాణాలను తొలగించడంపై వ్యాపారులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశారు. అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ రోడ్డులో గత 20 ఏళ్లుగా కొందరు చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటుచేశారు. వీటిని వీఎంసీ అధికారులు ఒక్కసారిగా తొలగించడంపై వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జి ఒగ్గు గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు వెండర్స్ చట్టం ప్రకారం ఇష్టారాజ్యంగా దుకాణాలు తొలగించటం అన్యాయమన్నారు. ఇటీవల ఇక్కడ జరిగిన ఓ సన్మాన కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసుల విజ్ఞప్తితో అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించటం విచారకరమన్నారు. ధనిక వర్గానికి చెందిన అపార్ట్‌మెంట్ వాసులను ప్రసన్నం చేసుకోవడానికి పేదల పొట్టకొట్టటం తగదని హితవు పలికారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని గవాస్కర్ అన్నారు.

సివిల్ రంగంలో సాఫ్ట్‌వేర్‌కు ప్రాధాన్యం



పెనమలూరు: సివిల్ రంగంలో సాఫ్ట్‌వేర్‌కు చాలా ప్రాధాన్యత ఏర్పడిందని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు అన్నారు. కాలేజీలో సోమవారం సివిల్ విభాగం ఆధ్వర్యంలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై వారం రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. సివిల్ విభాగంలో భవనాలు, రోడ్ల నిర్మాణానికి సాఫ్ట్‌వేర్ దోహదపడుతుందని చెప్పారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్ మాట్లాడుతూ సాంకేతికత దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సివిల్ విభాగంలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్ ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని వివరించారు. క్యాడ్ నిపుణుడు కె.ప్రసాద్ మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

- వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్
- డెంగ్యూ, మలేరియా నివారణపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలంలో ప్రజలు ఎక్కువగా ఎదుర్కొంటున్న సమస్య డెంగ్యూ, మలేరియావంటి సీజనల్ వ్యాధులను నివారించడానికి నగరపాలక సంస్థ, హెల్త్ సెక్రటరీలు, మలేరియా వర్కర్లు ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన డెంగ్యూ, మలేరియా నివారణపై పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో దోమల నివారణకు నిర్వహిస్తున్న యాంటీ లార్వే ఆపరేషన్లు, ఎం ఎల్ ఆయిల్స్ స్ప్రే, అబెట్ స్ప్రేలు చేస్తున్నారని, దోమలు పెరగకుండా ఉండేందుకు మురుగులేదా వర్షం నీటి నిల్వలు ఎక్కడా లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్టాఫ్ డయేరియా నినాదంతో, ప్రజలకు విస్తృత అవగాహన కల్పిరచాలని తెలిపారు.

నగరవ్యాప్తంగా కలుషితం లేని తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు, అది నిర్ధారించుకోవడానికి ఎప్పటికప్పుడు నీటినమూనాలను పరీక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు చీఫ్ సిటీ ప్లానర్ జబీజీఎస్వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ పి.రత్నావళి, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, అకౌంట్ ఆఫీసర్ నరసింహమూర్తి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ వెంకటేశ్వరరావు, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయీసంఘం ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్లు దాఖలు చేస్తున్న కార్పొరేటర్ ప్రవల్లిక, చిత్రంలో వెంకటసత్యం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలోని పలు ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చే స్థాయీసంఘం ఎన్నికలకు సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం ఆరుగురు సభ్యులకు ఎన్నిక జరగనుండగా దీనికి సోమవారం తొమ్మిది మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు వారి నామినేషన్లను వీఎంసీ అదనపు కమిషనర్, ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మహేష్‌కు సమర్పించారు.

నామినేషన్లు వేసిన కార్పొరేటర్లు

వైఎస్సార్ సీపీ నుంచి 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడపూడి నిర్మల, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 30వ డివిజన్ కార్పొరేటర్ భీమిరెడ్డి శివ వెంకట జానారెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ వల్లూరి శర్వాణీమూర్తి, 41వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ఇర్ఫాన్, 43వ డివిజన్ బాపతి కోటిరెడ్డి, 48వ డివిజన్ కార్పొరేటర్ అట్లూరి ఆదిలక్ష్మి, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి నామినేషన్లు దాఖలు చేయగా, టీడీపీ నుంచి 32వ డివిజన్ కార్పొరేటర్ రామ్మోహనరావు నామినేషన్‌ను దాఖలు చేశారు.

నేడు స్క్రూటినీ

ఎన్నికకు దాఖలైన నామినేషన్లకు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి స్క్రూటినీ జరుగుతుందని వీఎంసీ అదనపు కమిషనర్(జనరల్), ఎన్నికల అధికారి మహేష్ తెలిపారు.

ఉపగ్రహాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ పుష్పవల్లితాయారమ్మ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఉపగ్రహాల సాంకేతికతపై అవగాహన పెంచుకొని ఆ దిశగా తీర్చిదిద్దుకోవాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ పుష్పవల్లితాయారమ్మ జల్లూరి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఉపగ్రహాల సాంకేతికత – అనువర్తనాలు – సమగ్ర పరిశీలన' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్త డాక్టర్ పుష్పవల్లి తాయరమ్మ జల్లూరి మాట్లాడుతూ ఆధునిక సామాజిక వికాసానికి ఉపగ్రహాలు అండగా ఉంటున్నాయన్నారు. శాస్త్రీయ పరిశోధనలను సమాజానికి అందించడంలో ఉపగ్రహాలు కీలకభూమిక పోషిస్తున్నాయన్నారు. వాతావరణం, సమాచార వ్యవస్థ, టెలికమ్యూనికేషన్స్ తదితర రంగాలకు సంబంధించి విస్తృత సమాచారాన్ని ఉపగ్రహాల ద్వారా పొందుతున్నామన్నారు. పర్యావరణ విపత్తులను ముందుగా తెలుసుకొని నష్టనివారణకు ఉపగ్రహాల ద్వారా వచ్చే సమాచారం చాలా కీలకమవుతుందని వివరించారు. అంతరిక్ష అన్వేషణకు ఉపగ్రహాల వినియోగం ఇటీవల పెరిగిందని తెలిపారు. పలు దేశాలు ఉపగ్రహాల ద్వారా విస్తృతమైన ఆదాయ వనరులను పెంచుకుంటున్నాయని వివరించారు. ఉపగ్రహాల సాంకేతిక పరిజ్ఞానం, వాటి వినియోగంతో పాటుగా పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పుష్పవల్లితాయరమ్మ ఇస్రో శాస్త్రవేత్తగా పని చేయడం కాలేజీకి గర్వకారణమన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు మరిన్ని విజయాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు బి.శ్రుతి, ఏహెచ్‌డీ ప్రకాష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు, ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆషాఢ మాసంలో నిర్వహించే ఉత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆలయ ఈవో కె.ఎస్. రామరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి దేవస్థానానికి చెందిన ముఖ్య అధికారులు హాజరయ్యారు. తొలుత దుర్గగుడి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అన్నదాన భవనం, లడ్డూ పోటుతో పాటు వెలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణంపై ఆలయ ఈఈలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరో వైపున ఆలయ ప్రాంగణంలో నిర్మించిన యాగశాల, పూజా మండపాల పనుల పురోగతి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించే విశేష పూజలు, సేవలపై ఆలయ డీఈవోలు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశంలో చర్చించారు. రానున్న మాసంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరగనుండటంతో భక్తుల రద్దీతో పాటు ప్రముఖుల రాక అధికంగా ఉంటుందన్నారు. ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, జంగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను తిప్పికొడదాం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ నాయకత్వంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కార్మికవర్గ హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 10న దేశవ్యాప్తంగా జరుగుతున్న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో కె.నాగభూషణ్ అధ్యక్షతన మున్సిపల్ కార్మికుల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి నర్సింగరావు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాగానే కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ప్రావిడెంట్ ఫండ్ చట్టంలో పెనాల్టీని తగ్గించి కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల మూలంగా రైల్వే రంగంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, విమానాశ్రయాలకు భద్రత లేకుండా పోతుందన్నారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం మున్సిపల్ రంగంలోని ఇంజినీరింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్ల సమస్యలతో పాటు రాష్ట్రంలోని లక్షలాదిమంది అవుట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం బి.సోమయ్య, రుకూటి రాజు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

తిరువూరు: నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులకు తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. స్థానిక సిద్ధార్థ స్కూలులో తమ పిల్లలను చదివిస్తున్న సోమవరపు సురేష్, రమలకు దోస్త్ పూర్వవిద్యార్థుల సంఘం తరపున 2024–25 విద్యాసంవత్సరానికి అవసరమైన ఫీజులను చెల్లించారు. దోస్త్ సభ్యులు పరసా నెహ్రూజీ, దుక్కిపాటి మురళీకృష్ణ, చిత్తలూరి సోమశేఖర్, యలమంచిలి నాగమల్లేశ్వరరావు, గుడివాడ నరేంద్ర, గట్ల మురళీకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణి పాల్గొన్నారు.

'లయన్స్ జూబ్లీ హరిత' వైద్యులకు సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ జూబిలీ హరిత ఆధ్వర్యంలో సోమవారం పలువురు వైద్యులను సత్కరించారు. ఎంజీరోడ్డులోని వరుణ్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఉన్నతమైనదన్నారు. పేదలకు వైద్య సేవలను అతితక్కువ ఖర్చుతో అందిస్తున్న వరుణ్ సెంటర్ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహించిన వైద్యులు విజయదుర్గ, నరసింహారెడ్డి, షణ్ముఖ్, గోపికృష్ణ, రంజిత్, శివరామకృష్ణ తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, వరుణ్ మోటార్స్ ఈడీ పీవీ సత్యనారాయణ, లయన్స్ రీజియన్ చైర్ పర్సన్ శరాబందిరావు, జూబిలీ హరిత అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసప్రసాద్, కార్యదర్శి కోటా ఫణి, అంకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళ తదితర సామాజిక పింఛన్లను వీఎంసీ ప్రత్యేక అధికారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వశీంబేగ్ పంపిణీ చేశారు. పటమటలోని 11,12,13 డివిజన్లలో పెన్షనర్లకు నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, సాయిబాబు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

- కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 20వ డివిజన్‌లో పెన్షన్ లబ్ధిదారులకు వార్డు సచివాలయ కార్యదర్శులు సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ప్రతి ఇంటికి వెళ్లి సోమవారం పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండు శ్రీను, మేకల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. – రాణిగారితోటలో 17, 18 డివిజన్ల టీడీపీ అధ్యక్షులు రాయి రంగమ్మ, వేముల దుర్గారావు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తనయుడు క్రాంతి, నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఏలూరుకు చెందిన చిన్న వెంకన్న బృందం సోమవారం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద సోమవారం సాయంత్రం కళాబృందానికి చెందిన పలువురు చిన్నారులు, మహిళలను అమ్మవారి పాటలు, కీర్తనలకు లయబద్ధంగా కోలాటాన్ని ప్రదర్శించారు. బుజ్జి... బుజ్జి... గణపయ్యా.., గోగులో.. గోగుల్లో..., లేలేవయ్యా అంజనస్వామి, అంటూ పలు కీర్తనలను ఆలపించారు. కీర్తనలకు తగినట్లుగా బృందంలోని సభ్యులు కోలాటం ఆడగా, భక్తులను వీక్షించారు. అనంతరం బృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ద్విచక్ర వాహనం ఢీ.. తాపీ మేస్త్రికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనం ఢీకొని తాపీ మేస్త్రి గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానునగర్‌కు చెందిన చెన్నారావు, అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన మల్లెల సాంబశివరావుతో కలిసి తాపీ పని చేస్తుంటాడు. అతను ఆదివారం తేదీ రాత్రి 11 గంటల సమయంలో గులాబీతోట వైపు నుంచి కేంద్రీయ విద్యాలయం వైపు నడుచుకుంటూ వస్తున్నారు. ఈక్రమంలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం చెన్నారావును ఢీ కొట్టింది. ఘటనలో గాయపడిన చిన్నారావును ఆస్పత్రికి తరలించారు. మల్లెల సాంబశివరావు ఫిర్యాదుతో సోమవారం గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న మంగళంపల్లి జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు పద్మభూషణ్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి వేడుకలను తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద విజయవాడ బ్రాహ్మణ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సమన్వయ కర్త జింకా చక్రధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు పాల్గొంటారని వారిని ఆత్మీయంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



ఎస్ఆర్ఆర్ కాలేజీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మనం చేసే రక్తదానం మరో ఇద్దరికి ప్రాణదానం చేస్తుందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం డాక్టర్స్ డే పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధనిక పేద తారతమ్యం లేకుండా చేయగలిగిన దానం రక్తదానం మాత్రమేనన్నారు. విద్యార్థి దశ నుంచే రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ రక్తదానం చేస్తే కొత్త రక్తకణాలు ఏర్పడటంతో యాక్టివ్‌గా ఉంటారని చెప్పారు. ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జీసీ పద్మదాసు, సెక్రటరీ వి.కిషోర్, పీవైఎస్ రావు కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మరింత చేరువగా సేవలు

ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్‌సింగ్



ఎస్‌బీఐ మొబైల్ ఏటీఎం వాహనాన్ని ప్రారంభిస్తున్న మనీష్‌కుమార్‌సింగ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వినియోగదారులకు బ్యాంక్ సేవలు మరింత చేరువ చేయడానికి మొబైల్ ఏటీఎంను ప్రారంభిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మనీష్‌కుమార్‌సింగ్ అన్నారు. ఆ బ్యాంక్ 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జోనల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా చేశారు. ఉద్యోగులకు మెడికల్ క్యాంప్‌తో పాటు, రక్తదాన శిబిరం జరిగింది. అనంతరం మొబైల్ ఏటీఎం సేవల నూతన వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మనీష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ ఎస్‌బీఐ సేవలకు వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సేవలు మరింత చేరువ కావడానికి మొబైల్ ఏటీఎం వాహనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇది నగరంలోని పలు ప్రాంతాల్లో సేవలు అందిస్తుందన్నారు. ఈ వాహనంలో ఏటీఎంతో పాటు, డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశామని, దాని ద్వారా బ్యాంక్ అందిస్తున్న సేవలు, సౌకర్యాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. సైబర్‌నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అవాంఛిత ఫోన్‌కాల్స్‌లో బ్యాంక్ వివరాలు, ఓటీపీలు తెలియజేయవద్దని సూచించారు. ఫోన్‌లో వచ్చే తెలియని లింక్స్ ఓపెన్ చేయవద్దన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమాచారం అవసరమైనా తమ బ్రాంచిలను సందర్శించి వివరాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు వి. విజయశేఖర్, ఏవీవీ రాజశేఖర్, వీఎస్ఆర్ శేఖర్, కె.సతీష్, ఎం.వి జయమాధవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణతో సమస్యల పరిష్కారం

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజాఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను త్వరగా పరిష్కరించుకోవడానికి ప్రజలకు ఇదొక సదవకాశమని, ప్రతి సోమవారం ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ఫిర్యాదులను పరిష్కరించుకోవాలని చెప్పారు.

మొత్తం 16 ఫిర్యాదులు అందగా అందులో 7 టౌన్ ప్లానింగ్, 5 ఇంజినీరింగ్, ఎస్టేట్ 1, హార్టికల్చర్ 1, రెవెన్యూ 1, యూసీడీ 1 ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ అమత్ లత, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి సోమశేఖర్‌రెడ్డి, డెబిట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రామ్మోహన్‌రావు, ఎకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యంగా జీవిద్దాం

డాక్టర్స్ వాకర్స్ క్లబ్ ఆవిర్భావ వేడుకల్లో డాక్టర్ ఎంవీరావు



నూతన కార్యవర్గంతో బాధ్యతలు స్వీకరింపజేస్తున్న డాక్టర్ ఎంవీ రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతిరోజూ క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తే శారీరక, మానసికంగా ఆరోగ్యంగా జీవించవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీ రావు అన్నారు. నగరంలో ఏర్పాటైన డాక్టర్స్ వాకర్స్ క్లబ్ ఇన్‌స్టలేషన్ వేడుకలు సోమవారం జరిగాయి. సూర్యారావుపేటలోని మానస సైకియాట్రిక్ నర్సింగ్‌హోంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ ఎంవీరావు నూతన కమిటీ సభ్యులతో బాధ్యతల స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధుల బారినపడుతున్నామని, ఈ నేపథ్యంలో వాకింగ్‌కు ప్రాధాన్యం పెరిగిందన్నారు. డాక్టర్స్ ప్రొఫెషన్‌లో ఉన్న వారందరూ వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్స్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ అయోధ్య, కార్యదర్శిగా డాక్టర్ జె భువనేశ్వరరావు, డాక్టర్ ఎంవీ సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ సూరే పవన్‌కుమార్, డాక్టర్ మానస కాజ, పి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా టూరిస్ట్ పోలీస్ క్యాబిన్



బరంపార్క్‌లో మూతపడిన టూరిస్ట్ పోలీస్ సెంటర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)కు చెందిన హరిత బరంపార్క్‌లో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ సెంటర్ నిరుపయోగంగా మారింది. క్యాబిన్‌లో ఉండాల్సిన పోలీసులు కానరాక పోవడంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బరంపార్క్‌లో చెట్ల కింద ఉండే బెంచీలపై కొంతమంది జంటలు కూర్చుని గంటల తరబడి గుసగుసలాడుకోవడంతోపాటు నలుగురూ చూస్తున్నారన్న ధ్యాసకూడా లేకుండా వ్యవహరిస్తూ కనపడుతుంటారు. కొందరైతే భవానీ ఐల్యాండ్‌లోకి వెళ్లి సాయంకాలం వరకు కాలక్షేపం చేసి వస్తుంటారు. పర్యాటకం పేరుతో ఎక్కడెక్కడ నుంచో ఎవరెవరో వచ్చి పోతుంటారు. అటువంటి వారందరిని నియంత్రించేందుకు జిల్లా పోలీసు అధికారులు బరంపార్క్‌లో టూరిస్ట్ పోలీస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బరంపార్క్, భవానీ ఐలాండ్‌లలో నేరాలు జరిగినా వెంటనే స్పందించి చర్యలు తీసుకునేవారు. భవానీపురం పోలీసులు ప్రతి రోజూ ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉండి వచ్చిపోయేవారిని గమనిస్తూ ఉంటారు. అనుమానం వచ్చినవారి వివరాలను తెలుసుకుని నిఘా పెట్టేవారు. దీంతో కాలక్షేపంగా వచ్చే జంటలో గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయ్యింది. పోలీసులు చూస్తే తమ బండారం బయటపడిపోతుందని భయపడి ఇక్కడికి రావడం తగ్గించేశారు. ఈ నేపథ్యంలో గత నెల రోజులకుపైగా టూరిస్ట్ పోలీస్ కేంద్రం మూతపడింది. భవానీపురం పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది లేకో మరే కారణమో తెలియదుగానీ ప్రస్తుతానికి నిరుపయోగంగా తయారైంది

క్లుప్తంగా...

ఎర్రచందనంపై ఏ విచారణకైనా సిద్ధమే

- నిరూపించలేకపోతే బహిరంగ క్షమాపణ చెబుతారా?
- పవన్ కళ్యాణ్‌కు ఎంపీ మిథున్ రెడ్డి సవాలు



సాక్షి, అమరావతి: పవన్ కళ్యాణ్ దీక్షలో ఉండి కూడా అలవోకగా ఎలా అబద్ధాలు చెప్పగలుగుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీ మిథున్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రచందనం అక్రమరవాణాపై పవన్ చేసిన ఆరోపణలకు సంబంధించి ఏ విచారణకైనా సిద్ధమని చెప్పారు. సత్యశోధన పరీక్షకైనా సిద్ధమని అన్నారు. 'మీరు అధికారంలో ఉన్నారు. పోలీసులు, వ్యవస్థలు మొత్తం మీ చేతిలో ఉన్నాయి. ఐదేళ్లపాటు వారికి సమయం ఉంది. ఐదేళ్లలో ఆరోపణలను నిరూపించలేకపోతే బహిరంగంగా క్షమాపణలు చెప్పేందుకు సిద్ధమేనా' అని పవన్‌కు సవాల్ విసిరారు. ఇంకా ఎంతకాలం తమపై వ్యక్తిత్వ హననానికి పాల్పడతారని నిలదీశారు. ఈమేరకు మిథున్‌రెడ్డి సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్టు చేశారు.

పిన్నెల్లితో పెద్దిరెడ్డి, కాకాణి ములాఖత్



జిల్లా జైలు వద్ద మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి తదితరులు

వెంకటాచలం: నెల్లూరు జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీ సోమవారం ములాఖత్ అయ్యారు. టీడీపీ సాగిస్తున్న అరాచకాలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై బనాయిస్తున్న అక్రమ కేసులు, జరుగుతున్న దాడులు తదితర అంశాలపై చర్చించారు.

గ్రామసభలో ఎమ్మెల్యే సతీమణి

- ఏ హోదాలో పాల్గొన్నారంటూ విమర్శల వెల్లువ
- వార్డు సభ్యులకు వేదికపై చోటు లేదు



ఎమ్మెల్యే పులివర్తి భార్య సుధారెడ్డి పక్కన నిలబడ్డ వార్డు సభ్యులు

మంగళం(తిరుపతి జిల్లా): ప్రభుత్వం మారిన తర్వాత తొలిసారి చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం సప్తగిరినగర్ గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే సతీమణి పాల్గొని ప్రసంగించడం.. అసలు వేదికపై కూర్చోవాల్సిన వార్డు మెంబర్లకు సీట్లు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. గ్రామ సభలకు గౌరవ అతిథిగా ఎమ్మెల్యే హాజరవడం పరిపాటి. నిబంధనల ప్రకారం గ్రామసభను పంచాయతీ సర్పంచ్ నేతృత్వంలో సెక్రటరీ నిర్వహించాల్సి ఉంది. సభా వేదికపై వార్డు సభ్యులు కూర్చోవాలి. కానీ, ఇందుకు విరుద్ధంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానంలో ఆయన సతీమణి సుధారెడ్డి పాల్గొని రాజకీయ ప్రసంగం చేశారు. ఈ క్రమంలో అసలు ఎమ్మెల్యే పులివర్తి నానీనా.. ఆయన సతీమణా.. అని, ఆమె ఏ అర్హత, హోదాతో గ్రామసభలో వేదికపై కూర్చుని ప్రసంగం చేశారని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యే సతీమణి వేదికపైకి రాగానే అప్పటివరకు పైన ఉన్న వార్డు సభ్యులను కిందకు పంపించారు. దీంతో వార్డు సభ్యులు వేదిక పక్కన నిలబడాల్సిన దుస్థితి నెలకొంది.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని జిల్లాల్లోనూ జాయింట్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు వెల్లడించారు. 'బాలలు మత్తు పదార్థాలు–మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు'పై ఢిల్లీ విజ్ఞానభవన్‌లో ఆదివారం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన అధికారులు, ప్రతినిధులతో సమావేశం జరిగింది. సోమవారం అప్పారావు ఇందుకు సంబంధించిన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను జాతీయ సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మెడికల్ షాపులు, మద్యం షాపుల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా బాలలను ఉంచడం కోసం బాలల న్యాయ చట్టం ప్రకారం రూపొందించబడిన చట్టాలను కఠినతరంగా అమలు, పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

మాయమయింది మళ్లీ వచ్చింది

నల్లమల అడవుల్లో ప్రత్యక్షమైన అడవి దున్న

- పూర్వమే అదృశ్యమైన వీటిని పాపికొండల నుంచి నల్లమలకు రప్పించాలని ప్రణాళిక
- అప్రయత్నంగానే సాకారమైన అటవీ శాఖ అధికారుల స్వప్నం



నల్లమలలో కనిపించిన అడవి దున్న

అనుకోని అతిథి నల్లమలకు చేరింది. జీవ వైవిధ్యంతో అలరారుతున్న ఆత్మకూరు అటవీ డివిజన్‌లో అడవి దున్న ప్రత్యక్షమైంది. ఇక్కడి అడవుల్లో 150 ఏళ్ల క్రితం అదృశ్యమైన మహిషం తిరిగి కనిపించడం అటవీ అధికారులను ఆశ్చర్య చకితుల్ని చేస్తోంది. తలచిందే తడవుగా.. అడవి దున్న వలచి రావడంతో వన్యప్రాణి ప్రేమికులు ఉప్పొంగిపోతున్నారు.

ఆత్మకూరు రూరల్: నల్లమల అడవుల్లో 1870 కాలంలో అదృశ్యమైన అడవి దున్న నల్లమలలో తిరిగి కనిపించడం అటవీ అధికారులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. భారత అడవి దున్న (ఇండియన్ బైసన్)గా ప్రసిద్ధి చెందిన ఈ దున్నలు నల్లమల అడవుల్లో ఒకప్పుడు విస్తారంగా సంచరించేవి. అనూహ్యంగా 1870 ప్రాంతంలో అదృశ్యమైపోయిన అడవి దున్న వన్యప్రాణి ప్రేమికులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతూ నాగార్జున సాగర్–శ్రీశైలం పులుల అభయారణ్యంలోని ఆత్మకూరు డివిజన్‌లో బైర్లూటి, వెలుగోడు నార్త్ బీట్‌లలో కనిపించింది. ప్రస్తుతం నల్లమలకు తూర్పున ఉండే పాపికొండలు (పోలవరం అటవీ ప్రాంతం).. కర్ణాటకలోని పశ్చిమ కనుమలలో మాత్రమే ఉండే అడవి దున్న వందల కిలోమీటర్ల దూరాన్ని దాటుకుని నల్లమల చేరడం అద్భుతమైన విషయమే.

నెల క్రితమే కనిపించినా..

నెల రోజుల కిందట సాధారణ విధుల్లో భాగంగా ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని బైర్లూటి రేంజ్ తలమడుగు అటవీ ప్రాంతంలో ఫుట్ పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బందికి అడవి దున్న కనిపించింది. ఆ వెంటనే వీడియో, ఫొటోలు తీసిన సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. అయితే.. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు రహస్యంగా ఉంచారు. ఆ తరువాత ఇదే అటవీ డివిజన్‌లోని వెలుగోడు రేంజ్‌లో గల నార్త్ బీట్ జీరో పాయింట్ వద్ద సిబ్బందికి మరోమారు అడవి దున్న కనిపించి నల్లమలలో తన ఉనికిని చాటింది.

అప్రయత్నంగానే సాకారం

ఒకప్పుడు నల్లమలలో విస్తారంగా సంచరించి అదృశ్యమైన అడవి దున్నలను తిరిగి నల్లమలలోకి తీసుకొచ్చేందుకు అటవీ శాఖ ఇటీవల ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందుకోసం వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంస్థ సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ రెడ్డీస్ ల్యాబ్ ఈ మహత్తర కార్యక్రమం కోసం రూ.కోటి విరాళం ఇచ్చేందుకు అంగీకరించింది. అటవీ అధికారులు అడవి దున్నల తరలింపు ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే ఈ మహిషం తనంతట తానే పూర్వ ఆవాసానికి చేరుకోవడంతో వన్యప్రాణి ప్రేమికులలో పండుగ వాతావరణం కనిపిస్తోంది. నల్లమలలో అడవి దున్న ప్రత్యక్షమవడం శుభసూచకంగా భావిస్తున్నారు.

ఆశ్చర్యమే కానీ.. అసాధ్యం కాదు



ఆత్మకూరు అటవీ డివిజన్‌లో అడవి దున్నను మా సిబ్బంది రెండు ప్రాంతాల్లో గుర్తించారు. ఇది కొంత ఆశ్చర్యం కలిగించే విషయమే. కానీ.. అసాధ్యమైనదేమీ కాదు. పెద్ద పులులు, ఏనుగులు వంటి భారీ జంతువులు సుదూర ప్రాంతాలకు తరలివెళ్లడం సాధారణమే. ఈ అడవి దున్న కూడా అలా మైదాన ప్రాంతాలను దాటుకుని నల్లమల చేరి ఉంటుంది. ఇది పాపికొండలు అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నాం.

– సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు, నాగార్జునసాగర్–శ్రీశైలం పులుల అభయారణ్యం

రాష్ట్రానికి వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలి

- విభజన హామీలు అమలు చేయాలి
- హోదా ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే
- విశాఖ రైల్వే జోన్ వెంటనే ఏర్పాటు చేయాలి
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక స్వావలంబన, సమ్మిళిత అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుసార్లు ప్రధాని, కేంద్ర మంత్రుల్ని కలిసి ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరారని గుర్తుచేశారు. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం ఏపీ ప్రజల్ని మోసం చేయడం, వారికి అన్యాయం చేయడమేనని అన్నారు. టీడీపీ మద్దతుతోనే కేంద్రం ప్రభుత్వం నడుస్తున్నందున హోదా కోసం కేంద్రంపై టీడీపీ ఒత్తిడి తేవాలన్నారు. విశాఖలో రైల్వే జోన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఓడరేవుల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఏపీలో నాలుగు నూతన ఓడరేవుల నిర్మాణం ప్రారంభం కావడంతోపాటు ఆరు ఓడరేవుల నుంచి ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. నూతన ఓడరేవుల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రసారాలు నిలిపివేసిన టీవీ ఛానళ్ల ప్రసారాలు పునరుద్ధరించాలని కోరారు.

దాడుల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కూటమి పార్టీల నేతలు చేస్తున్న దాడుల్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. దాడుల్ని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనందున కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. దాడులు పునరావృతం కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర బలగాలను మోహరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అధికారపక్షం దాడులు

లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చిన ఎంపీ తనూజరాణి



సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అధికార టీడీపీ కూటమి చేస్తున్న దాడుల్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజరాణి లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులపై క్రూరమైన హింసాత్మక దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఇళ్లను అధికార కూటమి జేసీబీలతో కూల్చివేస్తోందని చెప్పారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం భవనాన్ని కూల్చివేశారని, 26 జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను కూల్చివేయడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. సోమవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ తనూజరాణి మాట్లాడారు. చిన్న వయసులో ఎంపీగా అవకాశమిచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్ముకు రాష్ట్రపతిగా ప్రధాని మోదీ అవకాశం ఇవ్వడం పట్ల అభినందనలు తెలిపారు. గిరిజనుల విద్యాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉండాలని చెప్పారు. గిరిజనుల్లో నైపుణ్యవంతుల్ని ఉపాధ్యాయులుగా నియమించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డు తెగలకు కేటాయించిన ఉపాధ్యాయ పోస్టులన్నీ గిరిజనులకే కేటాయించాలని చేబ్రోలు లీలా ప్రసాదరావు వర్సెస్ ఏపీ కేసులో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. గిరిజనేతరులు భాష నేర్చుకోకుండానే ఏళ్ల తరబడి గిరిజన ప్రాంతాల్లో ఉంటున్నారని, దీనివల్ల పిల్లల ప్రాథమిక విద్యకు ఆటంకం కలుగుతోందని వివరించారు. ప్రత్యేక హోదా కోసం పదేళ్లుగా ఏపీ ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం టీడీపీ మద్దతు కోరిన నేపథ్యంలో ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించడానికి ఇదే సరైన సమయమని అన్నారు. దేశంలో వైద్య విద్య ఖర్చు పెరిగిపోయిందని.. దీనిపై దృష్టి సారించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

పోలీసులపై మంత్రి సతీమణి దురుసు ప్రవర్తన



పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తున్న మంత్రి సతీమణి హరితారెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా చిన్నమండెం పోలీసులపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి మండిపల్లి హరితారెడ్డి దురుసుగా ప్రవర్తించారు. ఆమె సోమవారం చిన్నమండెం మండలం దేవగుడిపల్లె సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీచేశారు. హరితారెడ్డి అక్కడి నుంచి మరో సచివాలయానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఎస్‌ఐ లేకపోవడంతో ఎస్కార్ట్ కోసం కొద్దిసేపు వేచి ఉన్నారు. సుమారు 30నిమిషాల తర్వాత ఎస్‌ఐ రావడంతో 'మంత్రి భార్యకు ఎస్కార్ట్ రావాలని తెలియదా...' అంటూ పోలీసులను ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. వారు అవమానపడే విధంగా మాట్లాడారు. దీంతో పోలీసులు చేసేదేమీ లేక 'మీరు చెప్పినట్లే చేస్తాం' అనడంతో మంత్రి భార్య శాంతించి అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ విషయం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

టెట్–షెడ్యూల్

ఫీజులు చెల్లించేందుకు గడువు: 03/07/2024 నుంచి 16/07/2024
ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు గడువు: 04/07/2024 నుంచి 17/07/2024
ఆన్‌లైన్‌లో మాక్ టెస్ట్ నిర్వహణ: 16/07/2024 నుంచి..
హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్: 25/07/2024 నుంచి
పరీక్షల షెడ్యూల్: పేపర్ 1ఏ, 1బీ, 2ఏ, 2బీ: 05/08/2024 నుంచి 20/08/2024 వరకు
కీ విడుదల: 10/08/2024 నుంచి
కీపై అభ్యంతరాల స్వీకరణ: 11/08/2024 నుంచి 21/08/2024 వరకు
ఫైనల్ కీ విడుదల : 25/08/2024
తుది ఫలితాల వెల్లడి: 30/08/2024.

దుశ్శాసనపర్వంపై హోం మంత్రి చర్యలేవి?

- మహిళల దుస్తులు చించి బూతులు తిట్టిన టీడీపీ మూకలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



సాక్షి, అనకాపల్లి: హోం మంత్రి అనిత సొంత నియోజకవర్గమైన పాయకరావుపేటలోని కోటవురట్లలో చేనేత కార్మికులైన ఇద్దరు మహిళలపై టీడీపీ మూకలు దాడిచేస్తే వారిపై చర్యల్లేవని.. దీనిపై అనిత సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. ఆమె సోమవారం కోటవురట్లలో మీడియాతో మాట్లాడారు. దాడి చేసిందే కాకుండా వారిపై కేసులు కూడా నమోదు చేశారంటే ఈ టీడీపీ కూటమి ప్రభుత్వం ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. హోం మంత్రిగా అనిత బాధ్యతలు తీసుకున్న వెంటనే కోటవురట్ల మండలంలో ఇద్దరు మహిళల మీద తెలుగుదేశం కార్యకర్తలు దారుణంగా దాడిచేయడమే కాకుండా వాళ్ల బట్టలు చించి బండబూతులు తిట్టారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు ప్రశాంతంగా నిద్రపోవచ్చు.. మహిళలపై ఎవరైనా చేయివేస్తే వారి తాటతీస్తామని ప్రగల్భాలు పలికిన హోం మంత్రికి ఈ దాడి కనిపించలేదా? అని ప్రశ్నించారు. మీది మాటల ప్రభుత్వమేనా.. చేతల ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. నిజంగా ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో దళిత మహిళను వివస్త్రను చేసి దాడిచేసిన పరిస్థితులు చూశామని, మళ్లీ అదే దుశ్శాసన ప్రభుత్వం వచ్చిందని మహిళలంతా భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాలనపై, మహిళల రక్షణపై దృష్టి సారించాలని.. వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాలను ఎలా కూల్చేయాలి? వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఎలా దాడిచేయాలనే ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు.

బాలికపై లైంగిక దాడి కేసులో అలసత్వం

బీచ్‌రోడ్డు (విశాఖ): విశాఖ మధురవాడలో ఐదేళ్ల బాలికపై లైంగికదాడి జరిగితే ఆ కేసును నీరుగార్చే విధంగా విచారణ చాలా నెమ్మదిగా సాగుతోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఆమె సోమవారం విశాఖపట్నంలోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉండాలంటే చర్యలు వేగంగా తీసుకోవాలని సూచించారు. బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించాలని ఆమె డిమాండ్ చేశారు.

రెండోరోజూ పోలవరం ప్రాజెక్టు పరిశీలన

- డయాఫ్రం వాల్ ప్రాంతంలో అగాధాలపై అంతర్జాతీయ నిపుణుల ఆరా
- ఎగువ కాఫర్ డ్యాం పనులు కూడా పరిశీలన
- నేడు, రేపు కూడా ప్రాజెక్టు నిర్మాణం, పనుల పురోగతిపై సమీక్ష



డయాఫ్రం వాల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నిపుణుల బృందం సభ్యులు

పోలవరం రూరల్ : పోలవరం ప్రాజెక్టులో అంతర్జాతీయ నిపుణుల బృందం రెండోరోజైన సోమవారం కూడా పనులను క్షుణ్ణంగా పరిశీలించింది. డేవిడ్ వి.పాల్, గియాస్ ఫ్రాంకో డి.సిస్కో, రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్గర్‌లతో కూడిన బృందం సభ్యులు ఉ.10 గంటలకు రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రం వాల్ ప్రాంతాన్ని, క్షేత్రస్థాయిలో ప్రతి కట్టడం నిర్మాణాన్ని పరిశీలించారు. బృందం సభ్యులకు కేంద్ర జలసంఘం సీడబ్ల్యూసీ డైరెక్టర్ అశ్వినీకుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ పి. నారాయణరెడ్డి, సీఈ నరసింహమూర్తిలు ప్రాజెక్టు నిర్మాణ పనుల తీరును వివరించారు. డయాఫ్రం వాల్ నిర్మాణానికి ముందు చేసిన పనులు, తదుపరి చేసిన వివరాలను తెలుసుకుంటూ ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేశారు. డయాఫ్రం వాల్ ప్రాంతంలో వరద ఉధృతికి ఏర్పడ్డ అగాధాల పరిస్థితిపైనా ఆరా తీశారు. అగాధాలు పడిన ప్రాంతంలో శాండ్ ఫిల్లింగ్, జెట్ గ్రౌటింగ్ పనులను పరిశీలించి జల వనరుల శాఖాధికారుల నుంచి పనులు జరుగుతున్న తీరుతెన్నులను ప్రశ్నించారు. డయాఫ్రం వాల్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించి గతంలో పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి.. దీనిపై ఏవిధమైన నిర్ణయాలు తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. డయాఫ్రం వాల్ కట్టడం, పనితీరు తదితర అంశాలను ఇంజనీరింగ్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఎగువ కాఫర్ డ్యాం నుంచి సీపేజ్ (ఊట నీరు) వస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి, మట్టి నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. ఎగువ కాఫర్ డ్యాంపై జరుగుతున్న జియో టెక్నికల్ కోర్ ఇన్వెస్టిగేషన్ పనులు, అక్కడ సేకరించిన మట్టి నమూనాలను బృందం సభ్యులు పరిశీలించారు. అలాగే, ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతం, డయాఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి, భూ భౌతిక పరిస్థితుల మార్పునకు చేస్తున్న ప్రయత్నాలు తదితర అంశాలపై నిపుణుల బృందం ఎక్కువ దృష్టిపెట్టింది.

నేడు, రేపు కూడా సమీక్ష..

ఇలా సుమారు మూడు గంటలపాటు డయాఫ్రం వాల్ మొత్తం పరిశీలించారు. పోలవరంలో ప్రధాన సమస్యలు ఇక్కడే ఉండటంతో, ప్రధాన డ్యాం నిర్మించాల్సిన మొదటి గ్యాప్ ప్రాంతాన్ని పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించారు. ఈ పరిశీలనలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్యులు, కేంద్ర జల సంఘం నిపుణులు, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు, వాప్కోస్, బావర్, కెల్లర్, మేఘా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. అంతర్జాతీయ డిజైన్ సంస్థ ఆఫ్రి ప్రతినిధులు కూడా ఉన్నారు. ముందుగా ప్రాజెక్టు వద్ద అధికారులు, ఏజెన్సీ ప్రతినిధుల భేటీ అనంతరం ప్రాజెక్టు వివరాలు తెలుసుకున్నారు. ఇక మంగళ, బుధవారాల్లో కూడా బృందం సభ్యులు, జలవనరుల శాఖాధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, ప్రాజెక్టు నిర్మాణం, పురోగతిపై తీసుకోవాల్సిన నిర్ణయాలు, జాగ్రత్తలు, చేయాల్సిన పనులపై సమీక్షిస్తారు.

పంతానికి పోయి.. పిల్లల కడుపు మాడ్చారు

- కుకింగ్ ఏజెన్సీని తొలగించే వరకు టీడీపీ శ్రేణుల పట్టు
- అన్నం వండేవారు లేక విద్యార్థులను ఇళ్లకు పంపిన టీచర్లు

దర్శి: టీడీపీ నాయకుల పంతం విద్యార్థుల కడుపు మాడ్చింది. ప్రభుత్వ పాఠశాలలో వంటమనిషిగా పని చేస్తున్న మహిళ వైఎస్సార్‌సీపీ అభిమాని అని.. ఆమెను తొలగించాల్సిందేనంటూ ఒత్తిడి చేసి.. చివరకు ఉద్వాసన పలకడంతో విద్యార్థులకు అన్నం పెట్టకుండా ఇంటికి పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని బండి వెలిగండ్ల పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉండగా.. రోజూ 80 మంది తరగతులకు హాజరవుతుంటారు. పాఠశాలలో సుమారు 15 ఏళ్లుగా వంట వండే ఆయా కుమ్మిత అంజమ్మ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారని.. వైఎస్సార్‌సీపీ అభిమాని అని గ్రామ టీడీపీ నేతలు భావించారు. పార్టీ నియోజకవర్గ నేతలకు చెప్పి ఆమెను తొలగింపచేశారు. దీంతో శనివారం సాయంత్రం అంజమ్మను హెడ్మాస్టర్ పిలిపించి సంతకాలు పెట్టించుకుని ఇకపై వంట వండేందుకు రావాల్సిన పనిలేదని చెప్పారు. వంట మనిషిగా ఉండేందుకు ముందు పోటీపడిన తమ వర్గం వారిని పెట్టాలంటే తమవారిని పెట్టాలని ఒకరికొకరు నాయకులు పోటీ పడ్డారు. అయితే ఆ చాకిరీ చేయాలంటే మనం చేయలేమని ఇంట్లో వారు చెప్పారో ఏమో తెలియదు కానీ మీరు వెళ్లండంటే మీరు వెళ్లండని ఎవరూ వెళ్లకుండా మానుకున్నారు. సోమవారం ఎవరూ వంట వండేందుకు రాకపోవడంతో స్కూల్ పిల్లలకు అన్నం లేకుండా పోయింది. దీంతో పిల్లలను అన్నం కోసం ఇంటికి పంపించారు. 12 గంటలకు ఎవరూ రాకపోవడంతో స్కూల్‌లో ఉపాధ్యాయులు అంజమ్మను పిలిపించి వంట వండమని చెప్పారు. ఇప్పుడు చెప్తే ఎలా వండాలి అని ఆమె వెళ్లిపోయింది. దీంతో అక్కడ వంట వండేవారు లేక మళ్లీ ఉపాధ్యాయులు సాయంత్రం పిలిపించి ఒక నెల వంట వండమని తరువాత ఎవరినైనా పెట్టుకుంటారని అడిగించారు. అయితే తాను రానని ఎవరినైనా వంటకు మనిషిని చూసుకోవాలని చెప్పింది. ఈ విషయంపై ఎంఈఓ కాకర్ల రఘురామయ్యను వివరణ కోరగా.. వంట మనిషి మార్పు నిజమేనని, ప్రస్తుతానికి వేరే వారిని నియమించి వంట చేయిస్తామని చెప్పారు.

రాంప్రసాద్‌ను హత్య చేసింది టీడీపీ కార్యకర్తే

- దీనిపై టీడీపీ ఎందుకు స్పందించటం లేదు?
- మదర్సాలో కరిష్మా మరణంపై లోతైన విచారణ జరగాలి
- ఒక్క రోజులో పెన్షన్ల పంపిణీ ఘనత మాజీ సీఎం జగన్‌దే
- వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్



వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): ఇటీవల విజయవాడ నగరంలో హత్యకు గురైన రాంప్రసాద్‌ను చంపిన గడ్డం మణికంఠ తెలుగుదేశం పార్టీ కార్యకర్తేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ వెల్లడించారు. సోమవారం ఆయన మీడియాకు విడుదల చేసిన వీడియోలో మాట్లాడారు. నిందితుడు టీడీపీకి చెందిన కార్యకర్త అని సోషల్ మీడియాలో చాలా స్పష్టంగా తెలుస్తుందన్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోం మంత్రి అనిత స్పందించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ క్యాంప్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఈ ఘటన జరిగితే ఆయన స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా మదరాసాలో చనిపోయిన కరిష్మా మృతిపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఆమె ఫుడ్ పాయిజన్ వలన చనిపోలేదని, ఆమె శరీరంపై గాయాలున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని ఆయన చెప్పారు. దీనిపై లోతైన విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ రెండు ఘటనలపై ఎంపీగానీ, ముగ్గురు ఎమ్మెల్యేలు గానీ స్పందించలేదన్నారు. దర్శిని కుటుంబానికి రక్షణ కల్పించాలని, ఆమెకు ఇల్లు, ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

ఒక్క రోజులో పెన్షన్ల పంపిణీ జగన్ ఘనతే..

పెన్షన్ల పంపిణీని కేవలం ఒక రోజులో పూర్తి చేయడం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఘనతేనని మహేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన 15 వేల సచివాలయాలు, లక్షా 30 వేల మంది సచివాలయ సిబ్బందిని నియమించడం వలన పంపిణీ సాధ్యమైందన్నారు.

ప్రతికూల వ్యాఖ్యలెందుకు?

టీడీపీ ఎంపీ కృష్ణదేవరాయలకు కాంగ్రెస్ సభ్యుల ప్రశ్న

సాక్షి, న్యూఢిల్లీ : టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం లోక్‌సభలో రాష్ట్ర అప్పులపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సభ్యులు తప్పుబట్టారు. గడిచిన ఐదేళ్లుగా ఎలాంటి నూతన మౌలిక సదుపాయల కోసం అప్పులు చేయలేదని అనడంతో 'ప్రతికూల వ్యాఖ్యలెందుకు' అని వారు ప్రశ్నించారు. అదే సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటు షేరు గురించి కూడా టీడీపీ ఎంపీ ప్రస్తావించడంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా నిరసించారు. దీంతో చైర్‌ను ఉద్దేశించి మాట్లాడాలని సభాపతి స్థానంలోని రాజా (డీఎంకే) సూచించడంతో శ్రీకృష్ణదేవరాయలు తన ప్రసంగాన్ని కొనసాగించారు. రెవెన్యూ లోటు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి, పారిశ్రామిక కారిడార్లకు సహకరించాలని ఆయన కోరారు. ఇలా కేంద్రం సహకరించాలని ఆయన పదేపదే విజ్ఞప్తి చేయడంతో.. 'మీరిప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్నారు కదా.. మంత్రుల్ని కలిసి అడగొచ్చుగా..' అని సభాపతి స్థానంలోని రాజా వ్యాఖ్యానించారు.


● బ్రీన్ కాంధరి

పర్యావరణ గీతం
– అడ్వకసి టు యాక్షన్

‘ఏమీ చేయలేమా?’
అనే ప్రశ్న ముందుకు వచ్చినప్పుడు
వినిపించే జవాబులు రెండు...
‘మనం మాత్రం ఏం చేయగలం!’
‘కచ్చితంగా మనమే చేయగలం’
‘మనం మాత్రమే చేయగలం’ అని దిల్లీకి చెందిన బ్రీన్ కాంధరీ అనుకోవడం వల్లే‘వారియర్ మామ్స్’ పుట్టుక సాధ్యం అయింది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా పదమూడు రాష్ట్రాలలో క్షేత్రస్థాయిలో పర్యావరణ హిత ప్రచారాన్ని నిర్వహిస్తోంది బ్రీన్.
కాపీరైటర్ నుంచి
ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా
ఆమె ప్రయాణం స్ఫూర్తిదాయకం...

ఏయిర్ ఫోర్స్ అధికారి కూతురు అయిన బ్రీన్ దేశంలోని వివిధ ప్రాంతాలలో చదువుకుంది. అలా ఎన్నో సంస్కృతులు, కళలు, ప్రకృతి అందాలతో పరిచయం అయింది.

లండన్‌లోని వాయు కాలుష్యం గురించి వ్యాసం ఒకటి చదివింది బ్రీన్. ‘దిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితే కదా’ అని నిట్టూర్చింది. ‘ఇది లోకల్ ప్రాబ్లం కాదు. గ్లోబల్ ప్రాబ్లమ్’ అనుకుంది.

వర్తమానం సంగతి ఎలా ఉన్నా పొగచూరిన భవిష్యత్ మసక మసకగా కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాపీరైటర్ ఉద్యోగాన్ని వదులుకొని ‘వారియర్ మామ్స్’కు శ్రీకారం చుట్టింది బ్రీన్. ‘ వాయుకాలుష్యం అనేది చర్మం, జుట్టు, ఊపిరితిత్తులు, గుండెపై ప్రభావం చూపుతుంది. ఆహార ఉత్పత్తులలోని పోషక విలువలను నాశనం చేస్తుంది. అన్నిరకాలుగా హాని కలిగిస్తుంది’ అంటున్న బ్రీన్ ‘వారియర్ మామ్స్’ ద్వారా పల్లె నుంచి పట్టణం వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగింది. క్షేత్రస్థాయిలో వాయుకాలుష్యం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

తనలాగే ఆలోచించే మహిళలు తోడు కావడంతో ‘వారియర్ మామ్స్’కు బలం పెరిగింది.

మొదట్లో వాయుకాలుష్యం ప్రమాదాల గురించి ప్రచారం మొదలుపెట్టినప్పుడు ‘ఈ విషయాలు మాకు ఎందుకు’ అన్నట్లుగా ముఖం పెట్టేవారు. ప్రమాద తీవ్రత గురించి తెలుసుకున్న తరువాత మాత్రం వారిలో మార్పు రావడం మొదలైంది.

‘మీ పిల్లల భవిష్యత్ గురించి కూడా ఆలోచించండి’ అనే మాట వారిని కదిలించి కార్యక్షేత్రంలోకి తీసుకువచ్చింది. ప్రపంచం ఎలా మారాల్సి వచ్చిందో చెప్పడానికి కోవిడ్ మహమ్మారి పెద్ద ఉదాహరణ. ఈ నేపథ్యంలోనే... ‘మరొక మహమ్మారిని నివారించడానికి మనం ఎందుకు మారకూడదు?’ అని ప్రశ్నిస్తోంది.

‘అభివృద్ధి’ గురించి మాట్లాడినప్పుడు ‘పర్యావరణ హితం’ గురించి కూడా మాట్లాడాలి అంటుంది బ్రీన్.

‘కొన్నిసార్లు దూకుడుగా ముందుకు వెళ్లాలి’ అనేది కొన్ని సందర్భాలలో బ్రీన్ నోటి నుంచే వినిపించే మాట.

సమస్య గురించి అధికారుల దృష్టికి తెచ్చినప్పుడు, వారి స్పందనలో అలసత్వం కనిపించినప్పుడు, ‘నా కంపెనీకి మేలు జరిగితే చాలు పర్యావరణం ఏమైపోతే నాకెందుకు!’ అనుకునేవాళ్లను చూసినప్పుడు బ్రీన్ దూకుడుగా ముందుకు వెళుతుంది.

తాను ఆశించిన ఫలితం వచ్చే వరకు మడమ తిప్పకుండా పోరాడుతుంది. ‘మార్పు మన ఇంటి నుంచే మొదలు కావాలి’ అంటున్న బ్రీన్ మాటలు ఎంతోమందిలో మార్పు తీసుకువచ్చాయి.

‘పదిమందిలో ఏడుగురు వాతావరణ మార్పుల గురించి ఆందోళన చెందుతున్నారు. పదిమందిలో తొమ్మిదిమంది వాతావరణ మార్పులపై తగిన కార్యాచరణ అవసరం అంటున్నారు. కానీ పదిమందిలో నలుగురు మాత్రమే కార్యాచరణలో భాగం అవుతున్నారు’ అంటున్న బ్రీన్ ఆశ మాత్రం కోల్పోలేదు. ‘వారియర్ మామ్స్’ ద్వారా అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉంది.

ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కాదు



పర్యావరణవాదం అనేది ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కాదు. మన భవిష్యత్ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలి. దీనికోసం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగం కావాలి. మొక్కలు నాటండి. పర్యావరణ హిత ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వండి. వాట్సాప్ గ్రూప్‌లలోనో, ఫేస్‌బుక్ పేజీలలోనో పర్యావరణ సంక్షోభం గురించి ఆందోళన చెందితే ప్రయోజనం లేదు. కార్యాచరణ అనేది చాలా ముఖ్యం. నేటి కార్యరణే రేపటి భవిష్యత్.

– బ్రీన్ కంధారి, ఫౌండర్, వారియర్ మామ్స్

ముంబైలో 46 లక్షల వాహనాలున్నాయి. వాటిలో 70 శాతం రోజుకు కనీసం ఏడుసార్లు హారన్ మోగిస్తే ఎంత శబ్దకాలుష్యమో ఆలోచించారా అని ప్రశ్నిస్తుంది సవితారావు. ముంబైకి చెందిన ఈ సామాజిక కార్యకర్త ‘నిశ్శబ్దం తరఫున పోట్లాడేవాళ్లు కావాలి’ అని ప్రచారం చేస్తోంది. అంతేకాదు ‘నాయిస్ ఇన్ అవర్ నేషన్’ అనే పుస్తకం రాసి శ్రుతి మించిన ధ్వని వల్ల వచ్చే శారీరక, మానసిక అనారోగ్యాలను తెలియచేసింది. ‘చప్పళ్ల చెత్తను పారపోద్దాం రండి’ అంటున్న ఆమె పరిచయం.




నిశ్శబ్దానికి రక్షకులు కావాలి

మన హైదరాబాద్‌లో ట్రాఫిక్ పోలీసు వారు స్పీడ్ గన్స్ ఏర్పాటు చేశారు. మితి మీరిన వేగంతో ప్రయాణిస్తే అవి గుర్తించి చలాన్లు పంపుతాయి. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం రాష్ట్రమంతటా 255 ‘నాయిస్ డిటెక్టర్లు’ బిగించారు. ఒక వాహనం అవసరానికి మించి హారన్ మోగించినా, నియమిత డెసిబెల్స్ మించి చప్పుడు చేసినా వెంటే ఈ నాయిస్ డిటెక్టర్ గుర్తించి వారికి జరిమానా విధిస్తుంది. ఇది 1000 రూపాయల వరకూ ఉంటుంది. ‘మెట్రో నగరాల్లో అర్థం పర్థం లేని హారన్ మోతలను నివారించాలంటే ఇలాంటి చర్యలు అవసరం. ముంబైలో ముఖ్యంగా అవసరం’ అంటోంది సవితా రావు.

నో హారన్ ప్లేజ్

రోడ్డు మీద వెళుతుంటే గతంలో చాలా వాహనాల వెనుక ‘ప్లీజ్ సౌండ్ హారన్’ అని ఉండేది. ఇప్పుడు సామాజిక కార్యకర్తలు, పర్యావరణ ప్రేమికులు ‘నో హారన్ ప్లీజ్’ అంటున్నారు. ముంబైకి చెందిన సవితా రావు ‘నాయిస్ ఇన్ అవర్ నేషన్’ పేరుతో ఈ అంశంపై చైతన్యం కోసం పుస్తకమే రాశారు. ‘ఇండియా పాజిటివ్ సిటిజెన్ ఇనిషియేటివ్’ పేరుతో సంస్థ ప్రారంభించిన సవితా రావు పౌరులుగా ఈ దేశం కోసం ప్రతి ఒక్కరూ ఏదో ఒక మంచి పని చేయవలసిన బాధ్యత ఉందని, అందుకే ‘వన్ యాక్షన్, వన్స్ ఏ వీక్, ఎవ్రీ వీక్’ అనే భావన వారిలో కలిగించాలని పని చేస్తోంది. అంటే రోజూ దేశం, సమాజం కోసం ఏదో ఒక మంచి పని చేయకపోయినా కనీసం వారంలో ఒకసారి చేస్తూ, ప్రతి వారం చేయగలిగితే చాలా మార్పు సాధించవచ్చని ఆమె అంటారు. ఉదాహరణకు రాంగ్ సైడ్ వాహనం నడపకపోవడం, ట్రాఫిక్ నియమాలను పూర్తిగా పాటించడం కూడా సమాజానికి పెద్ద మేలు అంటారామె. అయితే ఆ చిన్నపాటి దుర్గుణాన్ని కూడా సరి చేసుకోరు చాలామంది అని వాపోతారు.



నిశ్శబ్దం మన హక్కు

‘ఇవాళ నిశ్శబ్దం కలిగిన వాతావరణం అరుదైపోయింది. పెళ్లిళ్లకు వెళ్లినా, పార్కుకు వెళ్లినా, రెస్టరెంట్‌కు వెళ్లినా, జిమ్‌కు వెళ్లినా పెద్ద శబ్దంతో ఏవో ఒక పాటలు, సంగీతం చెవిన పడుతుంటాయి. ఆఖరుకు ఆస్పత్రులకు వెళ్లినా ఔట్ పేషంట్ల విభాగం దగ్గర అందరూ మాట్లాడుకుంటూ అరుచుకుంటూ చాలా చప్పుడు చేస్తుంటారు. నిశ్శబ్దం పాటించడం ఒక సంస్కారం అని మరిచిపోయాం. ఇక పండగలు వస్తే మైకుల ద్వారా జరుగుతున్న గోల చాలా తీవ్రమైనది. వీధి చివర కనపడే చెత్త మాత్రమే కొందరికి కనిపిస్తుంది. కాని ఇది కనపడని చెత్త. కనపడని కాలుష్యం. ఇది ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది’ అంటారు సవితా రావు.

అనారోగ్య మెట్రోలు

‘దేశ ఆర్థిక పురోగతికి 2030 నాటికి పట్టణ, నగరాలే ఆయువుపట్టు అవుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కాని ఈ మెట్రో నగరాల్లో ఉన్న పౌరుల ఆరోగ్యం సరిగ్గా లేకపోతే అవి ఎలా పురోగమిస్తాయి. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, ఆహార కాలుష్యంతో పాటు శబ్ద కాలుష్యం కూడా వారిని కాటేస్తోంది. హారన్ వాడకం చాలా తీవ్రంగా ఉంటోంది. ఇప్పటికే మన దేశ పట్టణాల్లో, నగరాల్లో డయాబెటిస్, బి.పి.లతో అత్యధిక జనం బాధపడుతున్నారు. శబ్ద కాలుష్యం వల్ల గుండె, చెవి, మెదడు ఆరోగ్యం దెబ్బ తింటుంది. అనవసర ఆందోళన మొదలవుతుంది’ అంటారు సవితా రావు.

చప్పుళ్లు సృష్టించే అభివృద్ధి

‘ప్రభుత్వాలు విమానాశ్రయాలను వృద్ధి చేస్తున్నాయి. విమానయాన సంస్థలు వందల కొత్త విమానాలకు ఆర్డర్లు ఇస్తున్నాయి. రైలు మార్గాల విస్తరణ, ఇక లక్షలాది టూ వీలర్లు ఇవన్నీ ఏ స్థాయిలో శబ్ద కాలుష్యం సృష్టిస్తాయో ఆలోచిస్తున్నామా? శబ్ద కాలుష్యం వల్ల మరణాలు సంభవించకపోయినా ఆయుష్షు క్షీణిస్తోందని డబ్ల్యు.హెచ్.ఓ చెబుతోంది. ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ముందు బండిని దాటేయాలన్న దుశ్చర్యతో అదేపనిగా హారన్ కొట్టి శబ్ద కాలుష్యం సృష్టించేవారిపై జరిమానా విధించాలా వద్దా?’ అని ప్రశ్నిస్తారు సవితా రావు.

ఆమె రాసిన పుస్తకం ‘నాయిస్ ఇన్ అవర్ నేషన్’ శబ్ద కాలుష్య దుష్ప్రభావాలు తెలపడమే కాదు ప్రభుత్వం, స్థానిక సంస్థలు, పోలీసు వ్యవస్థ, ట్రాఫిక్ వ్యవస్థ, పౌరులు కలిసి దీని నుంచి సమష్టి ప్రయత్నంతో ఎలా బయటపడాలో కూడా తెలియచేస్తోంది.

● చిరుధాన్యాల సాగుపై 34 గ్రామాల్లో 1,100 మంది రైతుల వర్షాధార సేద్య అనుభవాలపై ‘సెస్’ ఇంటింటి సర్వే
● డీడీఎస్ సంఘాల సంస్థాగత.. మార్కెటింగ్ మద్దతు వల్లే రైతులకు అధికాదాయం వస్తోందని వెల్లడి
● చిరుధాన్యాల సేంద్రియ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక మద్దతు అవశ్యమని సిఫారసు

సాగుబడి
ఆర్ద్ర కార్తె : జూలై 5 వరకు
పునర్వసు : జూలై 6 నుంచి

మిల్లెట్స్‌ను ప్రోత్సహిస్తే లాభాలు మెండు!

తెలంగాణ దక్కను పీఠభూమి ప్రాంతంలో వర్షాధారంగా వ్యవసాయం చేసే సన్న, చిన్నకారు రైతులు సంఘంగా ఏర్పడటం.. సేంద్రియ సేద్య పద్ధతిని అనుసరించటం.. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు తదితర పంటలను కలిపి సాగు చేయటం.. సంఘటితంగా మార్కెటింగ్ చేసుకోవటం నిస్సందేహంగా బహువిధాలా లాభదాయకమే! సంఘటితమైన చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు తాము పండిస్తున్న పౌష్టికాహారాన్ని తింటూ.. మిగతా దిగుబడులు విక్రయిస్తూ మంచి నికరాదాయం కూడా పొందగలుగుతున్నారని, పనిలో పనిగా భూసారాన్ని కూడా పెంపొందించుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వ సంస్థ ‘సెస్’ జరిపిన తాజా అధ్యయనం చెబుతోంది. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ప్రోత్సాహంతో మహిళా రైతుల స్వయం సహాయక సంఘాలు అనుసరిస్తున్న సేంద్రియ సేద్య నమూనా సాధిస్తున్న విజయాలపై ‘సెస్’ ఇటీవలే అధ్యయనం చేసింది. సహకార స్ఫూర్తిని చాటిచెబుతున్న ఈ అధ్యయన వివరాలు..

(జూలై 6న అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా...)



ఏయే రైతుల వ్యవసాయ ఖర్చులు ఎంతెంత? (ఎకరానికి/రూపాయల్లో)

వివరం	చిరుధాన్యేతర రైతులు	చిరుధాన్య రైతులు	డీడీఎస్ చిరుధాన్య రైతులు
విత్తనాలు	5,571 (43.38%)	1,433 (12.05)	1,012 (9.90%)
సేంద్రియ ఎరువులు	437 (3.79%)	534 (4.49%)	1,544 (15.11%)
రసాయనిక ఎరువులు/సూక్ష్మపోషకాలు	1,285 (10.01%)	843 (7.09%)	183 (1.79%)
పురుగుమందులు/కషాయాలు	471 (3.67%)	43 (0.36%)	18 (0.18%)
కూలీల ఖర్చు	5,028 (39.15%)	9,040 (75.99)	7,461 (73.00%)
మొత్తం ఖర్చు :	12,792	11,893	10,218

ఏయే రైతులకు ఆదాయం ఎంతెంత? (ఎకరానికి/రూపాయల్లో)

వివరం	చిరుధాన్యేతర రైతులు	చిరుధాన్య రైతులు	డీడీఎస్ చిరుధాన్య రైతులు
గడ్డి	198 (0.78)	623 (5.54%)	750 (4.57)
ఉప ఉత్పత్తి	92 (0.36%)	90 (0.80%)	218 (1.33%)
సాగు చేయని పంటలు	154 (0.60%)	181 (1.61%)	813 (4.95%)
ధాన్యం దిగుబడి	25,073 (98.26%)	10,354 (92.03)	14,627 (89.14%)
మొత్తం ఆదాయం	25,517	11,248	16,408
నికర లాభం	12,725	– 645	6,190

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంత గ్రామాల్లో డీడీఎస్ చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల మిశ్రమ సాగును చాలాకాలంగా ప్రోత్సహిస్తోంది. సాగులో అడుగడుగునా ఈ మహిళా రైతులకు తోడుగా ఉండటంతో పాటు మార్కెట్‌లో మద్దతు ధరకు తానే సేకరించి, ప్రాసెస్ చేసి ఏడాది పొడవునా హైదరాబాద్, జహీరాబాద్ ప్రాంతాల్లో ప్రజలకు విక్రయిస్తోంది డీడీఎస్. సంఘటిత శక్తి వల్ల ఈ రైతులు ఎకరానికి రూ. 6 వేలకుపైగా నికరాదాయం పొందుతున్నారు.

అయితే, కొందరు రైతులు డీడీఎస్‌తో సంబంధం లేకుండా చిరుధాన్యాలను పండించి వ్యక్తిగతంగా మార్కెట్‌లో అమ్ముకుంటూ నష్టాల పాలవుతున్నారని హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ (సెస్) ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది.

సెస్ సంచాలకురాలు ఇ. రేవతి, అసోసియేట్ ప్రొఫెసర్ బి.సురేశ్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్ది దయాకర్‌ల బృందం 2024 జనవరిలో జహీరాబాద్, ఝరాసంగం, కోహిర్, న్యాల్కల్, మొగడంపల్లె మండలాల్లోని 34 గ్రామాల్లో 1,100 మంది రైతుల వ్యవసాయ అనుభవాలపై ఇంటింటి సర్వే చేసింది. ఈ అధ్యయనంలో గుర్తించిన అంశాలతో ‘సెస్’ పరిశోధనా నివేదికను వెలువరించింది.

సర్వే జరిగిన గ్రామాల్లో ప్రధానంగా వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు చిరుధాన్యాలు తదితర పంటలను రసాయనిక పద్ధతిలో కాకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, ఊదలు వంటి చిరుధాన్యాలతో పాటు కందులు, పెసలు, మినుములు, ఉలవలు, సోయా, మిరప, మొక్కజొన్న, అల్లం, పత్తి, పసుపు వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో 80% మంది రైతులు తమ చిన్న చిన్న కమతాల్లో ఏదో ఒక పంటను కాకుండా కనీసం 8 రకాల పంటలు కలిపి పండిస్తున్నారు.

డీడీఎస్‌తో సంబంధం లేకుండా చిరుధాన్యాలను సాగు చేసే రైతులకు ఎకరానికి అయిన ఖర్చు రూ. 11,893. అయితే, డీడీఎస్ సహకార సంఘాల సభ్యులైన మహిళా రైతులకు చిరుధాన్యాలు తదితర కలిపి పంటల సాగుకు ఎకరానికి అయిన ఖర్చు రూ. 10,218 మాత్రమే. చిరుధాన్యాలు తదితర పంటలు కలిపి పండించిన రైతులకు మొత్తం ఖర్చులో 70% కూలీల ఖర్చే. చిరుధాన్యేతర పంటల రైతులకు అయిన కూలీల ఖర్చు 39% మాత్రమే.

చిరుధాన్యేతర పంటల సాగు ఖర్చులో 43% విత్తనానికి అవుతుంది. రసాయనిక ఎరువులు, పురుగుమందుల ఖర్చు అదనం. డీడీఎస్‌తో సంబంధం లేకుండా చిరుధాన్య పంటలు సాగు చేసే రైతులు విత్తనాలకు 12% ఖర్చు పెడుతున్నారు.

డీడీఎస్ సంఘాల్లో రైతులు విత్తనాలకు 10% ఖర్చు చేస్తున్నారు. వీరు సేంద్రియ ఎరువుల కోసం మొత్తం ఖర్చులో 15% వెచ్చిస్తున్నారు. బోరాన్, జింక్ వంటి సూక్ష్మ పోషకాలను భూమికి అందిస్తున్నారు. రసాయనిక వ్యవసాయంలో చిరుధాన్యాలు సాగు చేస్తున్న సంఘటితం కాని రైతులకు మార్కెట్‌లో సరైన ధర రాక ఆదాయం కన్నా ఖర్చే ఎక్కువ అవుతుండటం గమనార్హం.

అయితే, డీడీఎస్ సహకార సంఘాల్లో ఉన్న సేంద్రియ రైతులకు మాత్రం డీడీఎస్ సంస్థాగత తోడ్పాటు.. మార్కెటింగ్ మద్దతు, వాతావరణ మార్పులను తట్టుకునే శక్తి వల్లే రైతులకు అధికాదాయం వస్తోందని సెస్ నివేదిక తెలిపింది. ఇదిలా ఉండగా, ‘చిరుధాన్యేతర’ (పత్తి తదితర) పంటలను సాగు చేసే రైతులకు అన్నీ అనుకూలిస్తే రూ. 12 వేలకు పైగా నికారదాయం వస్తోంది. అనుకూలించకపోతే ఏకపంటలు సాగు చేసే ఈ రైతులకు పెట్టుబడి నష్టం ఎక్కువగా ఉంటుంది.

చిరుధాన్యాల రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి

వర్షాధారంగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలను పండించే చిన్న, పెద్ద రైతులు సమాజానికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. వాతావరణ మార్పుల్ని తట్టుకుంటూ భూసారాన్ని పెంపొందిస్తున్నారు. పర్యావరణానికీ మేలు చేస్తున్నారు. ఈ మెట్ట రైతుల విశేష కృషికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇచ్చే విధంగా బలమైన విధాన నిర్ణయాలు తీసుకోవాలి. ఈ రైతులకు ఎకరానికి కనీసం రూ. 2–3 వేలు ప్రత్యేక ప్రోత్సాహకంగా ఇవ్వాలి. అన్ని రకాల చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలకు కనీస మద్దతు ధరలు ప్రకటించాలి. మిల్లెట్ రైతుల ఎఫ్‌పిఓలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలకు ప్రత్యేక సదుపాయాలు ఇవ్వటం ద్వారా ప్రత్యేక మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి. నీటిపారుదల రైతులతో పోల్చితే వీరికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా గట్టి చట్టాలు తేవాలి. ఈ చర్యలతో చిరుధాన్యాల, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగి, ప్రజలకు మరింత సరసమైన ధరలకు లభిస్తాయి.



– డా. బి.సురేశ్ రెడ్డి (95505 58158)
అసోసియేట్ ప్రొఫెసర్, సెస్, హైదరాబాద్

6,7 తేదీల్లో హుబ్లీలో పనస మేళా


● కెంపరాజు





కరువును తట్టుకొని చక్కని ఫలసాయాన్నిచ్చే పండ్ల చెట్టు పనస. ఈ నెల 6,7 తేదీల్లో కర్ణాటకలోని హుబ్లీ నగరంలో మూడు వేల మఠాల ఆవరణలో పనస మేళా జరగనుంది. సరికొత్త ‘శంకర ఎర్ర పనస’ రకం ఈ మేళాలో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అత్యంత రుచికరంగా ఉండటం, ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పాటు జిగట తక్కువగా ఉండటం దీని ప్రత్యేకతలు. హుబ్లీ మేళాలో ‘శంకర ఎర్ర పనస’తో పాటు సిద్ధు, వియత్నాం ఎర్లీ, లాల్‌బాగ్ మధుర, భైరచంద్ర, రుద్రాక్షి వంటి అనేక పనస రకాల పండ్లను ప్రదర్శించటంతో పాటు మొక్కలను కూడా మేళాలో విక్రయిస్తారు. ‘శంకర ఎర్ర పనస’ రకం ప్లాంట్ బ్రీడ్ కన్సర్వేషన్ అథారిటీలో కూడా రిజిస్టర్ అయ్యింది. దీన్ని అభివృద్ధి చేసి, మొక్కల్ని విక్రయిస్తున్న రైతు శాస్త్రవేత్త పేరు కెంపరాజు (76767 80559).

7,8 తేదీల్లో అనంతపురం జిల్లాలో డా. ఖాదర్ సభలు



స్వతంత్ర శాస్త్రవేత్త, ఆహార – ఆరోగ్య నిపుణులు డా. ఖాదర్ వలి ఈ నెల 7,8 తేదీల్లో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రాంతంలో జరిగే వివిధ సభల్లో ప్రసంగిస్తారు. సిరిధాన్యాల ఆహారం ద్వారా ఆరోగ్యం, సిరిధాన్యాల సాగు, గ్రామాల్లోనే ప్రాసెసింగ్ పద్ధతులు, తద్వారా మహిళల ఆదాయం పెంచుకోవటం.. వంటి అనేక అంశాలపై అవగాహన కల్పిస్తారు. 7 (ఆదివారం)న కళ్యాణదుర్గం సమీపంలోని గుడ్డిళ్లలోని రాధా సామి సత్సంగంలో ప్రసంగిస్తారు.

8 (సోమవారం)న ఉ. 9 గంటలకు కోట గుడ్డెమ్ గ్రామంలో, 10.30 గంటలకు చెన్నంపల్లిలో, మధ్యాహ్నం 12 గంటలకు పేరూరులో జరిగే సమావేశాల్లో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కుళ్లాయిస్వామి (92464 77103), రామప్ప (94411 65281) రైతులకు చిరుధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తారు. 8న మధ్యాహ్నం 3 గంటలకు కురుగుంటలోని పుడమిసిరి మిల్లెట్స్ హోటల్ ప్రాంగణంలో మా భూమి మహిళా రైతు సమాఖ్య చిరుధాన్య ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభోత్సవంలో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. నిర్వాహకులు భానూజ (94400 17188) ఆధ్వర్యంలో విత్తన వితరణ జరుగుతుంది. అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అతిథిగా పాల్గొంటారు.

‘సిరిధాన్యాలతో జీవన సిరి’పై 3 రోజుల శిబిరం

గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ రైతు శిక్షణా కేంద్రంలో ఈ నెల 12,13,14 తేదీల్లో చిరు (సిరి)ధాన్యాలతో జీవన సిరి అనే అంశంపై డా. ఖాదర్ వలి, డా. సరళా ఖాదర్ ద్వారా ప్రత్యేక ఆరోగ్య అవగాహన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆధునిక రోగాల నుంచి విముక్తి పొందే మార్గాల గురించి, రోగరహితంగా జీవనాన్ని కొనసాగించే సిరి జీవన శైలిపై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 97053 83666, 95538 25532.



ఆర్‌సీబీ బ్యాటింగ్ కోచ్‌గా దినేశ్ కార్తీక్

ఇటీవల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. ఈ ఏడాది చివరిసారిగా ప్లేయర్ హోదాలో ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఆడిన కార్తీక్ ఇప్పుడదే జట్టుతో మరో పాత్రలో కొనసాగనున్నాడు. కార్తీక్‌ను ఆర్‌సీబీ బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా ఫ్రాంచైజీ నియమించింది. 'మా కీపర్‌కు పునర్‌స్వాగతం. ఆర్‌సీబీ జట్టులో కొత్త పాత్ర పోషిస్తాడు. బెంగళూరు పురుషుల జట్టు బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా అతన్ని నియమించాం' అని ఫ్రాంచైజీ తెలిపింది.

విశ్వనాథన్ ఆనంద్ పదోసారి...

భారత చెస్ దిగ్గజం, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ తనకెంతో కలిసొచ్చిన టోర్నీలో మెరిపించాడు. స్పెయిన్‌లో జరిగిన లియోన్ మాస్టర్స్ టోర్నీలో 54 ఏళ్ల ఆనంద్ పదోసారి చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో ఆనంద్ 3-1తో జైమి సాంటోస్ లటాసా (స్పెయిన్)పై గెలిచాడు. సెమీఫైనల్స్‌లో ఆనంద్ 2.5-1.5తో తొపలోవ్ (బల్గేరియా)పై, లటాసా 2.5-1.5తో అర్జున్ (భారత్)పై నెగ్గారు. గతంలో ఆనంద్ 1996, 1999, 2000, 2001, 2005, 2006, 2007, 2011, 2016లలో ఈ టోర్నీలో విజేతగా నిలిచాడు.



భారత నంబర్‌వన్‌గా... ప్రపంచ నాలుగో ర్యాంకర్‌గా...

తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఘనత



సాక్షి, హైదరాబాద్: కొన్నేళ్లుగా అంతర్జాతీయ టోర్నీలలో నిలకడగా రాణిస్తున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో అధికారికంగా భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా అవతరించాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) సోమవారం విడుదల చేసిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20 ఏళ్ల అర్జున్ నాలుగు స్థానాలు ఎగబాకాడు. గత నెలలో ఎనిమిదో స్థానంలో ఉన్న అర్జున్ ప్రస్తుతం 2778 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకున్నాడు. గత నెలలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంతో భారత నంబర్‌వన్‌గా ఉన్న దొమ్మరాజు గుకేశ్ ఒక స్థానం పడిపోయి 2763 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో నిలిచాడు. 2757 పాయింట్లతో ప్రజ్ఞానంద ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నాడు. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 2751 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచాడు. 2832 రేటింగ్‌తో మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి 7వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక 11వ ర్యాంక్‌లో, వైశాలి 14వ ర్యాంక్‌లో ఉన్నారు.

చాంపియన్ సహజ



లాస్ ఏంజెలిస్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి విజేతగా అవతరించింది. సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సహజ 6-4, 7-6 (7/4)తో జు అమీ (అమెరికా)పై విజయం సాధించింది. విజేతగా నిలిచిన క్రమంలో సహజ టోర్నీ మొత్తంలో ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ గెలుపుతో అమెరికాలో ప్రొ టైటిల్ నెగ్గిన మూడో భారతీయ క్రీడాకారిణిగా సహజ గుర్తింపు పొందింది. గతంలో సానియా మీర్జా (2004లో డబ్ల్యూ15 –బోకా రాటన్), కర్మన్‌కౌర్ (2023లో డబ్ల్యూ60–ఈవాన్స్‌విల్లె) ఈ ఘనత సాధించారు. తాజా విజయంతో సహజ మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ర్యాంకింగ్స్‌లో 15 స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ 305వ ర్యాంక్‌కు చేరుకుంది.



భారత మహిళల భారీ విజయం

ఏకైక టెస్టులో దక్షిణాఫ్రికాపై 10 వికెట్లతో గెలుపు

చెన్నై: ఇన్నింగ్స్ ఓటమి నుంచి గట్టెక్కినా దక్షిణాఫ్రికా మహిళల జట్టు పరాజయాన్ని మాత్రం తప్పించుకోలేకపోయింది. భారత బౌలర్లు మరోసారి సమయోచితంగా రాణించడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వొల్వార్ట్ (314 బంతుల్లో 122; 16 ఫోర్లు) పట్టుదలతో పోరాడి తమ జట్టును ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించింది. మ్యాచ్ చివరిరోజు సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 232/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 154.4 ఓవర్లలో 373 పరుగులకు ఆలౌటై భారత్‌కు 37 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్లు శుభ సతీశ్ (13 నాటౌట్; 1 ఫోర్), షఫాలీ వర్మ (24 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) ఇబ్బంది పడకుండా 9.2 ఓవర్లలో 37 పరుగులు సాధించి భారత్‌కు 10 వికెట్లతో విజయాన్ని అందించారు. అంతకుముందు ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 93తో ఆట కొనసాగించిన లౌరా సెంచరీని పూర్తి చేసుకుంది. అనంతరం లౌరాను రాజేశ్వరి గైక్వాడ్ అవుట్ చేశాక దక్షిణాఫ్రికా క్రమం తప్పకుండా వికెట్లను చేజార్చుకుంది. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించిన నదినె డి క్లెర్క్ (185 బంతుల్లో 61; 8 ఫోర్లు, 1 సిక్స్) చివరి వికెట్‌గా వెనుదిరగడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు తీసిన భారత ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రాణాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. భారత టెస్టు చరిత్రలో 10 వికెట్లతో విజయం ఇది రెండోది మాత్రమే. 2002లో దక్షిణాఫ్రికాపైనే భారత జట్టు 10 వికెట్ల తేడాతో గెలిచింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 603/6 డిక్లేర్డ్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 266 ఆలౌట్; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 373 ఆలౌట్; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 37/0 (9.2 ఓవర్లలో).

సింగపూర్‌లో ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్

నవంబర్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ టైటిల్ పోరు





న్యూఢిల్లీ: భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్, క్యాండిడేట్స్ టోర్నీ విజేత దొమ్మరాజు గుకేశ్‌కు స్వదేశంలో ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఆడే అవకాశం లభించలేదు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా), చాలెంజర్ గుకేశ్ మధ్య ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఆతిథ్య హక్కులు సింగపూర్‌కు లభించాయి. ఈ మెగా ఈవెంట్ ఆతిథ్య హక్కుల కోసం అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్), తమిళనాడు ప్రభుత్వం, సింగపూర్ పోటీపడ్డాయి. బిడ్‌లను పరిశీలించాక ఈ మెగా ఈవెంట్ ఆతిథ్య హక్కులు సింగపూర్‌కు కేటాయిస్తున్నట్లు అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ప్రకటించింది. ఈ ఏడాది నవంబర్ 20 నుంచి డిసెంబర్ 15 వరకు గుకేశ్, డింగ్ లిరెన్ మధ్య 25 లక్షల డాలర్ల (రూ. 20 కోట్ల 85 లక్షలు) ప్రైజ్‌మనీతో ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ జరుగుతుంది. ఇద్దరి మధ్య 14 రౌండ్‌లు నిర్వహిస్తారు. తొలుత 7.5 పాయింట్లు సంపాదించిన ప్లేయర్‌ను విశ్వవిజేతగా ప్రకటిస్తారు. 14 రౌండ్ల తర్వాత ఇద్దరూ సమంగా నిలిస్తే టైబ్రేక్ ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు. ఇప్పటి వరకు క్లాసికల్ ఫార్మాట్‌లో భారత్ నుంచి విశ్వనాథన్ ఆనంద్ మాత్రమే ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. ఆనంద్ ఐదుసార్లు (2000, 2007, 2008, 2010, 2012) విశ్వవిజేతగా నిలిచాడు.

క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్



కొలోన్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ స్పెయిన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ టోర్నీలో తొలిసారి బరిలోకి దిగిన జార్జియా జట్టుతో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 4–1 గోల్స్‌తో గెలిచింది. స్పెయిన్ తరఫున రోడ్రి (39వ ని.లో), రూయిజ్ (51వ ని.లో), విలియమ్స్ (75వ ని.లో), ఓల్మో (83వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. స్పెయిన్‌కే చెందిన లె నోర్మాండ్ (18వ ని.లో) చేసిన సెల్ఫ్ గోల్‌తో జార్జియా ఖాతా తెరిచింది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్ 1–0తో బెల్జియంపై గెలిచింది. ఆట 85వ నిమిషంలో బెల్జియం ప్లేయర్ వెర్టోంగెన్ సెల్ఫ్ గోల్‌తో ఫ్రాన్స్ విజయం సాధించింది.

'సీనియర్లు కొనసాగుతారు'

చాంపియన్స్ ట్రోఫీపై జై షా స్పష్టీకరణ ● డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా గెలుస్తామని ధీమా



బ్రిడ్జ్‌టౌన్: అంతర్జాతీయ టి20లకు రిటైర్మెంట్ ప్రకటించినా... ఐసీసీ వన్డే టోర్నీ చాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి అందుబాటులో ఉంటారని బీసీసీఐ కార్యదర్శి జై షా స్పష్టం చేశారు. టి20 ఫార్మాట్‌కు సంబంధించి భారత జట్టులో మార్పు మొదలైందన్న ఆయన... పాండ్యాను కెప్టెన్‌గా నియమించే విషయం సెలక్టర్లు చూసుకుంటారని వ్యాఖ్యానించారు. 2025లో చాంపియన్స్ ట్రోఫీ, డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనున్నాయి. 'ముగ్గురు కీలక ఆటగాళ్ల రిటైర్మెంట్ తర్వాత టి20 జట్టులో ఇప్పటికే మార్పులు మొదలయ్యాయి. అయితే ప్రస్తుతం సీనియర్లతో కూడిన మన జట్టు ప్రదర్శన చూస్తే మా తర్వాతి లక్ష్యం చాంపియన్స్ ట్రోఫీ, డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా గెలవడమే. దాదాపు ఇదే జట్టు అక్కడా ఆడుతుంది. సీనియర్లంతా అందుబాటులో ఉంటారు. భారత జట్టు అన్ని ఐసీసీ టైటిల్స్ గెలవాలనే నేనూ కోరుకుంటా. మన దగ్గర ప్రతిభావంతులైన రిజర్వ్ ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అవసరమైతే ఒకేసారి మనం 3 జట్లను బరిలోకి దించగలం' అని జై షా అభిప్రాయపడ్డారు. తాజా వరల్డ్ కప్‌లో కీలక ప్రదర్శన చేసిన పాండ్యాపై షా ప్రశంసలు కురిపించారు. 'పాండ్యా ఫామ్ గురించి గతంలో ఎన్నో రకాల సందేహాలు వ్యక్తం చేశారు. కానీ సెలక్టర్లు అతనిపై నమ్మకం ఉంచి ఎంపిక చేస్తే దానిని పాండ్యా నిలబెట్టుకున్నాడు. అయితే టి20 టీమ్‌కు పూర్తి స్థాయి కెప్టెన్‌గా నియమించే అధికారం సెలక్టర్ల చేతుల్లోనే ఉంది' అని షా చెప్పారు.

టీమిండియా మరింత ఆలస్యంగా...

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత టి20 జట్టు స్వదేశానికి రావడం మరింత ఆలస్యం కానుంది. బార్బడోస్ దేశాన్ని తాకిన పెను తుఫాన్‌తో ఆటగాళ్లు ఎక్కడికీ వెళ్లే పరిస్థితి లేదు. తీవ్రత ఎక్కువగా ఉండే కేటగిరీ 4 హరికేన్ వల్ల రెండు రోజులుగా దేశం మొత్తం లాక్‌డౌన్‌లో ఉంది. ముఖ్యంగా స్థానిక ఎయిర్‌పోర్ట్‌ను పూర్తిగా మూసేశారు. దాంతో భారత జట్టు ప్రత్యేక విమానం ద్వారా అక్కడి నుంచి బయల్దేరే అవకాశాలు కూడా లేకుండా పోయాయి. విద్యుత్, నీటి సరఫరా కూడా అస్తవ్యస్తంగా మారింది. ఎలాగైనా ఇక్కడి నుంచి ఆటగాళ్లను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తూ చార్టర్డ్ ఫ్లయిట్ కంపెనీలతో మాట్లాడే ప్రయత్నం చేశామని... అయితే ఎయిర్‌పోర్ట్‌లో విమానాల రాకపోకలు సాధ్యం కావడం లేదని బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించారు. ప్రస్తుతం పరిస్థితులు చక్కబడే వరకు వేచి ఉండటం మినహా మరో మార్గం లేదన్ని జై షా... భారత్‌కు చేరుకున్న తర్వాతే ఆటగాళ్ల సన్మానం తదితర విషయాల గురించి ఆలోచిస్తామని అన్నారు.


అల్‌కరాజ్ శుభారంభం



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ శుభారంభం చేశాడు. సోమవారం మొదలైన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ 7-6 (7/3), 7-5, 6-2తో క్వాలిఫయర్ మార్క్ లజాల్ (ఎస్తోనియా)పై గెలిచాడు. 2 గంటల 23 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు 44 విన్నర్స్ కొట్టాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేయడంతోపాటు నెట్ వద్దకు 33 సార్లు దూసుకొచ్చి 26 సార్లు పాయింట్లు సాధించాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 6-4, 6-2తో కొవాసెవిచ్ (అమెరికా)పై, ఎనిమిదో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 7-6 (7/2), 6-4, 6-4తో అలెక్స్ బోల్ట్ (ఆస్ట్రేలియా)పై, పదో సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 7-5తో లజోవిచ్ (సెర్బియా)పై నెగ్గారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) 6-4, 2-6, 4-6తో లులు సన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయింది.

సినిమా

మేడ్ ఇన్ ఓల్డ్ సిటీ


● రామ్

'ఉస్తాద్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్... మేడ్ ఇన్ ఓల్డ్ సిటీ' అంటూ మొదలయ్యే 'స్టెప్పా మార్' పాట 'డబుల్ ఇస్మార్ట్' సినిమాలోనిది. హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందిన హిట్ ఫిల్మ్ 'ఇస్మార్ట్ శంకర్' (2019). ఈ సినిమాకు సీక్వెల్‌గా రామ్, పూరి కాంబినేషన్‌లోనే 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో కావ్యా థాపర్ హీరోయిన్. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ 'డబుల్ ఇస్మార్ట్' సినిమా ఆగస్టు 15న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి 'స్టెప్పా మార్..' అనే పాట లిరికల్ వీడియోను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సోమవారం విడుదల చేశారు. ''ఇస్మార్ట్ శంకరే.. ఏక్ దమ్ డేంజరే... ఔర్ ఏక్ బార్ ఆయారే.. బేజారే..' అంటూ సాగుతుంది 'స్టెప్పామార్' సాంగ్. తెలుగు వెర్షన్ పాటకు మణిశర్మ సంగీత సారథ్యంలో భాస్కరభట్ల సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి, సాహితి పాడారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాలో సంజయ్ దత్, అలీ, గెటప్ శీను కీలక పాత్రలు పోషిస్తున్నారు.


● నయనతార

విజయ్ సేతుపతి కెరీర్‌లోని 50వ సినిమా 'మహారాజ' ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. 'మహారాజ'కు బాక్సాఫీస్ పరంగా మంచి వసూళ్లు, సినీ విమర్శకుల పరంగా అభినందనలు రావడంతో నితిలన్‌కు అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఈ క్రమంలోనే నయనతారకు

మరో లేడీ ఓరియంటెడ్ మూవీలో...

నితిలన్ ఓ లేడీ ఓరియంటెడ్ స్టోరీ చెప్పారని, బేసిక్ ప్లాట్ నచ్చడంతో ఈ సినిమా చేసేందుకు ఆమె సానుకూలంగా ఉన్నారని టాక్. దీంతో స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారట నితిలన్. సో.. నయనతార మరో లేడీ ఓరియంటెడ్ మూవీలో కనిపిస్తారన్న మాట.

పట్టు వదలకుండా..!


● అజిత్

అజిత్, త్రిష జంటగా రూపొందుతున్న చిత్రం 'విడా ముయర్చి' (పట్టు వదలకుండా ప్రయత్నించడం). లైకా ప్రొడక్షన్స్‌పై మగిళ్ తిరుమేని దర్శకత్వంలో సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి అజిత్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ మాట్లాడుతూ – ''మా బేనర్లో అజిత్‌తో సినిమా ప్రకటించినప్పట్నుంచి అభిమానులు, ప్రేక్షకులు ఈ మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారి అంచనాలను చేరుకునేలా మంచి కథా కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఆగస్ట్‌లో సినిమా చిత్రీకరణ పూర్తవుతుంది. విడుదల ఎప్పుడనేది త్వరలో చెబుతాం'' అన్నారు. ఇక ప్రచారంలో ఉన్న ప్రకారం ఈ చిత్రకథ ఏంటంటే... ఓ భార్యాభర్త విహార యాత్రకు వెళతారు. అకస్మాత్తుగా భార్య కనిపించకుండా పోతుంది. ఆమెను కనుగొనే క్రమంలో కనిపించని శత్రువులతో పట్టు వదలకుండా హీరో చేసే పోరాటం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని తెలిసింది. ఆరవ్, రెజీనా కసాండ్ర, నిఖిల్, అర్జున్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: ఓం ప్రకాశ్.

చెడుకి మంచికి మధ్య యుద్ధం


● సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా పాన్ ఇండియా స్థాయిలో ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్ మూవీ తెరకెక్కనుంది. హిందీలో 'రుస్తుం, టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మ్యాన్, పరి' వంటి చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ చిత్రం రూపొందనుంది. వెంకట్ కల్యాణ్ దర్శకుడిగా పరిచయం కానున్న ఈ చిత్రాన్ని సోమవారం ప్రకటించారు. సుధీర్ బాబు మాట్లాడుతూ – ''స్క్రిప్ట్ నచ్చి ఏడాదిగా ఈ టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. ఓ వినూత్న కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రంతో ఎప్పుడెప్పుడు ప్రేక్షకుల ముందుకు వద్దామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''చెడుకి, మంచికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో భారతీయ సినిమాల్లో ఓ మైల్ స్టోన్ మూవీలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నాం. పురాణాలతో అనుసంధానం చేయబడిన ఎన్నో రహస్యాలను ఈ కథ వెలికి తీస్తుంది. ఈ చిత్రంలో సుధీర్‌బాబు సరసన ఓ బాలీవుడ్ హీరోయిన్ నటించనున్నారు. ఆ హీరోయిన్, ఇతర విశేషాలను త్వరలో తెలియజేస్తాం. వచ్చే ఏడాది మార్చిలో ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ప్రేరణ అరోరా, శివిన్ నారగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ నిర్మించనున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ ఆగస్ట్ 15న రిలీజ్ కానుంది.

మిస్టరీ స్టార్ట్


● సాయి శ్రీనివాస్


ఓ మిస్టరీని ఛేదించే పని మీద బిజీగా ఉండనున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆ రహస్యం ఏంటి? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా సోమవారం ఓ హారర్ మిస్టరీ మూవీ ఆరంభమైంది. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టారు. సతీష్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్‌ను అందజేశారు. ''ప్రేక్షకులు కుర్చీల్లోంచి కదలకుండా చూసేలా ఓ సరికొత్త పాయింట్‌తో ఈ హారర్ మిస్టరీ మూవీని రూపొందిస్తున్నాం. సాయి శ్రీనివాస్, అనుపమ ఇంతకుముందు చేయని పాత్రల్లో కనిపిస్తారు. ఈ నెల 11న రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: చిన్మయ్ సలాస్కర్, సమర్పణ: అర్చన.

ప్రేమ... విప్లవం


● సయీ మంజ్రేకర్, నిఖిల్

నిఖిల్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ 'ది ఇండియా హౌస్'. ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అనుపమ్ ఖేర్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారు. రామ్ వంశీ కృష్ణ దర్శకత్వంలో హీరో రామ్‌చరణ్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్ పతాకాలపై విక్రమ్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హంపి (కిష్కింద)లోని విరూపాక్ష దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ''1905లో ప్రేమ, విప్లవం నేపథ్యంలో సాగే పీరియాడికల్ డ్రామా ఇది. మంగళవారం ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణను ప్రారంభిస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాత: మయాంక్, కెమెరా: కామెరాన్ బ్రైసన్.

బర్త్‌డే బాయ్ వస్తున్నాడు


● రవికృష్ణన్

ఐదుగురు చిన్ననాటి స్నేహితులు విదేశాల్లో ఎంఎస్ చదవడానికి వెళ్లినప్పుడు ఏం జరిగింది? వారు ఎదుర్కొనే ఘటనలు వారి జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయి? అనే అంశాల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణన్, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాలో ప్రమోదిని, వాకా మని, రాజా అశోక్, వెంకటేశ్, సాయి అరుణ్, రాహుల్ కీలక పాత్రధారులు. బొమ్మా బొరుసా పతాకంపై విస్కి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. ''కామెడీ డ్రామా నేపథ్యంలో సాగే ఈ సినిమాలోని ప్రతి పాత్ర, సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తాయి. బాలు, వెంకీ, సాయి, సత్తి, అర్జున్ అనే ఐదుగురు స్నేహితుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు విస్కి.

క్రైమ్... థ్రిల్


● శ్రీరామ్, శ్రుతి

శ్రీరామ్ హీరోగా నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ మూవీకి 'కోడి బుర్ర' టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో శ్రుతీ మీనన్, ఆరుషి హీరోయిన్లు. చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ఈ వేడుకలో అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తొలి సన్నివేశానికి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత బెక్కం వేణుగోపాల్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు భరత కమ్మ స్క్రిప్ట్ అందించారు. ''ప్రేక్షకులందరికీ నచ్చేలా ఆసక్తికరంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం'' అన్నారు శ్రీరామ్. ''ఈ సినిమాలో శ్రీరామ్‌గారు పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారు'' అన్నారు చంద్రశేఖర్. ''ఈ నెల 22న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు నిర్మాతలు.

పాల పుంతల్లో తేలి...


● డెమీ–లీ టెబో

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా వీరి కలయికలోనే 'ఇండియన్ 2' తెరకెక్కిన సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 12న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'క్యాలెండర్' సాంగ్‌ను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేశారు. ''పాల పుంతల్లో వాలి.. జంట మేఘాలై తేలి... భూమితో పని లేకుండా గడిపేద్దామా..'' అంటూ సాగే తెలుగు వెర్షన్ సాంగ్‌కు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి పాడారు. ఈ పాటలో 2017 మిస్ యూనివర్స్, దక్షిణాఫ్రికా మోడల్ డెమి–లీ టెబో కనిపిస్తారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
2-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 443	79,476
నిఫ్టీ ▲ 131	24,142

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,833	▲ 102
డోజోన్స్	39,166	▲ 47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,167	▲ 3
డాక్స్	18,291	▲ 55
షాంఘై	2,995	▲ 1
నికాయ్	39,631	▲ 48

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,784
బంగారం (99.5 స్వచ్ఛత)	71,586
వెండి (కిలో)	87,802

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.99	84.01
£	బ్రిటన్ పౌండ్		104.42	106.97
€	యూరో		88.62	90.97
¥	జపాన్ ఎన్ (100)		51.29	52.41
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.71	56.67
S$	సింగపూర్ డాలర్		59.25	63.94
SAR	సౌదీ రియాల్		21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.83	23.61
¥	చైనా యువాన్		10.37	12.44

సరికొత్త శిఖరాలపై సూచీలు

ముంబై: ఐటీ, బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు సోమవారం సరికొత్త శిఖరాలపై ముగిశాయి. ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. భారత తయారీ రంగ కార్యకలాపాలు జూన్‌లో భారీగా పుంజుకున్నట్లు గణాంకాలు వెలువడటం ఇన్వెస్టర్లకు మరింత విశ్వాసాన్నిచ్చింది. సెన్సెక్స్ 443 పాయింట్లు పెరిగి 79,476 వద్ద, నిఫ్టీ 131 పాయింట్లు బలపడి 24,142 వద్ద స్థిరపడ్డాయి. సూచీలు ఉదయం జూలై నెలను ఫ్లాటుగా ప్రారంభించాయి. ట్రేడింగ్‌లో ఐటీ, బ్యాంకులతో పాటు కమోడిటీ, టెలికం, ఇండస్ట్రీయల్, మెటల్ షేర్లూ రాణించడంతో లాభాలార్జిస్తూ స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 528 పాయింట్లు పెరిగి 79,561 వద్ద, నిఫ్టీ 153 పాయింట్లు ఎగసి ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.58%, 1.11% చొప్పున పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.



→ అమెరికా ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో సెప్టెంబర్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు మరోసారి తెరపైకి వచ్చాయి. దీంతో ఐటీ కంపెనీల షేర్లకు డిమాండ్ లభించింది. టెక్ మహీంద్రా, ఎల్‌టీటీఎస్ 3%, విప్రో 2.50%, టీసీఎస్, ఎంఫసీస్ 1.50%, ఇన్ఫోసిస్, ఎల్‌టీఐఎం, కోఫోర్జ్ ఒకశాతం, హెచ్‌సీఎల్ టెక్ అర శాతం చొప్పున లాభపడ్డాయి.

ఇన్వెస్టర్ల సంపద.. రూ.443 లక్షల కోట్లు

సూచీల రికార్డుల బాటతో రూ. 3,44,798 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.443 లక్షల కోట్ల వద్ద ముగిసింది.

పతంజలి చేతికి 'ఆయుర్వేద్'

డీల్ విలువ రూ. 1,100 కోట్లు



న్యూఢిల్లీ: వంట నూనెల దిగ్గజం పతంజలి ఫుడ్స్ తాజాగా పతంజలి ఆయుర్వేద్‌కు చెందిన గృహ, వ్యక్తిగత సంరక్షణ బిజినెస్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పతంజలి ఫుడ్స్ పేర్కొంది. ఇందుకు రూ. 1,100 కోట్లు వెచ్చించనుంది. తద్వారా ఎఫ్ఎంసీజీ రంగంలో దిగ్గజ కంపెనీగా అవతరించనుంది. పతంజలి ఫుడ్స్ ప్రమోటర్లలో ఒకటైన పతంజలి ఆయుర్వేద లిమిటెడ్(పీఏఎల్).. బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. రెండు కంపెనీలకూ తగిన విలువలో పూర్తి ఆహారేతర బిజినెస్ కొనుగోలుకి బోర్డు అనుమతించినట్లు పతంజలి ఫుడ్స్ వెల్లడించింది. ఈ కొనుగోలులో పీఏఎల్ నిర్వహిస్తున్న కేశ సంరక్షణసహా.. చర్మ, పంటి, గృహ సంరక్షణ విభాగాలు భాగంకానున్నాయి.

పతంజలి ఫుడ్స్ షేరు ఎన్ఎస్ఈలో 7.5 శాతం జంప్‌చేసి రూ. 1,710 వద్ద ముగిసింది.

వాహన అమ్మకాలు అంతంతే



న్యూఢిల్లీ: దేశంలో పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా జూన్‌లో ఆటో అమ్మకాలు అంతంత మాత్రంగా జరిగాయి. అయితే బేస్ ఎఫెక్ట్ కారణంగా విక్రయాల్లో స్వల్ప వృద్ధి నమోదైంది. మొత్తంగా ఈ జూన్‌లో 3,40,784 వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన 3,28,710 యూనిట్లతో ఇవి కేవలం 3.67 శాతం అధికం. మారుతీ సుజుకీ, మహీంద్రాఅండ్‌మహీంద్రా, టయోటా కిర్లోస్కర్, కియా మోటార్స్ కంపెనీలు అమ్మకాల్లో వృద్ధిని కనబరిచాయి. టయోటా కిర్లోస్కర్ నెలవారీగా కంపెనీ చరిత్రలో అత్యధికంగా 27,474 వాహనాలకు విక్రయించింది. టాటా మోటార్స్, హోండా కార్స్, హ్యుందాయ్ మోటార్స్ అమ్మకాలు తగ్గాయి.

→ ఈ ఏడాది ప్రథమార్థంలో మొత్తం 21,68,512 వాహనాలు అమ్ముడయ్యాయి. 2023 తొలి ఆరు నెలల్లో అమ్ముడైన 20,15,033 యూనిట్లతో పోలిస్తే ఇవి 7.6 శాతం అధికం.

జూన్ విక్రయాలు ఇలా...

కంపెనీ	జూన్ 2024	జూన్ 2023	వృద్ధి/క్షీణత(%ల్లో)
మారుతీ	1,79,228	1,59,418	(+)12
హ్యుందాయ్	64,803	65,601	(-)1
టాటా మోటార్స్	74,147	80,383	(-)8
ఎండ్అండ్ఎం	69,397	62,429	(+)11
హోండా కార్స్	4,804	5,080	(-)5
ఎంజీ మోటార్స్	4,644	5,125	(-)9
టయోటా కిర్లోస్కర్	27,474	19,608	(+)40
కియా మోటార్స్	21,300	19,391	(+)10
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,58,477	3,40,981	(+)5
టీవీఎస్ మోటార్	2,55,734	2,35,833	(+)8

"ఏప్రిల్ పండుగ సీజన్ డిమాండ్ తర్వాత మే, జూన్‌లో వాహన పరిశ్రమ ప్యాసింజర్ వాహన విక్రయాల్లో క్షీణత చూసింది. సార్వత్రిక ఎన్నికలు, అధిక ఉష్ణోగ్రతలు ఇందుకు కారణాలు. గత రెండు నెలల్లో అమ్మకాలు తక్కువగా ఉన్నప్పటికీ, ఎంక్వైరీలు బలంగా ఉన్నాయి. రానున్న రోజుల్లో విక్రయాలు ఊపందుకునే వీలుంది."

– పార్థో బెనర్జీ, మారుతీ సుజుకీ ఇండియా మార్కెటింగ్ హెడ్


జీఎస్‌టీ వసూళ్లు రూ. 1.74 లక్షల కోట్లు

జూన్‌లో 8 శాతం అప్..



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు జూన్‌లో 8 శాతం పెరిగి రూ. 1.74 లక్షల కోట్లుగా నమోదైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు (ఏప్రిల్-జూన్) జీఎస్‌టీ స్థూల వసూళ్లు మొత్తం రూ. 5.57 లక్షల కోట్లకు చేరినట్లు వివరించాయి. మే నెలలో ఇవి రూ. 1.73 లక్షల కోట్లుగా ఉండగా, గతేడాది జూన్‌లో రూ. 1.61 లక్షల కోట్లుగా ఉన్నట్లు పేర్కొన్నాయి. ఈ ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు ఆల్‌టైమ్ గరిష్టమైన రూ. 2.10 లక్షల కోట్ల స్థాయిని తాకాయి. ప్రభుత్వం నెలవారీ వసూళ్ల డేటాను అధికారికంగా ప్రకటించే ఆనవాయితీని నిలిపివేసినట్లు వివరించాయి. మరోవైపు, భారీ వసూళ్లనేవి ఎకానమీ పటిష్టతను, వ్యాపార వర్గాలు ప్రశంసనీయమైన రీతిలో నిబంధనలను పాటించడాన్ని సూచిస్తున్నాయని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ తెలిపారు.

బంపర్ 'ఆఫర్'!



న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్ల జోరుతో ప్రైమరీ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వెరసి ఈ ఏడాది ఐపీవో మార్కెట్ కొత్త రికార్డులవైపు చూస్తోంది. ఈ బాటలో తాజాగా మరికొన్ని కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి సిద్ధపడుతున్నాయి. జాబితాలో నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్, బ్రెయిన్‌బీస్ సొల్యూషన్‌తోపాటు.. యూనికామర్స్, స్నాప్‌డీల్, గలా ప్రెసిషన్ తదితరాలు చేరాయి. వివరాలు చూద్దాం..

పబ్లిక్ ఇష్యూ బాటలో..

- బ్రెయిన్‌బీస్ సొల్యూషన్
- ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్
- నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్
- యూనికామర్స్, గాలా ప్రెసిషన్..

రూ. 3,000 కోట్లకు రెడీ

గతంలో మ్యాక్స్ బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీగా సేవలందించిన నివా బూపా లిస్టింగ్‌పై కన్నేసింది. ఇందుకు సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ప్రాస్పెక్టస్ ప్రకారం రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,200 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్, ప్రస్తుత ఇన్వెస్టర్ సంస్థలు ఆఫర్ చేయనున్నాయి. ఇన్వెస్టర్ ఫెటిల్ టోన్ ఎల్ఎల్‌పీ రూ. 1,880 కోట్లు, ప్రమోటర్ బూపా సింగపూర్ హోల్డింగ్స్ పీటీఈ లిమిటెడ్ రూ. 320 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నాయి. వెరసి ఐపీవో ద్వారా కంపెనీ మొత్తం రూ. 3,000 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. యూకే దిగ్గజం బూపా నియంత్రణలో నివా బూపా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం బూపా 62.27 శాతం, ఫెటిల్ టోన్ వాటా 27.86 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నాయి.

లిస్టింగ్‌కు ఫస్ట్‌క్రై రెడీ

ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృ సంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ ద్వారా భారీ స్థాయిలో నిధుల సమీకరణకు అడుగులు వేస్తోంది. ఇందుకు తాజాగా సెబీ నుంచి అనుమతి పొందింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 1,816 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 5.44 కోట్ల షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు.

మరో మూడు కూడా...

సెబీ అనుమతి పొందిన కంపెనీల జాబితాలో సాస్ ప్లాట్‌ఫామ్.. యూనికామర్స్ ఈ-సొల్యూషన్స్ (స్నాప్‌డీల్ మాతృసంస్థ), గాలా ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఇంటర్ ఆర్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ సైతం చేరాయి. ఈ కంపెనీలు 2024 జనవరి-మే మధ్యలో సెబీకి దరఖాస్తు చేశాయి.

మురుగు నీటి శుద్ధి సంస్థ

మురుగునీటి శుద్ధి(సీవేజ్ ట్రీట్‌మెంట్) ప్లాంట్లు, మురుగునీటి వ్యవస్థ సంబంధిత టర్న్‌కీ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్ పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో కంపెనీ 4.42 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. మరో 52.68 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లకు 93% వాటా ఉంది.

శివాలిక్ ఇంజినీరింగ్

ప్రెసిషన్ ఇంజినీరింగ్ కంపెనీ శివాలిక్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ నిధుల సమీకరణకు సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. కంపెనీ రూ. 335 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. మరో 41.3 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు.

హెల్త్‌కేర్‌లో..

ఆరోగ్య పరిరక్షణ సర్వీసుల విభాగంలో టెక్నాలజీ ఆధారిత సేవలందించే శాగిలిటీ ఇండియా ఐపీవో బాట పట్టింది. ఇందుకు వీలుగా సెబీకి ప్రాథమిక పత్రాలతో దరఖాస్తు చేసింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 98.44 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్ శాగిలిటీ బీవీ విక్రయానికి ఉంచనుంది.

తయారీకి 'ఆర్డర్ల' జోష్..

జూన్‌లో 58.3 శాతానికి పీఎంఐ



న్యూఢిల్లీ: సానుకూల డిమాండ్, కొత్త ఆర్డర్ల దన్నుతో జూన్‌లో తయారీ రంగ ఉత్పత్తి పెరిగింది. దీంతో ఉద్యోగాల కల్పన కూడా గణనీయంగా మెరుగుపడింది. వ్యాపార పరిస్థితులు మెరుగుపడుతున్నాయనడానికి సూచనగా గత నెలకు సంబంధించి హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూన్‌లో 58.3కి పెరిగింది. మే నెలలో ఇది 57.5గా నమోదైంది. పీఎంఐ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దానికి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. కొత్త ఆర్డర్ల రాకతో కంపెనీలు రిక్రూట్‌మెంట్‌ను కూడా పెంచుకుంటున్నట్లు హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ ఎకానమిస్ట్ మైత్రేయి దాస్ తెలిపారు. 2005 మార్చిలో దీనికి సంబంధించిన డేటాను సేకరించడం మొదలుపెట్టిన తర్వాత గత 19 ఏళ్లలో ఉద్యోగాల కల్పన రేటు ఇంత వేగవంతంగా ఉండటం ఇదే తొలిసారని వివరించారు. జూన్‌లో సిబ్బంది వ్యయాలతో పాటు ముడి వస్తువులు, రవాణాపై ఖర్చులు పెరగడంతో నిర్వహణ వ్యయాలు పెరిగినట్లు దాస్ చెప్పారు.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో అగ్నివీర్ (ఎంఆర్ మ్యుజిషియన్) పోస్టులు

ఇండియన్ నేవీలో అగ్నివీర్(ఎంఆర్ మ్యూజీషియన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2024 (నవంబర్ 24) బ్యాచ్ పేరున శిక్షణ ఉంటుంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులవ్వాలి. మ్యూజికల్ ఎబిలిటీ, మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్ ఉండాలి.
» **వయసు:** అభ్యర్థి 01.11.2003 నుంచి 30.04.2007 మధ్య జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.
» **కనిష్ట ఎత్తు ప్రమాణాలు:** పురుషులు, మహిళల ఎత్తు 157 సెం.మీ.ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్ మార్కులు, స్టేజ్-1(ప్రిలిమినరీ స్క్రీనింగ్), స్టేజ్ 2 (ఫైనల్ స్క్రీనింగ్), మ్యూజిక్ స్క్రీనింగ్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **శిక్షణ:** అగ్నివీర్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబర్ నెలలో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
» **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000 వేతనం ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.07.2024.
» **శిక్షణ ప్రారంభం:** 2025 నవంబర్.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఇండియన్ నేవీలో సెయిలర్ (స్పోర్ట్స్ కోటా ఎంట్రీ) పోస్టులు

ఇండియన్ నేవీ.. సెయిలర్(స్పోర్ట్స్ కోటా ఎంట్రీ 02/2024 బ్యాచ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **పోస్టుల వివరాలు:** డైరెక్ట్ ఎంట్రీ పెట్టీ ఆఫీసర్(స్పోర్ట్స్ ఎంట్రీ),చీఫ్ పెట్టీ ఆఫీసర్(స్పోర్ట్స్ ఎంట్రీ).
» **క్రీడలు:** అథ్లెటిక్స్, ఆక్వాటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, క్రికెట్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, హ్యాండ్ బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్, రెజ్లింగ్, గోల్ఫ్, టెన్నిస్, సెయిలింగ్ తదితరాలు.
» **అర్హత:** 10+2 ఉత్తీర్ణతతో పాటు ఇంటర్నేషనల్/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులై ఉండాలి.
» **వయసు:** 17 1/2 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. అభ్యర్థి 01.11.1999 నుంచి 30.04.2007 మధ్య జన్మించి ఉండాలి.
» **కనీస ఎత్తు ప్రమాణాలు:** పురుషులు 157 సెం.మీ., మహిళలు 152 సెం.మీ. ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **శిక్షణ:** ఐఎన్ఎస్ చిల్కా, ఒడిశా.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెక్రటరీ, ఇండియన్ నేవీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్, ఏడో అంతస్తు, చాణక్య భవన్, నౌకాదళ ప్రధాన కార్యాలయం, రక్షణ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.07.2024.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 16 సూపర్‌వైజర్ పోస్టులు

మాల్పే(కర్ణాటక)లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దర ఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, స్కాఫ్ ఫోల్డింగ్, హెచ్‌ఆర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్), డిగ్రీ(ఆర్ట్స్/కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 12.07.2024 నాటికి 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ప్రాక్టికల్ టెస్ట్, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.07.2024
» **వెబ్‌సైట్:** https://udupicsl.com

మెయిన్స్‌లో మెరిసేదెలా!

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా.. మొత్తం 21 కేంద్ర సర్వీసులకు ఎంపిక ప్రక్రియలో తొలిదశ పరీక్ష! దేశ వ్యాప్తంగా ఈ నెల 16న ప్రిలిమినరీ పరీక్ష ముగిసింది! దాదాపు 11 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 51 శాతం మేరకు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 42,560 మంది పరీక్ష రాసినట్లు సమాచారం. సోమవారం ప్రిలిమ్స్ ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. సివిల్స్ ప్రిలిమ్స్-2024 విశ్లేషణ, మెయిన్ పరీక్ష విధానం,మెయిన్‌లో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

- **1,056:** సివిల్స్-2024 నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టుల సంఖ్య.
- **ఆరు లక్షలు:** ప్రిలిమ్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య అంచనా.
- **12 వేల నుంచి 13 వేలు:** మెయిన్స్‌కు ఎంపికయ్యే అభ్యర్థుల సంఖ్య.

» విడుదలైన సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలు
» అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్
» సెప్టెంబర్ 20 నుంచి మెయిన్స్ పరీక్షలు

- ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా 1:12 లేదా 1:13 నిష్పత్తిలో మెరిట్ జాబితా రూపొందించి మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు.



ప్రిలిమ్స్ సులభంగానే

సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను జూన్ 16న నిర్వహించారు. ఒక్కో పేపరు 200 మార్కుల చొప్పున రెండు పేపర్లు 400 మార్కులకు పరీక్ష జరిగింది. సివిల్స్ ప్రిలిమ్స్-2024 పరీక్ష గతంతో పోలిస్తే కొంత సులభంగానే ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది.

అన్ని సబ్జెక్ట్‌లకు సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రశ్నల రూపకల్పనలో సమతుల్యత పాటించారని పేర్కొంటున్నారు. సబ్జెక్ట్‌ల వారీగా చూస్తే.. జాగ్రఫీ నుంచి 16-18 ప్రశ్నలు, పర్యావరణం 12-14 ప్రశ్నలు, ఎస్ అండ్ టీ 10-12 ప్రశ్నలు, హిస్టరీ 14-16 ప్రశ్నలు, ఎకనామిక్స్ 15-20 ప్రశ్నలు, పాలిటీ 14-16 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్ నుంచి 6-8 చొప్పున ప్రశ్నలు అడిగారు. పాలిటీలో ఈసారి ప్రశ్నలు నేరుగా అడగడం అభ్యర్థులకు ఉపశమనం కలిగించే విషయం. జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీలో అధిక శాతం ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ అనుసంధానంగా ఉన్నాయి. కరెంట్ అఫైర్స్ నుంచి డైరెక్ట్ కొశ్చన్స్ అడిగారు.

రెండో పేపర్ (సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్)లో రీడింగ్ కాంప్రహెన్షన్ 22-24 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 23-25 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 35-40 ప్రశ్నలు అడిగారు. ఈసారి నాన్ మ్యాథ్స్ అభ్యర్థులు సైతం సమాధానాలను గుర్తించగలిగేలా ప్రశ్నలు ఉన్నాయి.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ అప్రోచ్

ఆయా సబ్జెక్ట్‌ల కాన్సెప్ట్‌లపై క్లారిటీతోపాటు అప్లికేషన్ అప్రోచ్‌ను పరీక్షించేలా ప్రిలిమ్స్‌లో ప్రశ్నలు ఎదురయ్యాయి. దీంతో ప్రామాణిక పుస్తకాల అధ్యయనం, సమకాలీన పరిణామాలపై పట్టు, అన్వయం దృక్పథం కలిగిన అభ్యర్థులు సరైన సమాధానాలు గుర్తించడంలో ముందంజలో ఉంటారని నిపుణులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను క్షుణ్నంగా అధ్యయనం చేసిన అభ్యర్థులు స్కోర్ చేసేందుకు ఎక్కువ అవకాశం ఉందని చెబుతున్నారు.

మెయిన్‌లో రాణించేందుకు

ప్రిలిమ్స్‌లో ఎంపికైన అభ్యర్థులు.. తక్షణమే రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌పై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. మెయిన్ ఎగ్జామ్‌ను సెప్టెంబర్ 20 నుంచి అయిదు రోజుల పాటు నిర్వహించనున్నారు. మెయిన్ పరీక్ష మొత్తం ఏడు పేపర్లలో 1750 మార్కులకు జరుగుతుంది. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు.

వీటికి అదనంగా అర్హత పేపర్లుగా ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్ పేపర్లు ఉంటాయి. మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా అంతిమంగా 275 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

పేపర్ 1 (జనరల్ ఎస్సే)

తొలుత జనరల్ ఎస్సే విభాగంలో అడిగేందుకు అవకాశమున్న అంశాలను గుర్తించాలి. సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలు,కరోనా విపత్తు ప్రభావాలు,వ్యాక్సినేషన్ విధానాలు, పర్యావరణ అంశాలు,జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారిన అంశాలను అభ్యసించాలి. వీటికి విశ్లేషణాత్మక సమాధానాలు రాసే విధంగా ప్రాక్టీస్ చేయడం ఎంతో ముఖ్యం.

పేపర్-2 (జీఎస్-1)

హిస్టరీకి సంబంధించి సంగీతం, సాహిత్యం, నాట్యం, వాస్తు-శిల్పకళ, మత ఉద్యమాలు, తత్వాలు తదితర అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ఈ అంశాలను ప్రాచీన, మధ్య, ఆధునిక భారత దేశ చరిత్రలకు అనుసంధానిస్తూ చదవాలి. 18వ శతాబ్దం మధ్య కాలం నుంచి ఇప్పటి వరకు చోటుచేసుకున్న ప్రధాన సంఘటనల్ని పరిశీలించాలి. స్వాతంత్ర్యోద్యమం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే విధంగా రాజ్యాంగం, పంచవర్ష ప్రణాళికలు, భూ సంస్కరణలు, నెహ్రూ విదేశాంగ విధానం, అలీనోద్యమం, హరిత విప్లవం తదితరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ప్రపంచ చరిత్రకు సంబంధించి పారిశ్రామిక విప్లవం, ప్రపంచ యుద్ధాలు, ఐరోపాలో నూతన రాజ్యాల ఆవిర్భావం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో వలసవాదం వంటి వాటిని ప్రధానంగా చదవాలి. జాగ్రఫీకి సంబంధించి భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు, తుపానులు తదితరాల గురించి శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలి. ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడే సహజ వనరుల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

పేపర్-3(జీఎస్-2)

ముందుగా సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. ఈ పేపర్ సిలబస్ ప్రజా పరిపాలన, రాజకీయ వ్యవస్థ, అంతర్జాతీయ సంబంధాల సమ్మేళనంగా ఉంది. భారత రాజ్యాంగం గురించి చదివే క్రమంలో.. 1858 భారత ప్రభుత్వ చట్టం దగ్గరి నుంచి 1947 స్వాతంత్ర్య చట్టం వరకు చదవాలి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలపై దృష్టి సారించాలి. రాజ్యాంగం మూల నిర్మాణాన్ని అర్థం చేసుకునేందుకు కేశవానంద భారతి కేసు-1973, మినర్వా మిల్స్ కేసులను పరిశీలించాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక, ఆర్థిక అధికారాల విభజన, భారత రాజకీయ వ్యవస్థలోని అర్ధ సమాఖ్య స్వభావంపై దృష్టిపెట్టాలి. 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల ప్రభావాన్ని పరిశీలించాలి. ప్రభుత్వ పథకాల పనితీరు, ఉద్దేశం, లక్ష్యం, ఫలితాలను అధ్యయనం చేయాలి.

పేపర్ 4 (జీఎస్-3)

ఈ పేపర్‌లో టెక్నాలజీ, ఆర్థికాభివృద్ధి, బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లను అధ్యయనం చేయాలి. ప్రణాళికా పెట్టుబడుల్లో భాగంగా ప్రభుత్వ రంగ వనరుల సమీకరణకు ఆధారాలు, వాటి ధోరణులు, వివిధ రంగాల మధ్య వనరుల పంపిణీ తదితర అంశాలను క్షణ్నంగా చదవాలి. భారత్‌లో సమ్మిళిత వృద్ధి పాత్ర, ఆహార భద్రత, బడ్జెటింగ్ తీరుతెన్నులతో పాటు స్వాతంత్ర్యం తర్వాత వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులను చదవాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధితో పాటు దైనందిన జీవితంలో దాని అనువర్తనాలపై దృష్టిపెట్టాలి.

పేపర్ 5 (జీఎస్-4)

ఈ పేపర్‌లో సిలబస్‌లోని ఎక్కువ అంశాలు ప్రభుత్వ పాలన (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)కు సంబంధించినవి. కాగా మరికొన్ని ఫిలాసఫీ, సైకాలజీకి చెందినవి. అభ్యర్థులు పరిపాలనలో నైతిక విలువల ఆవశ్యకతకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలి. వ్యక్తిగత, సామాజిక సంబంధాల్లో విలువలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో తెలుసుకోవాలి. నైతిక శాస్త్రంలో ప్రధానంగా అప్లయిడ్ ఎథిక్స్ (అనువర్తిత నైతిక శాస్త్రం)పై దృష్టి పెట్టాలి. ప్రధానంగా అభ్యర్థులు 'పబ్లిక్ సర్వీస్ ఎథిక్స్'కు సంబంధించిన అంశాలను చదవాలి. ప్రభుత్వ విధానాల అమలు, నిధుల ఖర్చు, విధుల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతలో నైతికత ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి. మతం-నైతికత,వర్ణ వ్యవస్థ-నైతికత, కుటుంబం-నైతికత..ఇలా వివిధ సామాజిక అంశాలను,సమకాలీన అంశాలతో అనుసంధానిస్తూ చదవాలి. నైతిక విలువలు పెంపొందించడంలో కుటుంబం, సమాజం, విద్యా సంస్థల పాత్ర ఏమిటో తెలుసుకోవాలి. లక్ష్య సాధనలో, విధి నిర్వహణలో ఎంతో కీలకంగా నిలిచే వైఖరి గురించి ప్రత్యేక శ్రద్ధతో అధ్యయనం చేయాలి.

పేపర్ 6, 7.. ఆప్షనల్ సబ్జెక్ట్‌కు ఇలా

మెయిన్స్‌లో అభ్యర్థులు ఒక ఆప్షనల్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ, ఫిలాసఫీ, సైకాలజీ తదితర ఆప్షనల్స్ జనరల్ స్టడీస్‌కు కలిసొచ్చే విధంగా ఉన్నాయి. ఆప్షనల్ ఏదైనా సరే.. సిలబస్‌ను ఆమూలాగ్రం అధ్యయనం చేయాలి. ప్రశ్నలు అడిగే ఆస్కారం ఉన్న అంశాలను గుర్తించి.. వాటిపై మరింత లోతుగా అధ్యయనం చేయాలి. గత కొన్నేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించి, ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

900 మార్కులు లక్ష్యంగా

మెయిన్స్‌లో మొత్తం 1,750 మార్కులకు గాను 900 మార్కులు సాధించేలా కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ టెస్ట్‌లకు హాజరవుతూ వాటిలో కనీసం వేయి మార్కులు సాధించేలా యత్నించాలని పేర్కొంటున్నారు. ఫలితంగా పరీక్ష సమయంలో కొద్దిపాటి పొరపాట్లు జరిగినా.. 900 మార్కులను సాధించే సామర్థ్యం లభిస్తుందని సూచిస్తున్నారు.

క్లుప్తంగా...

ఏసీబీ అదనపు డీజీ బాధ్యతల స్వీకరణ



సాక్షి, అమరావతి: ఏసీబీ అదనపు డీజీగా అతుల్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎస్పీ అదనపు డీజీగా ఉన్న ఆయన్ను ప్రభుత్వం ఇటీవల ఏసీబీ అదనపు డీజీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. విజయవాడలోని ఆర్టీసీ భవన్‌లో ఉన్న ఏసీబీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఏడీసీ సీఎండీగా లక్ష్మీపార్థసారథి బాధ్యతలు



సాక్షి, అమరావతి: అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా డి.లక్ష్మీపార్థసారథి సోమవారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశమైన లక్ష్మీపార్థసారథి ప్రస్తుతం అమరావతిలోని నిర్మాణాల పరిస్థితులపై చర్చించారు. ఈ సమావేశంలో సంస్థ చీఫ్ ఇంజినీర్ సీహెచ్.ధనుంజయ్, ఎస్ఈ భాస్కర్, సీఏవో ఉమామహేశ్వరి, ఉద్యానవన అధికారి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఏపీసీఎఫ్ఎస్ఎస్ సీఈవో సునీల్‌కుమార్ రెడ్డి బదిలీ

- తదుపరి పోస్టింగ్ కోసం పీసీసీఎఫ్‌లో రిపోర్టు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్స్ సిస్టిమ్ అండ్ సర్వీసెస్ (ఏపీసీఎఫ్ఎస్ఎస్) సీఈవోగా పనిచేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి బి.సునీల్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. తదుపరి పోస్టింగ్ కోసం పీసీసీఎఫ్‌కు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థికశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న వినయ్ చంద్‌కు ఏపీసీఎఫ్ఎస్ఎస్ సీఈవో బాధ్యతలను అప్పగించారు. ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న గిరిజా శంకర్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న పీయూష్ కుమార్‌కు ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

పవర్ గ్రిడ్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జిగా అఖిలేష్ పాఠక్



సాక్షి, హైదరాబాద్: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ దక్షిణాది ప్రాంత ఇన్‌చార్జిగా సంస్థ సీజీఎం అఖిలేష్ పాఠక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్వహణను ఆయన పర్యవేక్షించనున్నారు.

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులుగా ప్రణతి, విష్ణుతేజ

సాక్షి, అమరావతి: హైకోర్టులో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు (ఎస్‌జీపీ)గా సింగమనేని ప్రణతి, తిరుమాని విష్ణుతేజ నియమితులయ్యారు. వీరిద్దరూ కూడా ఆయా కేసుల్లో అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్‌కు సహకరిస్తారు. టీడీపీ అధికారంలో ఉన్నంత వరకు వారు ఈ పదవుల్లో కొనసాగుతారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి (ఇన్‌చార్జి) వి.సునీత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులుగా, ప్రభుత్వ న్యాయవాదులుగా, ప్రభుత్వ సహాయ న్యాయవాదులుగా పనిచేసిన వారు సమర్పించిన రాజీనామా లేఖలను ప్రభుత్వం ఆమోదించింది.

కేంద్ర ఉక్కు సహాయ మంత్రిని కలిసిన స్టీల్‌ప్లాంట్ సీఎండీ

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు శాఖ, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కలిశారు. కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం న్యూఢిల్లీలో శ్రీనివాసవర్మను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి స్టీల్‌ప్లాంట్ గురించి వివరించారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను కొనసాగించాలి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లను కొనసాగిస్తూ వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో ఛైర్మన్ కల్లూరి శ్రీనివాస్ కోరారు. సోమవారం వారు తాడేపల్లిలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,618 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ నెలాఖరుతో తమ సేవలు ముగిశాయన్నారు. తిరిగి ఈ ఏడాది మే నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు తమ సేవలను పునరిద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉందన్నారు.

పలువురు వీసీల రాజీనామా

వర్సిటీల్లో కూటమి నేతల రాజకీయ విషక్రీడ

ఉన్నత విద్యకు పట్టుగొమ్మలుగా విలసిల్లుతున్న విశ్వవిద్యాలయాలను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వదిలిపెట్టడం లేదు. రాజకీయాలకు దూరంగా ఉంటున్న వర్సిటీలను తమ రాజకీయ విషక్రీడలకు బలిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ (వీసీ), రిజిస్ట్రార్లను రాజీనామాలు చేసి వెళ్లిపోవాలంటూ కూటమి నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు అధికారుల ద్వారా వీసీలందరికీ ఫోన్‌లు చేయిస్తూ ఒత్తిడి తెస్తున్నారు. రాజీనామాలు చేసి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక మంది వీసీలు రాజీనామాలు చేసి తప్పుకున్నారు. ఈ క్రమంలో మరికొందరు కూటమి నేతలు, అధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక సోమవారం తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు.



ఆంజనేయప్రసాద్



జీవీఆర్ ప్రసాదరాజు



డి.భారతి



సుధీర్ ప్రేమ్ కుమార్

వైదొలిగిన జేఎన్‌టీయూకే వీసీ

జేఎన్‌టీయూ–కాకినాడ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తన పదవికి రాజీనామా చేశారు. 2021 అక్టోబర్ 29న వీసీగా నియమితులైన ఆయన మరో నాలుగు నెలల పదవీ కాలం ఉండగానే రాజీనామా చేయాల్సి వచ్చింది.

ఏఎన్‌యూ వీసీ, ఉన్నతాధికారులు..

గుంటూరు జిల్లా నంబూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, పలువురు కో–ఆర్డినేటర్లు, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేశారు.

సాక్షి, అమరావతి/కర్నూలు కల్చరల్/ఏఎఫ్‌యూ/తిరుపతి సిటీ/ఏఎన్‌యూ/బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.బాబ్జీ రాజీనామా చేశారు. గవర్నర్, వర్సిటీ చాన్సలర్ అయిన అబ్దుల్ నజీర్‌కు మెయిల్ ద్వారా తన రాజీనామా లేఖను పంపారు. బాబ్జీ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ వైద్యుడు. గతంలో వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ)గా పనిచేసిన బాబ్జీ గతేడాది ఫిబ్రవరిలో వీసీగా నియమితులయ్యారు. 2026 ఫిబ్రవరి వరకూ ఆయన పదవీకాలం ఉన్నప్పటికీ వైద్య శాఖ ఉన్నతాధికారి ఒకరు ఫోన్ చేసి రాజీనామా చేయాలని ఆదేశించడంతో తన పదవి నుంచి వైదొలిగారు.

తప్పకున్న రాయలసీమ వర్సిటీ వీసీ..

కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయనకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి ఛైర్మన్, డిప్యూటీ సెక్రటరీ ఫోన్ చేసి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో సుధీర్ ప్రేమ్ కుమార్ తన రాజీనామా లేఖను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పంపారు. హైదరాబాద్ జేఎన్‌టీయూ మెకానికల్ విభాగం ప్రొఫెసర్ అయిన బి.సుధీర్ ప్రేమ్ కుమార్ ఈ ఏడాది జనవరి 17న వీసీగా బాధ్యతలు స్వీకరించారు.

పద్మావతి మహిళా వర్సిటీ వీసీ రాజీనామా

తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి పదవి నుంచి వైదొలిగారు. ఆమె గతేడాది జూన్ 15న వీసీగా బాధ్యతలు చేపట్టారు. ఆమె పదవీ కాలం మరో రెండేళ్లు ఉన్నప్పటికీ అధికారుల ఒత్తిడితో రాజీనామా చేశారు.

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ వీసీ కూడా..

కడపలో 2020లో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ తొలి వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ కూడా తన పదవీకాలం పూర్తవకుండానే ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో రాజీనామా సమర్పించారు. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న ఆయనను గతేడాది ఫిబ్రవరి 9న ఏఎఫ్‌యూ వీసీగా నియమించారు. కాగా ఇప్పటికే వైఎస్సార్ జిల్లాకు చెందిన యోగి వేమన వర్సిటీ (వైవీయూ) వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి రాజకీయ నేపథ్యం, వివాదం లేని గిరిజన ఆచార్యుడైన బానోతు ఆంజనేయప్రసాద్‌ను సైతం రాజీనామా సమర్పించాలని కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో వీసీ పదవి నుంచి వైదొలిగారు. 2026 ఫిబ్రవరి 8 వరకు పదవీకాలం ఉన్నా తప్పుకున్నారు.

నేటి నుంచి డిగ్రీ ప్రవేశాలు

- 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల రిజిస్ట్రేషన్లకు అవకాశం
- 4, 5, 6 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన.. 11 నుంచి ఆప్షన్ల ఎంపిక.. 19న సీట్ల కేటాయింపు
- డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్ట్స్, సైన్స్, సోషల్‌సైన్సెస్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ సోషల్‌వర్క్, ఆనర్స్ వంటి కోర్సుల్లో సీట్లను భర్తీ చేయనుంది. ప్రభుత్వ, అటానమస్, ప్రైవేటు ఎయిడెడ్, ప్రైవేటు అన్ ఎయిడెడ్, ప్రైవేటు అటానమస్ కళాశాలల్లోని వివిధ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు కల్పించనుంది. ఈ మేరకు జూలై 2వ (నేడు) నుంచి 10వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. 5న కళాశాలల్లో ధ్రువపత్రాల పరిశీలన, 11 నుంచి 15 వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పించింది. 19న తుది సీట్ల కేటాయింపు పూర్తిచేయనుంది. సీట్లు పొందిన విద్యార్థులు 20 నుంచి 22లోగా ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించింది. ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు (దివ్యాంగులు, ఎన్‌సీసీ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఇతర కరిక్యులర్ యాక్టివిటీస్) సర్టిఫికెట్లను 4 నుంచి 6వ తేదీ వరకు పరిశీలించనుంది. ఈ విద్యార్థులు విజయవాడలోని ఎస్ఆర్ఆర్, విశాఖపట్నంలోని వీఎస్ కృష్ణ కళాశాల, తిరుపతిలోని ఎస్వీ వర్సిటీలో ధ్రువపత్రాల పరిశీలకు హాజరుకావాలి. ఉన్నత విద్యామండలి ఓఏఎండీసీ (https://cets.apsche.ap.gov.in/APSCHE/OAMDC23/OAMDCHome.html) పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ పేర్కొన్నారు.

కాటంనేని భాస్కర్, నిర్మల్ కుమార్‌పై
కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోండి

- ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు
- చట్ట ప్రకారం నడుచుకుంటామని కోర్టుకు చెప్పారు
- తదుపరి చర్యలకు ముందు చట్టాన్ని అనుసరించాలని వారికి హైకోర్టు చెప్పింది
- మా న్యాయవాది కోర్టు ఆదేశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు
- అయినా పట్టించుకోకుండా దౌర్జన్యపూరితంగా కూల్చేశారు
- హైకోర్టులో వైఎస్సార్‌సీపీ కోర్టు ధిక్కార పిటిషన్



సాక్షి, అమరావతి: చట్ట ప్రకారం నడుచుకుంటామని కోర్టుకు చెప్పి, అందుకు విరుద్ధంగా గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయం భవనాన్ని కూల్చివేయడంపై ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. పార్టీ కార్యాలయం కూల్చివేతకు బాధ్యులైన సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మంగళగిరి, తాడేపల్లి మునిసిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌పై కోర్టు ధిక్కరణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. వైఎస్సార్‌సీపీ తరఫున పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో కాటంనేని భాస్కర్, నిర్మల్ కుమార్‌ను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

చట్ట ప్రకారం నడుచుకోమని కోర్టు ఆదేశించినా..

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయం భవనాన్ని కూల్చివేసేందుకు మునిసిపల్ కమిషనర్ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యం విచారణ సందర్భంగా వైఎస్సార్‌సీపీ భవనం విషయంలో చట్ట ప్రకారమే నడుచుకుంటామని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు హామీ ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ఆ భవనం కూల్చివేత విషయంలో తదుపరి చర్యలు చేపట్టే ముందు చట్ట ప్రకారం నడుచుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మునిసిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌ను ఆదేశిస్తూ ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను వైఎస్సార్‌సీపీ తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి లిఖితపూర్వకంగా సీఆర్‌డీఏ కమిషనర్, మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ మరుసటి రోజు తెల్లారి 5 గంటల సమయంలో పార్టీ ప్రధాన కార్యాలయాన్ని కూల్చేశారు.

కోర్టు ఆదేశాలను ధిక్కరించి పార్టీ భవనాన్ని కూల్చివేసినందుకు కాటంనేని భాస్కర్, నిర్మల్ కుమార్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ తాజాగా వైఎస్సార్‌సీపీ పిటిషన్ దాఖలు చేసింది. అధికారులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని ఆ పిటిషన్‌లో పేర్కొంది. తాము ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోకుండా, దానిపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండా ఏకపక్షంగా పార్టీ కార్యాలయాన్ని కూల్చేశారంది. ఇది కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. రాజకీయ నాయకులతో చేతులు కలిపిన ఈ ఇద్దరు అధికారులు రాజకీయ దురుద్దేశంతోనే ఏకపక్షంగా, దౌర్జన్యపూరితంగా తమ కార్యాలయాన్ని కూల్చేశారని తెలిపింది. వాస్తవానికి సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమం తరువాత ఎలాంటి కూల్చివేతలు చేపట్టడానికి వీల్లేదని ఇదే హైకోర్టు గతంలో తీర్పునిచ్చిందని తెలిపింది. కోర్టు ఆదేశాలంటే అధికారులకు లెక్క లేదని, ఇష్టానుసారం వ్యవహరించారని, వారి చర్యలను తీవ్రంగా పరిగణించాలని కోరింది. కూల్చివేత విషయంలో అధికారుల హడావుడిని గమనిస్తే వారి దురుద్దేశాలు అర్థమవుతాయంది. వారి చర్యలు కోర్టు ధిక్కరణ పరిధిలోకి వస్తాయంది. కోర్టు ధిక్కారానికి పాల్పడినందుకు వారిని శిక్షించాలని హైకోర్టును కోరింది.

క్రిమినల్ చర్యలు కూడా..!

ఇదిలా ఉండగా.. పార్టీ కార్యాలయాన్ని ఏకపక్షంగా, దురుద్దేశపూర్వకంగా కూల్చివేసినందుకు కాటంనేని భాస్కర్, నిర్మల్ కుమార్‌పై క్రిమినల్ చర్యలకు సైతం వైఎస్సార్‌సీపీ సిద్ధమవుతోంది. వీరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ కోర్టులో ఫిర్యాదు దాఖలు చేయనుంది.

ఏఎన్ఎంలకు జీఎన్ఎం శిక్షణ పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఏఎన్ఎంలకు ఇంటెన్సిఫైడ్ జీఎన్ఎం శిక్షణా కార్యక్రమాన్ని మరో నెల రోజులు పొడిగించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కి సూచిస్తూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత వీరి సేవలను ఎక్కడ వినియోగించుకోవాలనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఓ వైపు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రాకుండానే గత వారంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్ఎంలను రిలీవ్ చేయాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లను డీఎంఈ ఆదేశించారు. దీంతో జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకున్న తాము తిరిగి క్షేత్రస్థాయిలో విధులు ఎలా నిర్వహించాలని ఏఎన్ఎంలు ఆందోళనకు గురయ్యారు. కొందరు ఏఎన్ఎంలు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకుని వెళ్లారు. ఈ క్రమంలో ఏఎన్ఎంలను రిలీవ్ చేయకుండా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏఎన్ఎంలకు జీఎన్ఎం శిక్షణ ఇచ్చి, వీరి సేవలను పలు ఆస్పత్రుల్లో వినియోగించుకునేలా గత ప్రభుత్వంలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా ఏఎన్ఎంలను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు.

కృష్ణా జిల్లాకు రంగా పేరు పెట్టాలి

- సీఎం చంద్రబాబుకు కాపు ఐక్య వేదిక లేఖ

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లాకు, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వంగవీటి మోహన్‌రంగా పేరు పెట్టాలని కాపు ఐక్య వేదిక కోరింది. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదిక రాష్ట్ర ఛైర్మన్ రావి శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, బోడపాటి పెదబాబు, పంచాది రంగారావులు లేఖ రాశారు. దీన్ని సోమవారం మీడియాకు విడుదల చేశారు. ఈ నెల 4వ తేదీన వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా నామకరణం విషయాన్ని ప్రకటించాలని కోరారు. కాపు–కమ్మ మైత్రి మరింత బలపడాలన్నా, టీడీపీని కాపులు భవిష్యత్తులో కూడా మరింత విశ్వసించాలన్నా కృష్ణా జిల్లాకు, విమానాశ్రయానికి రంగా పేరుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

వ్యవస్థీకృత నేరాలకు కఠిన శిక్షలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు



సాక్షి, అమరావతి: కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలను పొందుపరిచారని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు తెలిపారు. ఇదే సమయంలో కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు, మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేందుకు వీలుగా బీఎన్ఎస్ ఉందన్నారు. భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ)లో మొత్తం 511 సెక్షన్లు ఉంటే, బీఎన్ఎస్‌లో 358 సెక్షన్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. కొత్తగా 15 సెక్షన్లను జత చేశారన్నారు. కొత్త చట్టాలకు సంబంధించి హైకోర్టు న్యాయవాదుల సంఘం సోమవారం హైకోర్టులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ దుర్గాప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆ చట్టాల గురించి వివరించారు. ఐపీసీలోని కొన్ని సెక్షన్లను తొలగించి, పలు నిర్వచనాలన్నింటినీ ఒక్కటి చేశారని చెప్పారు. ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ) నవజాత శిశువుల్లాంటివన్నారు. వివాహం చేసుకుంటానని నమ్మించి.. లైంగిక వాంఛ తీర్చుకుని మోసం చేసే వారిని శిక్షించేందుకు కొత్తగా సెక్షన్ 69ను తీసుకొచ్చారన్నారు. ఆత్మహత్యకు పాల్పడటం ఐపీసీ కింద నేరమని, దీన్ని బీఎన్ఎస్‌లో కొత్త పద్ధతిలో చేర్చారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులను ఫలానా పని చేయాలని.. చేయకపోతే ఆత్మహత్యకు పాల్పడతామని బెదిరిస్తే.. వారికి ఏడాది పాటు జైలుశిక్ష, జరిమానా, సామాజిక సేవను శిక్షగా విధించవచ్చన్నారు. అయితే బీఎన్ఎస్‌లో ఎక్కడా కూడా సామాజిక సేవ గురించి ప్రస్తావనే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కిలిగినీడి చిదంబరం, ప్రధాన కార్యదర్శి నన్నపనేని శ్రీహరి, ఉపాధ్యక్షుడు ఎన్.రంగారెడ్డిలతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అరకు కాఫీ రైతుల కష్టాన్ని విస్మరించిన మోదీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఆదివాసీ రైతుల కృషితో ఆర్గానిక్ కాఫీ సాగు వల్ల అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందనే విషయాన్ని ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో గుర్తించకపోవడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తప్పుబట్టారు. ఈ విషయమై సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గిరిజన రైతుల్ని విస్మరించి కాఫీ సాగు గురించి మోదీ మాట్లాడడం మోసం చేయడమేనని తెలిపారు. దేశ ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో చంద్రబాబుతో కాఫీ తాగిన ఫొటోని పోస్ట్ చేసి, అరకు కాఫీ ఆర్గానిక్ కాఫీ రుచికి శ్రేష్ఠమైనదని జి.20 సదస్సుకు హాజరైన అందరికీ అరకు కాఫీ అందించామని గొప్పలు చెప్పారని పేర్కొన్నారు. అంత అద్భుతమైన కాఫీని పండిస్తున్న 1.5 లక్షల రైతుల శ్రమ, గిట్టుబాటు ధర గురించి మోదీ ప్రస్తావించకపోవడం అన్యాయమని తెలిపారు. ఆదివాసీ కాఫీ రైతులకు గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో తీవ్రంగా మోసపోతున్నారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ నిరాకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నిరాశ ఎదురైంది. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో కవిత బెయిల్ దరఖాస్తులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. సీబీఐ, ఈడీ కేసుల్లో ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ సోమవారం తీర్పు వెలువరించారు. కవిత దాఖలు చేసిన రెండు పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు జస్టిస్ శర్మ తన తీర్పులో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థల సేకరించిన ఆధారాలు, అప్రూవర్ల స్టేట్‌మెంట్లు ఆధారంగా బెయిల్ ఇవ్వరాదన్న వాదన, పీఎంఎల్ఏ సెక్షన్ 45, ఈ దశలో పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వొచ్చా అనే అంశాలు పరిగణనలోకి తీసుకొని తీర్పు ఇచ్చినట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం బెయిల్ దరఖాస్తుల్లో దర్యాప్తు సంస్థలు సేకరించిన ఆధారాలు పరిశీలిస్తే ఇండోస్పిరిట్స్ ఏర్పాటు, కిక్‌బ్యాక్‌ల చెల్లింపు, ఇతరత్రా కార్యకలాపాల్లో కవిత భాగస్వాములైనట్టు కోర్టు విశ్వసిస్తోందన్నారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో తొలుత ఈడీ మార్చి 15న, సీబీఐ ఏప్రిల్ 11న కవితను అరెస్టు చేసిన విషయం విదితమే.

నెల్లిమర్ల జూట్‌మిల్ మళ్లీ మూత

▶ మొదటి పేజీ తరువాయి

జూట్ యాజమాన్యం చెల్లించలేదని కార్మికులు చెబుతున్నారు. చెక్కులు ఇచ్చినప్పటికీ ఖాతాలో నగదు లేకపోవడంతో చెల్లకుండాపోతున్నాయని రిటైర్డ్ కార్మికులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మిల్‌ను తెరిపించే ఏర్పాట్లు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.


కార్మికులకు న్యాయం చేయాలి


రిటైర్డ్ కార్మికులకు 2016 నుంచి గ్రాట్యుటీ బకాయిలు కూడా జూట్ యాజమాన్యం చెల్లించలేదు. వారికి చెక్కులు ఇచ్చినప్పటికీ ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్కులు చెల్లకుండా పోతున్నాయి. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. కర్మాగారం తెరిపించే ఏర్పాట్లు చేయాలి.

– కిల్లంపల్లి రామారావు,
సీపీఎం నాయకుడు, నెల్లిమర్ల

వైజాగ్ వారియర్స్ విజయం

ఏపీఎల్–3లో బెజవాడ టైగర్స్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపు






విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)–3 రెండో మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై వైజాగ్ వారియర్స్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. విశాఖపట్నంలోని వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ ఆరు వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. మనీష్ (44 పరుగులు), రాహుల్ (30 పరుగులు), అవినాష్ (23 పరుగులు) రాణించారు. వైజాగ్ వారియర్స్ బౌలర్ సుదర్శన్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన వారియర్స్ ఓపెనర్లు సుహాన్(27 పరుగులు), అశ్విన్ హెబ్బార్(35 పరుగులు) నిలకడగా రాణించి తొలి వికెట్‌కు 59 పరుగులు జోడించారు. అనంతరం షిండే డకౌట్‌గా వెనుతిరగ్గా.. కెప్టెన్ కె.ఎస్.భరత్(23 బంతుల్లో 46 నాటౌట్), యువన్(20 పరుగులు) జట్టును విజయతీరానికి చేర్చారు. బెజవాడ టైగర్స్ బౌలర్ అఖిల్ రెండు వికెట్లు తీశాడు.

ఉత్తరాంధ్ర లయన్స్ విజయం

మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో కోస్టల్ రైడర్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ 131 పరుగులకే ఆలౌటైంది. అభిషేక్ 28, ధ్రువ్ 25, లేఖజ్ 24 పరుగులు చేయగా.. అయ్యప్ప నాలుగు, కల్దీకుమార్ మూడు, సిర్లా శ్రీనివాస్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు కేవలం ఒకే వికెట్ కోల్పోయి 8.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. తరుణ్ 50, తపస్వి 52, గుల్ఫమ్ 24 పరుగులతో రాణించారు.

ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

- టెన్త్‌లో 63 శాతం..ఇంటర్‌లో 69 శాతం ఉత్తీర్ణత
- ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి లోకేశ్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ఫలితాలను సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి 8 వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 15,058 విద్యార్థులు హాజరు కాగా, 9,531 మంది (63.30 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 27,279 విద్యార్థులు హాజరు కాగా 18,842 మంది (69.07 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వెబ్‌సైట్ https://apopenschool.ap.gov.in/ చూడవచ్చని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వర్‌రావు తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులు రీ కౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.200, రీ వెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.